గీతం
డీమ్డ్ టు బి యూనివర్సిటీ
బెంగళూరు • హైదరాబాద్ • విశాఖపట్నం

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM


తాడేపల్లిగూడెం

: fb.com/vaartha Digital

Published from Tadepalligudem, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Srikakulam

19-7-2026 ఆదివారం సంపుటి: 32 సంచిక: 169 పేజీలు: 8+4 వెల: 8.00

GITAM
DEEMED TO BE UNIVERSITY
BENGALURU • HYDERABAD • VISAKHAPATNAM





శనివారం న్యూఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద నిరాహారదీక్ష చేపట్టిన అభిజిత్ దీప్కేను కలిసిన బృందాకరత్

## విక్రమ్-1 సక్సెస్

>> 11 గంటల 30 నిమిషాలకు జరగాల్సి ఉంది. ప్రయోగం చివరిదైన నిమిషాలలో సరిగ్గా 11 గంటల 20 నిమిషాలకు సాంకేతిక లోపాన్ని గుర్తించి కౌంట్ డౌన్‌ను తాత్కాలికంగా నిలిపివేశారు. దీంతో షార్ ఉత్కంఠ నెలకొంది. అనంతరం రాకెట్‌లోని అన్ని విభాగాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి తిరిగి ప్రయోగానికి శాస్త్రవేత్తలు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. కౌంట్ డౌన్‌ను 11.45 నిమిషాలకు తిరిగి ప్రారంభించి 20 నిమిషాల పాటు కౌంట్ డౌన్‌ను కొనసాగించారు. 12 గంటల 5 నిమిషాలకు రాకెట్‌ను నింగిలోకి పంపారు.

**నాలుగు దశల్లో ప్రయోగం:**

విక్రమ్ వన్ రాకెట్ ప్రయోగం నాలుగుదశల్లో జరిగింది. మొదటి మూడు దశల్లో ఘన ఇంధనాన్ని ఉపయోగించగా, నాలుగవ దశలో ద్రవ ఇంధనాన్ని ఉపయోగించారు. 350 కిలోల బరువు గల ఉపగ్రహాలను నిర్దేశించిన 450 కిలోమీటర్ల ఎత్తులోని కక్ష్యలోకి విక్రమ్ వన్ రాకెట్ విజయవంతంగా ప్రవేశపెట్టింది.

**రాకెట్‌లోని పేలోడ్లు:**

మిషన్ ఆగమన్ అనే పేరుతో నిర్వహించిన ఈ ప్రయోగంలో విక్రమ్ వన్ రాకెట్‌లో స్కై రూట్ రూపొందించిన స్పోర్ట్స్‌శాటిలైట్, గృహ స్పేస్, మిషన్ ఎంట్రాన్స్ అనే పేరుతో అంతరిక్షంలోకి పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించే విధంగా రూపొందించిన ప్రథమ సాఫ్ట్ రోబోటిక్ గ్రిప్పర్ సిస్టం, కాస్మిక్ బ్లూమ్, విక్రమ్ వన్ సూక్ష్మ రాకెట్ నమూనా, 18 క్యారెట్ల బంగారంతో తయారుచేసిన అంతరిక్ష పితామహులు సర్ సి.వి.రామన్, డాక్టర్ విక్రమ్ సారాభాయ్, ఏపీజే అబ్దుల్ కలాంల సూక్ష్మ ప్రతిమలు, ప్రధానమంత్రి మోదీ స్వయంగా రాసిన వందేమాతరం పోస్ట్‌కార్డు, దేశంలో నలుమూలల నుంచి వచ్చిన శుభాకాంక్షల పోస్ట్ కార్డులను రాకెట్‌లో పేలోడ్లుగా పొందుపరిచారు. ఈ పేలోడ్లను విక్రమ్ వన్ రాకెట్ విజయవంతంగా అంతరిక్షంలోకి ప్రవేశపెట్టింది.

**విజయ పరంపర కొనసాగాలి:ప్రధాని మోదీ**

విక్రమ్ వన్ ప్రయోగ విజయం తర్వాత శ్రీహరికోటలోని మిషన్ కంట్రోల్ సెంటర్లో భారత ప్రధాని నరేంద్ర మోదీ సెల్ ఫోన్‌లో ప్రథమ స్వదేశీ ప్రైవేట్ భాగస్వామ్యంతో రూపొందించిన విక్రమ్ రాకెట్ ప్రయోగం విజయం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అనంతరం స్కై రూట్ సిఇఒ డాక్టర్ పవన్ కుమార్ చందనను అభినందించారు. ఈ విజయ పరంపర ఇలాగే కొనసాగాలి అని చెప్పారు. ప్రభుత్వం స్పేస్ టెక్నాలజీ రంగంలో ప్రైవేట్ రంగానికి ఇస్తున్న ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకున్నందుకు సంస్థను ప్రశంసించారు. అలాగే షార్ స్కై రూట్ సంస్థ సమిష్టి కృషితో ఈ విజయం సాధించడం అంతరిక్ష రంగంలో శుభపరిణామంగా ఆయన అభివర్ణించారు. ఈ సందర్భంగా సిఇఒ పవన్ కుమార్ చందన ప్రధానితో మాట్లాడుతూ మీరు పంపిన వందేమాతరం పోస్ట్ కార్డును విజయవంతంగా అంతరిక్షంలోకి విక్రమ్ వన్ రాకెట్ ప్రవేశపెట్టిందంటూ చెప్పారు. ప్రయోగానికి ముఖ్యఅతిథిగా హాజరైనకేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ మాట్లాడుతూ భారతదేశంలో ఇటువంటి ఘనతను సాధించడం మంచి పరిణామం అన్నారు.రాష్ట్ర ఐటీ,విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ స్కై రూట్ సంస్థ సాధించిన విజయం తెలుగు ప్రజలకు గర్వకారణమన్నారు.


శనివారం హైదరాబాద్‌లో డి.సిఎం పవన్‌ను పరామర్శిస్తున్న మంత్రి నారా లోకేష్

## డి.సిఎం పవన్‌ను పరామర్శించిన మంత్రి లోకేష్

**విజయవాడ,జులై 18, ప్రభాతవార్తప్రతినిధి:** డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ను మంత్రి నారా లోకేష్ పరామర్శించారు. ఇటీవల ముంబయిలో కుడి భుజానికి శస్త్రచికిత్స చేయించుకుని డిశ్చార్జి అయి వచ్చి హైదరాబాద్ నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ విశ్రాంతి తీసుకుంటున్నారు.ఆయనను శనివారం విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పరామర్శించారు. పవన్ కళ్యాణ్ నివాసానికి వచ్చిన లోకేష్ ఆయన ఆరోగ్యవిషయంలో శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.శస్త్రచికిత్స విజయవంతమైనందుకు సంతోషాన్ని వ్యక్తం చేసారు.ఇరువురు వర్తమాన రాజకీయాంశాలపై చర్చించారు.

## ఆర్టీసీ బస్సు బోల్తా

>> పక్కన గల ముళ్లచెట్లు ఉండడంతో బస్సు ను గట్టిగా ఆపింది. దీని వల్ల ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. లేని పక్షంలో పెద్ద ప్రమాదం జరిగి ఉండేది. ముఖ్యంగా ఆర్‌అండ్‌బి రహదారి వెడల్పు లేకపోవడంతో రెండు బస్సులు ఎదురెదురుగా ప్రయాణించాలంటే ప్రమాదకరంగా తయారైంది. ఆర్‌అండ్‌బి రహదారిని విస్తరిస్తే తప్ప ప్రమాదాలు నివారించబడవు. జిల్లా ఆర్టీసీ రీజనల్ మేనేజర్ జి.సత్యనారాయణ, ఒంగోలు ఆర్టీసీ డిపో మేనేజర్ టీజే చంద్రశేఖర్, సూపరింటెండెంట్ నాయక్, వీఆర్‌కోట సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆర్.ప్రసాద్, సంతనూతలపాడు ఎస్సై వేజెండ్ల అజయ్‌బాబు, పోలీసు సిబ్బంది ప్రమాద సంఘటనను పరిశీలించారు. పోలీసు శాఖ, స్థానిక గ్రామస్తులు ప్రమాదం జరిగిన వేళ సత్వరమే స్పందించి ప్రయాణికులను బస్సులో నుంచి బయటకు తరలించారు. గాయపడ్డ 17 మందికి ఆర్టీసీశాఖ నుండి తాత్కాలికంగా ఒక్కొక్కరికి రూ.1500లు పారితోషికంను అందజేశారు. సంతనూతలపాడు ఎస్సై అజయ్‌బాబు ప్రమాద సంఘటనపై కేసు నమోదు చేశారు. పెద్ద ప్రమాదం తప్పిపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. కండక్టర్ బేగం, మరొక వ్యక్తికి మినహా మిగిలిన 15 మందికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ బస్సులో అనకర్లపూడి నుండి మద్దులూరు హైస్కూల్‌కు పది మంది విద్యార్థులు పయనించారు. విద్యార్థులు కూడా సురక్షితంగా బయటపడ్డారు. వారంతా తమ స్వగ్రామం అనకర్లపూడికి తరలి వెళ్లారు. విద్యాశాఖాధికారులు వారి స్వగ్రామంలో వారిని పరామర్శించారు.

## పోలవరం ప్రాజెక్టుకు అదనపు నిధులు విడుదల

**విజయవాడ జులై 18, ప్రభాతవార్తప్రతినిధి:** పోలవరం ప్రాజెక్టుకు అదనపు నిధులను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. ప్రాజెక్టుకు రూ.24.94 కోట్ల అదనపు నిధులు విడుదల చేసింది. ప్రాజెక్టును నిర్దేశిత వ్యవధిలో పూర్తి చేసే దిశలో ప్రభుత్వం అడుగులు వేస్తోంది.వచ్చే యేడాది ప్రథమార్ధంలో ప్రాజెక్టును పూర్తి చేయాలనే దిశలో ప్రభుత్వం ఉంది.ఇటీవల సాగునీటి ప్రాజెక్టుల పూర్తి, శంకుస్థాన సందర్భాల తేదిల వెల్లడి సందర్భంలోను ప్రభుత్వం ఈ విషయాన్ని స్పష్టం చేసింది.

## 4 చిత్రాలు.. 8 అవార్డులు

>> చిత్రంగా నిలిచింది. అద్భుతమైన సంభాషణలు రాసి జీవిత సత్యాలెన్నో చెప్పిన లక్కీభాస్కర్ దర్శకుడు వెంకీ అట్లూరికి ఉత్తమ సంభాషణల రచయితగా జాతీయ అవార్డు దక్కించుకున్నారు. ఇక బాక్సాఫీసును ఊపు ఊపేసిన చిత్రం పుష్ప2 ఇపుడు ఏకంగార రెండు జాతీయ అవార్డులు సొంతంచేసుకుంది. ఉత్తమ స్క్రీన్‌ప్లే రచయిత సుకుమార్ ఒరిజినల్ కేటగిరీలో అవార్డురాగా ఉత్తమ కాస్ట్యూమ్స్ డిజైనర్‌గా దీపాలినూర్, సీతల్‌శర్మలకు అవార్డు వచ్చింది. అలాగే 35 చిన్న కథకాదు ఇపుడు జాతీయ అవార్డుల్లో ఉత్తమ బాలల చిత్రంతోపాటు ఉత్తమ బాలనటుడు అరుణ్‌దేవ్ పోతులకూ జాతీయ అవార్డులు వచ్చాయి.

## రావణ్ రిమాండ్ పొడిగింపు

**గన్నవరం(కృష్ణా), జులై 18, ప్రభాతవార్త :** ఉపాకేసులో నెల్లూరు జైలులో జ్యుడిషియల్ రిమాండ్‌లో ఉన్న యూట్యుబర్ బచ్చలకూరి జోసెఫ్ ఎలియాస్ ప్రశ్న రావణ్ రిమాండ్‌ను మరో 14రోజులు పొడిగిస్తూ గన్నవరం కోర్టు ఆదేశాలు ఇచ్చింది. గతంలో విధించిన రిమాండ్ గడువు శనివారంతో ముగియటంతో శనివారం రావణ్‌ను పోలీసులు వర్చువల్‌గా కోర్టులో హాజరుపరచారు.

**21వతేదీ విచారణకు రావాలని గమన, ఇంద్రసేనకు నోటీసులు :**

రావణ్ కేసులో గమన, ఇంద్రసేనలను పోలీసులు శనివారం సుదీర్ఘంగా విచారించారు. ఉదయం నుండి సాయంత్రం వరకు వీరిద్దరిని వేర్వేరుగా ఉంచి గన్నవరం డిఎస్పీ కార్యాలయంలో గన్నవరం సిఐ శివప్రసాద్ విచారించారు. పోలీసులు అడుగుతున్న ఏప్రశ్నకు వీరిద్దరూ సరైన సమాధానం ఇవ్వటంలేదు. సాంకేతిక ఆధారాలు వచ్చిన తరువాత వీరిని మరోమారు విచారించేందుకు నిర్ణయించిన పోలీస్ అధికారులు ఈనెల 21వతేదీ విచారణకు రావాలని నోటీసులు ఇచ్చి ఇద్దర్నీ పంపించివేసారు.

## గుంటూరులో మహిళపై దాడి

>> వేగవంతం చేయాలని సూచించారు. కేసు దర్యాప్తును మరింత వేగవంతం చేసి అన్ని కోణాల్లో విచారణ కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. అదే సమయంలో బాధితురాలి ఫిర్యాదుపై సకాలంలో స్పందించడంలో లోపాలు జరిగినట్లు ప్రాథమిక విచారణలో తేలడంతో నగరంపాలెం సిఐ సత్యనారాయణపై శాఖాపరమైన క్రమశిక్షణా చర్యలకు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ సిఫార్సు చేశారు. మహిళల భద్రతకు సంబంధించిన ప్రతి ఫిర్యాదును అత్యంత బాధ్యతతో స్వీకరించి వెంటనే చర్యలు తీసుకోవాలని అన్ని పోలీసు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మహిళల భద్రత, న్యాయ పరిరక్షణ విషయంలో గుంటూరు జిల్లా పోలీసు శాఖ రాజీలేని వైఖరితో వ్యవహరిస్తుందని ఎస్పీ స్పష్టం చేశారు.

## చట్టం ఎవరినీ వదలదు..

**విజయవాడ, జులై18, ప్రభాతవార్తప్రతినిధి:** గుంటూరులో మహిళను వివస్త్రను చేసి దాడికి పాల్పడిన ఘటనను ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. దీనిపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి, నిందితులపై కఠినమైన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. మహిళల భద్రతకు ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యత ఇస్తుందని స్పష్టంచేశారు. సమాజంలో ఏ ఒక్క మహిళకు అవమానం జరిగినా అది ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదన్నారు. సమాజంలో ఇలాంటి వాటికి తావులేదని సిఎం తెలిపారు. ఈ ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి, నిందితులపై కఠినమైన చర్యలు తీసుకోవాలని చంద్రబాబు ఆదేశించారు. ఈ దారుణానికి సంబంధించి ఇప్పటికే క్రిమినల్ కేసు నమోదైందని, నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారని చెప్పారు. ఈ ఉదంతంలో ప్రమేయం ఉన్న పార్టీ కార్యకర్తను తక్షణమే పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నామని తెలిపారు. రాజకీయ అండదండలు ఉన్నా సరే చట్టం వదిలిపెట్టదని సిఎం స్పష్టం చేశారు. ప్రభుత్వం తప్పు చేసిన వారి విషయంలో అత్యంత కఠినంగా వ్యవహరిస్తుందని వివరించారు. చట్టం ఎవరికీ లొంగదు, పక్షపాతం చూపదన్నారు. ప్రతి మహిళకు తమ గౌరవానికి, భద్రతకు ఎల్లప్పుడూ రక్షణ ఉంటుందనే నమ్మకాన్ని కల్పించడమే ప్రభుత్వ ధ్యేయమని చంద్రబాబు ఎక్స్ వేదికగా పోస్ట్‌చేశారు.

## చలనచిత్ర అవార్డులు

>> నటిగా ఆర్టికల్ 370లో నటించిన యామిగౌతమ్ ఎంపికయింది. ఉత్తమ దర్శకుడుగా రాజ్‌కుమార్ పెరియాసామి అమరన్ చిత్రానికిగాను ఎంపికయ్యారు. ఉత్తమ తెలుగుచిత్రంగా కమిటీ కుర్రోళ్లు జాతీయ పురస్కారానికి ఎంపికకాగా ఉత్తమ తమిళ చిత్రంగా రాయన్‌ను ఎంపికచేసారు.

**జాతీయ చలన చిత్ర అవార్డులపరంగా**

ఉత్తమ నటుడు: కార్తిక్ ఆర్యన్ (చందూ చాంపియన్ చిత్రం)
ఉత్తమ నటుడు: ముమ్మొట్టి (భ్రమయుగం)
ఉత్తమ నటి: యామిగౌతమ్ (ఆర్టికల్ 370)
ఉత్తమ దర్శకత్వం: రాజ్‌కుమార్‌పెరియాసామి (అమరన్)
ఉత్తమ సహాయనటి: మథ్య (రూపశ్రీ వర్కాడే)
ఉత్తమ సహాయనటి : సచన నమిదాస్ (మహారాజ)
ఉత్తమ సహాయనటుడు: సంజయ్ మిశ్రా (బక్షక్ చిత్రం)
ఉత్తమ తెలుగు చిత్రం: కమిటీ కుర్రోళ్లు
ఉత్తమ బాలల చిత్రం: చిన్నకథకాదు (దర్శకుడు నందకిశోర్)
ఉత్తమ జాతీయ విలువల చిత్రం: కెప్టెన్‌మిల్లర్ ( దర్శకుడు అరుణ్ మాథేశ్వరన్)
ఉత్తమ ప్రజాదరణ చిత్రం: కల్కి 2898 (నాగ్ అశ్విన్)
ఉత్తమ తొలిచిత్ర దర్శకుడు: రణదీప్ హుడా (స్వాతంత్ర్య వీర్‌సావర్కర్)
ఉత్తమ యాక్షన్ చిత్రం : మహారాజ (తమిళం)
ఉత్తమ నృత్యదర్శకత్వం: విజయ్ గంగూలీ (ఆజ్‌కిరాత్ స్త్రీ-2)
ఉత్తమ గేయరచన: మనోజ్ ముంతాషిర్ (జానేదో మైదాన్0
ఉత్తమ సంగీతం(నేపథ్యం): జివి ప్రకాష్‌కుమార్ (అమరన్)
ఉత్తమ సంగీతం (పాటలు): శశ్వాంత్ సచ్‌దేవ్ (ఆర్టికల్ 370)
ఉత్తమ మేకప్ : పి.రవికుమార్ (కమిటీ కుర్రోళ్లు)
ఉత్తమ కాస్ట్యూమ్స్ డిజైన్: దీపాలి నూర్,శీతల్‌శర్మ (పుష్ప-2)
ఉత్తమ ప్రొడక్షన్ డిజైనర్ : నితన్ జిహనీ చౌదరి (కల్కి 2898ఎడి)
ఉత్తమ ఎడిటింగ్ : ఆర్ కలైవానన్ (అమరన్)
ఉత్తమ సౌండ్ డిజైనింగ్ : మానస్ చౌదరి (భూల్ భులయ్యా-3 హిందీ)
ఉత్తమస్క్రీన్‌ప్లే రచయిత (అడాప్టెడ్): యోదేశ్‌దేశ్ పాండే (స్వరగంధర్వ సుదీర్ ఫాడ్కే)
ఉత్తమ స్క్రీన్‌ప్లే రచయిత ఒరిజినల్: సుకుమార్ (పుష్ప-2)
ఉత్తమ సినిమాటోగ్రఫీ : షెహనాద్‌జ లాల్ (భ్రమయుగం)
ఉత్తమ గాయని: వైకోమ్ విజయలక్ష్మి (ఎఆర్ఎం)
ఉత్తమ గాయకకుడు : అభయ్ జోథ్‌పూర్కర్ (గరాత్ గణపతి)
ఉత్తమ బాలనటులు: రిద్దిమాన్ బెనర్జీ, తపోమయ్‌దేవ్, గీతాశ్రీచక్రవర్తి(ఆంకోంకి కితిన్-బెంగాలి)
ఉత్తమ బాలనటుడు: అరుణ్‌దేవ్ పోతుల (35-చిన్నకథకాదు)
ఉత్తమ బాలనటుడు: అతిశ్‌శెట్టి
ప్రత్యేక ప్రస్తావన: మెయ్యజగన్-తమిళ్ ఫిలిం సౌండ్‌మిక్స్ ఇంజినీర్ సురేన్‌జి
కెప్టెన్ మిల్లర్ (తమిళ్): ధనుష్

కాగా ఈ పురస్కారాల్లో ప్రాంతీయ చిత్రాలకు కూడా అవార్డులు దక్కాయి. వీటిలో ఉత్తమ తెలుగు చిత్రంగా కమిటీ కుర్రోళ్లు, ఉత్తమ తమిళచిత్రంగా రాయన్, ఉత్తమ ఒడియా చిత్రంగా లహరి, ఉత్తమ మరాఠీ చిత్రంగా ముక్కమ్‌పోస్ట్ బొంబిల్‌వాడి, ఉత్తమ మణిపురిచిత్రంగా సునీత, ఉత్తమ మళయాళ చిత్రంగా ఫెమినిచ్చి ఫాతిమా, ఉత్తమ కొంకణి చిత్రంగా మోగ్ ఆసుమ్, ఉత్తమకన్నడ చిత్రంగా మిథియా,ఉత్తమ హిందీ చిత్రంగా శ్రీకాంత్, ఉత్తమ గుజరాతి చిత్రంగా మారన్, ఉత్తమ బెంగాలి చిత్రంగా చలిచిత్ర ఎకోన్, ఉత్తమ అస్సామీ చిత్రంగా జుయ్‌ఫిల్మ్ ఆరెంజ్ అండ్ పర్పుల్ ఎంపికయ్యాయి.

నాన్‌ఫీచర్ చిత్రాల కేటగిరీలో స్పెషల్‌జ్యూరీ చిత్రం కింద చోలా దోరా ఔర్ సుయ్ హిందిచిత్రం,భద్రకాళి నాటకం మళయాళంలో ఎంపికయ్యాయి. హిందీ కశ్మీరీ కేటగిరీలో ఉత్తమ స్క్రిప్ట్ ఓబర్ ఫరాజ్ ఆలీ ఎంపికయితే ఉత్తమ వాయిస్ ఓవర్‌లో సుందరాయ జయచంద్రన్ లిటిల్‌ప్లానెట్: ఎ టేల్ ఆఫ్‌ఫ్రాగ్స్‌కు ఎంపికయ్యారు . ఉత్తమ సంగీత దర్శకత్వంలో శివ్‌పాల్‌సింగ్ కాంగ్ ఛాయా మగవీర్ పరాట్ 41 డిగ్రీస్ అన్న చిత్రానికి ఎంపికచేసారు.

ఉత్తమ లఘుచిత్రంగా మరాఠికి చెందిన హామ్‌సఫర్, ఉత్తమ యానిమేషన్ చిత్రంగా టచ్డ్ ఏజ్ వాటర్, ఉత్తమ సాంఘిక పర్యావరణ విలువలున్న చిత్రంగా పిప్లంత్రి ఏ టేల్ ఆఫ్ ఎకో ఫెమినిజం, ఉత్తమ డాక్యుమెంటరీ చినరతంగా రామ్‌నామి (హిందీ),ఉత్తమ ఆర్ట్ కల్చర్ చిత్రం మెయిన్‌నిదా (హిందీ) ఉత్తమ హిస్టారికల్ పునర్నిర్మాణ చిత్రంగా కకోరి హిందీచిత్రం ఎంపికయ్యాయి.

## చెత్తనుంచి సంపద సృష్టి

>> నతో మనం పనిచేయాలి అన్నారు. ప్రభుత్వానికి ప్రజలు సహకరిస్తేనే స్వచ్ఛతా లక్ష్యం సాధ్యం అవుతుంది.పచ్చదనం, పరిశుభ్రత ఉంటేనే మన లక్ష్యాన్ని సాధించగలం.. శాంతిభద్రతలు, సంక్షేమం, ఆదాయంతో మెరుగైన జీవన ప్రమాణాలు ప్రజలకు ఉండాలన్నదే మా లక్ష్యం అన్నారు. తెలుగు జాతి భవిష్యత్తును రక్షించే బాధ్యత నేను తీసుకున్నాను.పూర్తి పారదర్శకంగా సుపరిపాలన అందిస్తున్నాం. ఎట్టి పరిస్థితుల్లోనూ అవినీతి సహించబోం అన్నారు. మన ప్రజా రాజధాని అమరావతిని కాపాడుకునేలా ప్రతీ ఒక్కరూ స్ఫూర్తిగా పనిచేయాలి.. గతంలో జన్మభూమి పిలుపు ఇచ్చినప్పుడు ప్రపంచ వ్యాప్తంగా వచ్చి పనిచేశారు. ఇదే స్ఫూర్తి కొనసాగాలి అన్నారు. 120 పట్టణ ప్రాంత స్థానిక సంస్థల కింద రూ.15,274 కోట్లతో వివిధ పనులకు శంకుస్థాపనలు చేశాం అన్నారు. ప్రజారోగ్య మున్సిపల్ ఇంజనీరింగ్ కింద ఈ పనులు చేపడుతున్నాం. ప్రతిఇంటికి కుళాయి ఇవ్వడానికి రూ.23 వేల కోట్లు ఖర్చు చేస్తున్నామన్నారు.

ప్రజలకు స్వచ్ఛమైన మంచినీరు ఇవ్వాలని ఆకాంక్షిస్తున్నామన్నారు. వాటర్ సప్లై కోసం రూ. 10 కోట్లు వరకు ఖర్చు చేస్తున్నాం. రాబోయే రోజుల్లో గుడివాడలో రూ.162 కోట్లు ఖర్చు పెడతాం. అందరి భాగస్వామ్యంతో అనేక పనులు పూర్తవుతాయి. గుడివాడ ప్రజలు బంపర్ మెజారిటీతో కూటమిని గెలిపించారు. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనతో ముందుకెళ్తున్నాం. కార్బన్ న్యూట్రల్స్ అనే కొత్త విధానం మనకు అలవాటు కావాలి. ఇంటి నుంచి చెత్త రాకుండా నెట్ జీరో అన్నది మన విధానం కావాలని పిలుపునిస్తున్నానని సిఎం చంద్రబాబు అన్నారు. కార్బన్ న్యూట్రల్స్ అనే కొత్త విధానం మనకు అలవాటు కావాలన్నారు.ఇంటిపై పడిన వర్షాన్ని భూగర్భజలాల కింద మార్చుకోవాలి అన్నారు. 12 ఏళ్లకు ముందు కృష్ణాడెల్టాకు నీటి ప్రవాహాలు తగ్గిపోయాయి. దేశానికి అన్నపూర్ణగా నిలిచిన కృష్ణా జిల్లా నీటి ప్రవాహాలు లేక సతమతం అయ్యింది.అందుకే 12 నెలల్లో పట్టిసీమ ప్రాజెక్టు పూర్తి చేసి డెల్టాకు గోదావరి నీళ్లు తెచ్చామని ముఖ్యమంత్రి తెలిపారు. గుంటూరులో ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన తగాదాలో తెలుగుదేశం పార్టీ కార్యకర్త ఓ మహిళ పట్ల దుర్మార్గంగా ప్రవర్తించారు. తక్షణం పార్టీ నుంచి సస్పెండ్ చేసి అరెస్టు చేసి చట్టపరంగా చర్యలు తీసుకున్నాను. ఉదాసీనంగా వ్యవహరించిన అధికారులను కూడా బదిలీ చేస్తున్నామని తెలిపారు. చట్టాన్ని ఎవరూ చేతుల్లోకి తీసుకునేందుకు వీల్లేదు.తప్పు చేసింది పరాయి పార్టీ వాడైనా మా పార్టీ వ్యక్తి అయినా మా ప్రభుత్వానికి ఒక్కటే. తప్పు చేసిన ఎవరినీ వదిలిపెట్టబోనని ప్రజలందరికీ మరో మారు చెబుతున్నానని సీఎం చంద్రబాబు స్పష్టం చేసారు.అంతకు ముందు ప్రజావేదిక సమీపంలో ఆన్ లైన్ వర్క్స్ మానిటరింగ్ సిస్టమ్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబుపరిశీలించారు. మెప్మా మహిళా సంఘాలు తయారు చేసి ప్రదర్శించిన ఉత్పత్తులను ఆసక్తిగా తిలకించిన సిఎం.. 'వన్ ఫ్యామిలీ వన్ ఎంట్రప్రెన్యూర్' కింద మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను చూసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమానికి మంత్రులు పి,నారాయణ, కొల్లు రవీంద్ర, ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యే వెనిగండ్ల రాము తదితరులు హాజరయ్యారు

**అమరావతికి, గుడివాడ బస్టాండ్ నిర్మాణానికి విరాళాలు ఇచ్చిన దాతలు**

అమరావతికి, గుడివాడ బస్టాండ్ నిర్మాణానికి దాతలు విరాళాలు ఇచ్చారు. అమరావతి కోసం రెండు బంగారు గాజులను గుడివాడకు చెందిన ఎలవర్తి సాయిశ్వేత సిఎంకు విరాళాలు అందించారు. అదేవిధంగా తమ అబ్బాయి నిర్వాన్ గణేశ్ దాచుకున్న నగదును కూడా ఆ దంపతులు నిర్మాణం కోసం ఇచ్చారు. గుడివాడ ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణానికి అన్నే నరసింహారావు, పుష్ప లీలావతి దంపతులు రూ. 3కోట్ల విరాళ చెక్కును సిఎం చంద్రబాబుకు అందజేశారు. అంతేకాకుండా గతంలో కూడా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణానికి రూ. 3కోట్లు విరాళం ఇచ్చారు.

## వారం - వర్జ్యం

**19-07-2026, ఆదివారం**
**శ్రీ పరాభవ నామ సంవత్సరం,**
**ఆషాఢమాసం, దక్షిణాయణం**
**గ్రీష్మ ఋతువు, శుక్లపక్షం,** పునర్వసు కార్తె
షష్ఠి రా.3.32
ఉత్తరఫల్గుణి సా.6.17
వర్జ్యం : రా.3.01-తె.4.41
దు.సా.4.54-సా.5.46
రాహుకాలం - సా.4.30-6.00

## వార్తాఫలం

**మేషం:** మాటల చాతుర్యంతో ఎదుటివారిని ఆకట్టుకుని పనులు చేస్తారు. వృత్తిలో మీ బుద్ధి కుశలత బాగా లాభిస్తుంది.

**వృషభం:** కుటుంబ పురోభివృద్ధి సాధిస్తారు. సంఘంలో గౌరవ మర్యాదలు పెంపొందుతాయి. నేర్పుగా ముందుకు సాగుతారు.

**మిథునం:** ఆధ్యాత్మిక విషయాలలో చురుకుగా పాల్గొంటారు. నూతన పదవీ ప్రాప్తి కలుగుతుంది. వాహన సౌఖ్యం.

**కర్కాటకం:** పూర్వపు మిత్రులను కలుసుకొని ఆనందంగా గడుపుతారు. ఆభరణాలు కొనుగోలు చేస్తారు. వస్త్ర లాభం.

**సింహం:** ఇతరుల సలహాలు అతిగా స్వీకరిస్తారు. కానీ మీ మనస్సుకు తోచిన పనులనే చేస్తారు. బంధువుల కలయిక.

**కన్య:** పెట్టుబడులకు తగిన లాభాలు పొందుతారు. ఉద్యోగులకు పదోన్నతులు పొందుతారు.అప్రయత్నంగా అవకాశాలు.

**తుల :** తప్పుకు తిరగకుండా ప్రతి సవాలును ధైర్యంగా ఎదుర్కొని అనుకూల ఫలితాలు సాధిస్తారు. వస్త్రలాభాలు.

**వృశ్చికం:** చేపట్టిన కార్యక్రమాలు నిదానంగా పూర్తి చేస్తారు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉంటుంది.

**ధనుస్సు:** వాహనం నడిపేటప్పుడు లావాదేవీలు, మధ్యవర్తిత్వము మొదలయిన వాటి విషయ వ్యవహారాలలో జాగ్రత్తలు పాటించండి.


**మకరం:** మీ క్రింది స్థాయి ఉద్యోగులు మీపై కొండెములు చెప్పడం మీకు తల నొప్పిగా మారుతుంది. స్పెక్యులేషన్ లాభించదు.

**కుంభం:** నమ్మకాలకు తావివ్వకుండా రొటీన్ సంతకాల విషయంలో వ్యక్తిగత బంధుత్వాలకు అతీతంగా వ్యవహరించండి.

**మీనం:** స్థిరాస్థి వివాదాలలో స్తబ్దత నెలకొంటుంది. సంబంధ బాంధవ్యాలు మెరుగ్గా ఉంటాయి. శుభవార్తలు అందుకొంటారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోలి, హైదరాబాద్

## వాంగ్చుక్ దీక్ష భగ్నం


నేడు జంతర్‌మంతర్ వద్ద దీక్ష ప్రారంభించిన సిజెపి చీఫ్ అభిజిత్ దీప్కే

>> గిన విచారణ ఈ ప్ రి ణా వ ా ని కి దారితీసింది. "ఏ పౌరుడి ప్రాణమైనా అత్యంత విలువైంది" అని పేర్కొన్న హైకోర్టు వాంగ్‌చుక్ ప్రాణాలను కాపాడటానికి అవసర మైన అన్ని వైద్య చర్యలు తీసుకోవాలని, రోజువారీ నివేదికలు సేకరించాలని కేంద్రప్రభుత్వానికి రెండు రోజుల క్రితమే స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. శుక్రవారం ఆయనను పరీక్షించిన వైద్యులు అవయవాలు విఫలమయ్యే (ఆర్గన్ ఫెయిల్యూర్) ప్రమాదం ఉందని, పరిస్థితి అత్యంత ఆందోళనకరంగా ఉందని హెచ్చరించడంతో పోలీసులు రంగంలోకిదిగారు. తాము కోర్టు ఆదేశాల మేరకే ఈ చర్య తీసుకుంటున్నట్లు మైకుల ద్వారా అనౌన్స్ చేశారు. 20 రోజులుగా కొనసాగుతున్న ఈ సుదీర్ఘ దీక్ష వల్ల వాంగ్‌చుక్ ఏకంగా 8 కేజీల బరువు తగ్గారు. ఆయన ఆరోగ్యం విషమిస్తుండటంతో గత రెండు రోజులుగా ప్రతిపక్ష నేతలు కాంగ్రెస్ నాయకుడు పవన్ ఖేరా, సమాజ్ వాదీ పార్టీ ఎంపీ డింపుల్ యాదవ్, ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ తదితరులు దీక్షా శిబిరానికి వచ్చి సంఘీభావం తెలిపారు. ఆరోగ్యం క్షీణిస్తున్న దృష్ట్యా దీక్ష విరమించాలని కోరారు. ఆసుపత్రిలోనూ నిరసన కొనసాగుతున్న తరుణంలో, జులై 20 నుంచి ప్రారంభం కానున్న పార్లమెంట్ వర్షాకాల సమావేశాల మొదటి రోజున పార్లమెంట్ మార్చ్ నిర్వహిస్తామని నిరసనకారులు ప్రకటించారు. ఈ మార్చ్‌లో అన్ని రాజకీయ పార్టీలు భాగస్వాములు కావాలని వారు విజ్ఞప్తి చేశారు.

**నా అనుమతిలేకుండా ఆయనకు చికిత్సచేయవద్దు:వాంగ్‌ఛుక్ సతీమణి**

పోలీసుల తీరుపై సోనమ్ సతీమణి గీతాంజలి జె ఆంగ్మో తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేశారు. తన అనుమతి లేకుండా తన భర్తకు ఎలాంటి చికిత్స చేయకూడదని హెచ్చరించారు. ఆయన సఫ్దర్‌జంగ్ ఆసుపత్రిలో ఉన్నారు. నా అనుమతి లేకుండా చికిత్స ప్రారంభించవద్దు. ఆయనకు ఏదైనా జరిగితే ప్రతి ఒక్కరిని బాధ్యులను చేస్తా. ఆయన నిన్న బాగానే కనిపించారు. ఆసుపత్రికి తీసుకురావాల్సిన అవసరం లేదు. మా వైద్యుడి అనుమతి లేకుండా ఏ చికిత్సా అందించడానికి వీల్లేదు. అది మా హక్కు అని సోనమ్ సతీమణి గీతాంజలి మీడియాకు స్పష్టంచేశారు. సోనమ్‌కు తగిన వైద్యసహాయం అందించాలంటూ ఢిల్లీ హైకోర్టు ఆదేశించిన నేపథ్యంలో పోలీసులు ఇవాళ నిరసన ప్రాంతం నుంచి ఆయనను బలవంతంగా తీసుకెళ్లారు. కోర్టు ఆదేశాల ప్రకారం వాంగ్‌చుక్‌ను తరలిస్తున్న సమయంలో నిరసనకారులు అడ్డుకోవడంతో స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. ప్రస్తుతం పరిస్థితి అదుపులోనే ఉంది. జంతర్‌మంతర్ వద్ద నిరసనకారులు శాంతియుతంగా వ్యవహరించాలని, వీలైనంత త్వరగా ఆ ప్రాంతాన్ని ఖాళీ చేయాలని కోరుతున్నాం అని ఢిల్లీ పోలీసులు ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు.

**ఆమరణదీక్షకు ఉపక్రమించిన సిజెపి చీఫ్ దీప్కే...**

వాంగ్‌ఛుక్‌ను ఆసుపత్రికి తరలించడంతో కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే శనివారం ఆమరణ దీక్షకు పూనుకున్నారు.వాంగ్‌చుక్ నిరాహార దీక్షకు కూర్చున్న ప్రదేశంలో అభిజీత్ దీప్కే ఆందోళనకు దిగారు. అయితే ఈనెల 20వ తేదీన జరగాల్సిన తమ ర్యాలీ యధావిధిగా జరుగుతుందని అన్నారు. జంతర్ మంతర్ నిరసన ప్రదేశానికి ప్రజలు రావాలని ఆయన వేడుకున్నారు. ప్రభుత్వం తీవ్రమైన తప్పు చేసిందని, ప్రతి ఒక్కరూ జంతర్ మంతర్ చేరుకోవాలని తెలిపారు. సిపిఐ ఎంఎల్‌కు చెందిన నేహా, అమీన్, మనీశ్ జంతర్ మంతర్ వద్ద 21వ రోజు కూడా దీక్ష చేపట్టనున్నట్లు ఎఐఎస్ఎ ప్రెసిడెంట్ ఎన్ సాయి బాలాజీ తెలిపారు.

## ఎపిలో పెట్టుబడుల పర్యాటకం

>> హోమ్‌స్టే నిర్వాహకులు, చేనేత కార్మికులు మరియు మహిళా ఉపాధి గ్రూపులకు ఆర్థిక ప్రయోజనం చేకూర్చేలా ఉండాలని స్పష్టం చేశారు. పర్యావరణ సమతుల్యతను కాపాడుతూనే స్థానిక సంస్కృతిని పెంపొందించడమే తమ ప్రభుత్వ విధానమన్నారు.ఈ సందర్భంగా ఎడిటిఒఐ సంస్థకు మంత్రి దుర్గేష్ 7 కార్యాచరణ అంశాలు ప్రతిపాదించారు. ప్రతి ప్రధాన ఎడిటిఒఐ చాప్టర్ ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి కనీసం రెండు ప్రత్యేక పర్యాటక సర్క్యూట్‌లను ప్రమోట్ చేయాలని కోరారు. విభిన్న వర్గాల పర్యాటకుల కోసం ఉమ్మడిగా 3, 5, 7 రోజుల ప్యాకేజీలను రూపొందించాలని తెలిపారు. టూర్ ఆపరేటర్ల కోసం త్వరలోనే ప్రత్యేక ఫామిలియరైజేషన్ టూర్లను ఏర్పాటు చేస్తామన్నారు. వాణిజ్యపరంగా లాభదాయకమైనవిగా, పర్యావరణ పరిరక్షణకు కట్టుబడేవిగా, సంస్కృతిని పెంపొందించేవిగా మరియు స్థానిక సమాజానికి మేలు చేసేవిగా ఉండే అద్భుతమైన ప్రయాణ అనుభూతులను మనం ఉమ్మడిగా సృష్టిద్దామన్నారు.అందరం కలిసి దేశీయ పర్యాటక రంగాన్ని బలోపేతం చేద్దాం, స్థానిక వర్గాలకు ఆర్థిక సాధికారత కల్పిద్దాం. తద్వారా జాతీయ సంకల్పమైన "స్వదేశీ పర్యటన్- సశక్తభారత్" సాకారంలో మన వంతు భాగస్వామ్యం అందిద్దామని మంత్రి కందుల దుర్గేష్ తన ప్రసంగాన్ని ముగించారు.ఈ సమావేశంలో పర్యాటక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్ జైన్, ఎడిటిఒఐ జాతీయ అధ్యక్షుడు వేద్ ఖన్నా, సంస్థ ముఖ్య ప్రతినిధులు, దేశంలోని వివిధ రాష్ట్రాల చాప్టర్ల ఛైర్మన్లు, పర్యాటక, హోటల్ రంగ ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**ఎపిలో గోల్ఫ్ టూరిజం అభివృద్ధిపై కపిల్ దేవ్‌తో మంత్రి కందుల దుర్గేష్ చర్చలు..**

రాష్ట్రంలో గోల్ఫ్ టూరిజం అభివృద్ధి, తద్వారా పర్యాటక రంగాన్ని బలోపేతం చేసే అంశాలపై రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ నోయిడా (ఢిల్లీ)లో సుప్రసిద్ధ క్రికెట్ మరియు గోల్ఫ్ క్రీడాకారుడు, పిజిటిఐ అధ్యక్షుడు కపిల్ దేవ్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో గోల్ఫ్ టూరిజం విస్తరణకు ఉన్న అవకాశాలపై ఇరువురు సుదీర్ఘంగా చర్చించారు. విశాఖపట్నం, అమరావతి ప్రాంతాలలో గోల్ఫ్ పర్యాటకాన్ని అభివృద్ధి చేసేందుకు గల సాధ్యాసాధ్యాలను మంత్రి దుర్గేష్ .. కపిల్ దేవ్‌కు వివరించారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన క్షేత్రస్థాయి పరిశీలన కోసం ఆంధ్రప్రదేశ్‌లో పర్యటించాల్సిందిగా కపిల్ దేవ్‌ను మంత్రి దుర్గేష్ అధికారికంగా ఆహ్వానించారు.

## గొల్లప్రోలులో కొవిడ్ కలకలం

>> ప్రకటనలో తెలిపారు.ఇదే విషయాన్ని సిఎంసి వైద్య నిపుణులు నిర్ధారించారని వెల్లడించారు. జిల్లాలో ఎటువంటి కోవిడ్ కేసులు లేవని ప్రజలు ఆందోళన చెందవలసిన అవసరం లేదని ఆమె తెలిపారు. మృతురాలి కుటుంబ సభ్యులకు వైద్యాధికారిణి డాక్టర్ భార్గవి కోవిడ్ పరీక్షలు నిర్వహించగా శాంపిల్స్‌ను వైద్యాధికారులు ల్యాబ్‌కు పంపించారు.

## విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో కొవిడ్ పాజిటివ్ కేసు!

**విజయవాడ, జులై18,ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో కొవిడ్ లక్షణాలతో 13 ఏళ్ల బాలిక అడ్మిట్ అయింది.ఆమె కోవిడ్ పాజిటీవ్ రిపోర్టు వచ్చినట్లు ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం బాలిక ఆస్పత్రిలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కొవిడ్ ఐసోలేషన్ వార్డులో ఉంచి చికిత్స అందిస్తున్నట్లు సమాచారం.

: fb.com/vaartha Digital
epaper.vaartha.com
WWW.VAARTHA.COM
తాడేపల్లిగూడెం
Published from Tadepalligudem, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kurnool, Kadapa, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Srikakulam

తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

19-7-2026 ఆదివారం
సంపుటి: 32 సంచిక: 169
పేజీలు: 8+4 వెల: 8.00

# చెత్తనుంచి సంపద సృష్టి

**అక్టోబర్ 2 నాటికి రాష్ట్రంలో చెత్తలేకుండా చేస్తాం**

**ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు**

**పూర్తి పారదర్శకంగా సుపరిపాలన**

**గుడివాడలో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో సిఎం చంద్రబాబు**



శనివారం గుడివాడలో స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ఆపరేషన్ క్లీన్ స్వీప్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సిఎం చంద్రబాబు

**విజయవాడ, జులై 18,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో అక్టోబర్ 2వ తేదీ నాటికి చెత్తలేకుండా చేస్తామని సిఎం చంద్రబాబునాయుడు తెలిపారు. కాలుష్యం మన ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోందని, చెత్త నిర్వహణలో ప్రతి కుటుంబం భాగస్వామ్యం కావాలని సూచించారు. ఇంట్లోనే తడి, పొడి చెత్తలను వేరు చేసుకోవాలని తెలిపారు. తడి చెత్తను కంపోస్ట్‌గా తయారు చేసుకోవాలని పేర్కొన్నారు. చెత్త నుంచి సంపద సృష్టించడమే కూటమి లక్ష్యం అని తెలిపారు. ఇంట్లో ఎవరికివారే తడి, పొడి చెత్తలను వేరు చేసుకోవాలని సూచించారు. తడి చెత్తను కంపోస్ట్‌గా తయారు చేసుకోవాలన్నారు. శాశ్వతంగా చెత్త నుంచి రాష్ట్రాన్ని విముక్తి చేస్తామని సిఎం స్పష్టం చేశారు.

కృష్ణా జిల్లా గుడివాడలో పర్యటించిన చంద్రబాబు, స్వచ్ఛాంధ్ర.స్వర్ణాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఎన్టీఆర్ గ్రౌండ్‌లోని ప్రజావేదిక సభలో పాల్గొని మాట్లాడారు. అమృత్ 2.0 ఎఐయుడిఎఫ్ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. స్వర్ణ పంచాయతీ ఉద్యోగులకు స్వచ్ఛ అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా సిఎం చంద్రబాబు ప్రసంగించారు. రాష్ట్రంలో ప్రతి మూడో శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమాల్లో పాల్గొంటున్నాను. 18వ స్వర్ణాంధ్రస్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని గుడివాడలో నిర్వహిస్తున్నాం. ఎన్టీఆర్ తొలిసారి ప్రజాక్షేత్రంలో నిలబడిన ప్రాంతం ఇది. స్వచ్ఛమైన రాజకీయాలు, స్వచ్ఛమైన ప్రజాప్రతినిధులు, స్వాభిమానం అనే అంశాలపై ఎన్టీఆర్ పార్టీ పెట్టారు. గతంలో స్వార్ధ రాజకీయాలు మాత్రమే ఉన్న పరిస్థితిని మార్చి అభివృద్ధి, సంక్షేమాన్ని తీసుకువచ్చారు అన్నారు. అర్హులందరికీ సంక్షేమం, రాష్ట్రంలో అభివృద్ధి, ఉపాధి ఉద్యోగాలు, సంపద వచ్చేలా పాలన అందిస్తున్నామన్నారు. రోడ్లు ఊడ్చటం ఒక్కటే పరిశుభ్రత కాదు, పర్యావరణం, ప్రజల ఆరోగ్యం మెరుగ్గా ఉండాలి. గత పాలనలో చెత్తాచెదారం నింపేసిన ఈ ప్రాంతాన్ని ఇప్పుడు పరిశుభ్రంగా తీర్చిదిద్దాం. మనజన్మస్థలాన్ని చెత్తలేకుండా పరిశుభ్రంగా ఉంచాలన్న ఆలోచ >>2



# విక్రమ్-1 సక్సెస్

**స్కైరూట్ రూపొందించిన ప్రైవేటు రాకెట్ రోదసిలోకి**

**ప్రధాని రాసిన 'వందేమాతరం' పోస్టుకార్డు కూడా అంతరిక్షంలోకి**

శనివారం శ్రీహరికోటలోని షార్ కేంద్రం నుంచి నింగిలోకి దూసుకుపోతున్న విక్రమ్-1 రాకెట్

**తొలుత స్వల్ప సాంకేతిక లోపం తలెత్తినా, వెంటనే సరిచేసి ప్రయోగించిన శాస్త్రవేత్తలు**

**విక్రమ్-1 ద్వారా ఉపగ్రహాలు కక్ష్యలోకి**

**రూపకర్తలకు అభినందనలు తెలిపిన ప్రధాని మోడీ, కేంద్రమంత్రి జితేంద్రసింగ్**

**సూళ్లూరుపేట, జూలై 18 ప్రభాతవార్త :** సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ శ్రీహరికోటలో హైదరాబాద్ చెందిన స్పేస్ టెక్ స్టాటప్ కంపెనీ స్కైరూట్ సంస్థ రూపొందించిన ప్రథమ స్వదేశీ ఆర్బిటాల్ రాకెట్ ప్రయోగం గ్రాండ్ సక్సెస్ అయింది. శనివారం శ్రీహరికోట లోని ప్రథమ లాంచ్ ప్యాడ్ నుంచి మధ్యాహ్నం 12 గంటల 5 నిమిషాలకు విక్రమ్ మన రాకెట్ నిప్పులు చెరుగుతూ నింగిలోకి దూసుకెళ్లింది. వాస్తవానికి ఈ ప్రయోగం ఉదయం >>2



రాకెట్ ప్రయోగం సక్సెస్‌తో హర్షం వ్యక్తం చేస్తున్న డా. పవన్ కుమార్ తదితరులు



శుక్రవారం న్యూఢిల్లీలో సోనం వాంగ్చుక్ ఆమరణ దీక్షను భగ్నంచేసి ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

# సోనం వాంగ్చుక్ దీక్ష భగ్నం

**20 రోజులుగా సాగుతున్న నిరాహారదీక్ష**

**అదేచోట దీక్ష ప్రారంభించిన సిజెపి చీఫ్ అభిజిత్ దీప్కే**

**నేడు పార్లమెంట్ మార్చ్ యధాతథం**

**న్యూఢిల్లీ,జులై 18:** దేశ రాజధానిలోని జంతర్ మంతర్ వద్ద గత 20 రోజులుగా సాగుతున్న సోనమ్ వాంగ్‌చుక్ నిరాహార దీక్ష శనివారం తెల్లవారుజామున ఊహించని మలుపు తిరిగింది. నీట్ పేపర్ లీక్ వ్యవహారానికి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలనే డిమాండ్‌తో 59 యేళ్ల పర్యావరణ, సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ ఈ కఠిన దీక్షకు దిగారు. ఈ నిరసనలకు మద్దతుగా నిలుస్తున్న కాక్రోచ్ జనతా పార్టీ కార్యకర్తల తీవ్ర నినాదాల మధ్య, పోలీసులు ఆయనను బలవంతంగా దీక్షా శిబిరం నుంచి తరలించి ఆసుపత్రిలో చేర్చారు. వాంగ్‌చుక్ ఆరోగ్యం క్షీణిస్తున్న నేపథ్యంలో ఢిల్లీ హైకోర్టులో జరి >>2

# గోదావరిలో చేపల వేట.. ఐదుగురు మృతి

**చింతూరు జూలై 18 ప్రభాత వార్త:** పోలవరం జిల్లా ఎటపాక మండలం గోమ్ముకొత్తగూడెం గ్రామానికి చెందిన గిరిజనులు శనివారం చేపల వేటకు వెళ్లి గోదావరి నది నీటిలో మునిగి ఐదుగురు మృతి చెందగా మరో ఆరుగురు సురక్షితంగా ప్రాణాలతో బయటపడ్డారు. ఒకే గ్రామానికి చెందిన ఐదుగురు మృతి చెండటంతో ఆ గ్రామములో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఈ ఘటనకు సంభందించిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. శనివారం ఉదయం గ్రామస్తులు గోదావరి నదిలో చేపల వేటకు వెళ్లాలని భావించి ఇద్దరు పురుషులు, 9 మంది మహిళలు కలిసి దోమ తెరలు తీసుకొని గోదావరి నదిలో దిగి వేట కొనసాగిస్తున్నారు. అదే సమయంలో లోతు ఎక్కువగా ఉన్న లోయలోకి 11 మంది జారీ పోయారు. వారిలో ఒక మహిళ ఒడ్డుకు చేరుకొని తన చీర సహాయంతో ఐదుగురు మహిళలు కాపాడింది. మొత్తం ఆరుగురు సురక్షితంగా బయట పడగా సుశీల , ఊకె లక్ష్మి , తుర్రం భారతి బాసిబోయిన బాలరాజు, ఊకె రమేష్‌లు గోదావరి నీటిలో మునిగిపోయారు. మిగిలిన వాళ్ల గ్రామస్తులకు, సమీపంలోని చేప బోట్లకు సమాచారం అందిం చారు. సమాచారం అందుకున్న ఎటపాక పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని గాలింపు చేపట్టి మృత దేహాలను వెలికి తీశారు.

# గొల్లప్రోలులో కొవిడ్ కలకలం

**చెన్నైలో చికిత్స పొందుతూ బాలిక మృతి**

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి,జూల18,ప్రభాతవార్త:** కాకినాడ జిల్లా గొల్లప్రోలు కు చెందిన ఒక బాలిక చెన్నైలో చికిత్స పొందుతూ కోవిడ్ లక్షణాలతో మృతి చెందడం స్థానికంగా కలకలం సృష్టించింది. స్థానిక జగనన్న కాలనీకి చెందిన 16 సంవత్సరాల బాలిక దీర్ఘకాలిక అనారోగ్య కారణాలతో గత కొన్ని సంవత్సరాలుగా కాకినాడ, విశాఖపట్నం ఆసుపత్రులలో చికిత్స పొందింది. మెరుగైన చికిత్స కోసం గత వారం చెన్నైలోని సిఎంసి హాస్పటల్ కు వెళ్లగా ఆమెకు అనేక పరీక్షలు నిర్వహించగా కోవిడ్ పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. కాగా రక్తహీనత ఇతర అనారోగ్య లక్షణాలతోనే బాలిక మృతి చెందిందని కాకినాడ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అనిత ఒక >>2

# 72వ జాతీయ చలనచిత్ర అవార్డులు

**ఉత్తమ తెలుగు చిత్రం: కమిటీ కుర్రోళ్లు**
**ఉత్తమ కన్నడ చిత్రం: మిధ్య**
**ఉత్తమ తమిళ చిత్రం: రాయన్**
**ఉత్తమ నటులుగా మమ్ముట్టి (భ్రమయుగం), కార్తిక్ ఆర్యన్ (చందూఛాంపియన్)**
**ఉత్తమ నటిగా యామి గౌతమ్ (ఆర్టికల్ 370)**



ఉత్తమ నటుడు మమ్ముట్టి (భ్రమయుగం)



ఉత్తమ నటి యామి గౌతమ్ (ఆర్టికల్ 370)

**న్యూఢిల్లీ,జులై 18:** జాతీయ చలనచిత్ర పురస్కారాలను కేంద్రం శనివారం ప్రకటించింది. 72వ అవార్డుల కోసం 2024 సంవత్సరానికిగాను మొత్తం 400కిపైగా చిత్రాలు జ్యూరీముందుకు రాగా వాటిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వాటిని ఎంపికచేసినట్లు కమిటీ వెల్లడించింది. ఉత్తమనటుడు అవార్డు ఇద్దరికి లభించింది. చందూ చాంపియన్ నటనకుగాను కార్తీక్ ఆర్యన్; భ్రమయుగం నటనకుగాను ముమ్ముట్టిలను ఈ అవార్డుకు ఎంపికచేసారు. అలాగే ఉత్తమ >>2

## 4 చిత్రాలు.. 8 అవార్డులు

**తెలుగు చలనచిత్ర ప్రతిభకు నిదర్శనాలు**




**న్యూఢిల్లీ,జులై 18:** కేంద్రం ప్రకటించిన 72వ జాతీయ చలనచిత్రపురస్కారాల్లో తెలుగు రాష్ట్రాల పంట పండింది. ప్రతిభకు నిదర్శనంగా ఈ పురస్కారాలు నిలిచాయి. నాలుగు చిత్రాలకుగాను 8 పురస్కారాలు వరించాయి. కమిటీ కుర్రోళ్లు ఉత్తమ ప్రాంతీయ చిత్రంగా ఎంపికయింది. ఉత్తమ మేకప్ విభాగంలోను అవార్డు వచ్చింది. ఇక నాగ్‌అశ్విన్ విజువల్ వండర్‌గా నిలిచిన కల్కి 2898 ఎడికి రెండు కేటగిరీల్లో పురస్కారాలు లభించాయి. సెట్స్,విజువల్స్ తో అలరించినందుకు ఉత్తమ ప్రొడక్షన్ డిజైన్ అవార్డుతోపాటు ఉత్తమ ప్రజాదరణ పొందిన >>2



శనివారం సంతనూతలపాడు మండలంలో బోల్తాపడ్డ ఆర్టీసి బస్సు

# ఆర్టీసీ బస్సు బోల్తా

**17 మందికి గాయాలు**

**సంతనూతలపాడు మండలంలో దుర్ఘటన**

**సంతనూతలపాడు, జులై 18, ప్రభాతవార్త :** సంతనూతలపాడు మండలం మద్దులూరు సమీపంలో శనివారం ఉదయం ఆర్టీసీ హైర్ బస్ బోల్తా పడగా 17 మంది గాయాలకు లోనయ్యారు. గాయాలకు గురైన వారిలో పది మంది కొండపి ప్రభుత్వ హాస్పిటల్‌లో మరొక ఏడుమంది ఒంగోలు ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ నందు చికిత్స పొందుతున్నారు. ప్రమాదంలో 15 మందికి స్వల్ప గాయాలయ్యాయి. మరొక ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో ఆర్టీసీ కండక్టర్ ఎస్‌కే బేగం, మరొక వృద్దునికి తీవ్ర గాయాలు కాగా ఒంగోలు ప్రభుత్వ జనరల్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. కామేపల్లి నుండి ఎపి 39 టీవై 1589 నంబర్ గల ఆర్టీసీ హైర్ బస్సు శనివారం ఉదయం 8గంటల ప్రాంతంలో ఒంగోలుకు బయలుదేరింది. ఈ బస్సు సంతనూతలపాడు మండలం మద్దులూరు సమీపంలో ఉన్న రొయ్యల ఫ్యాక్టరీ సమీపానికి చేరుకునే సరికి ఎదురుగా ఒంగోలు నుండి వస్తున్న ఆర్టీసీ బస్సును తప్పించబోయి బస్సు డ్రైవర్ మార్జిన్‌కు తిప్పడంతో బస్సు ఒరిగి రహదారి పక్కన డౌన్‌లో బోల్తా పడింది. అయితే >>2

# ఎపిలో పెట్టుబడుల పర్యాటకం

**టూరిజంకు పారిశ్రామిక హోదా కల్పించాలి**

**తిరుపతి నుంచి అరకుదాకా ఏడు పర్యాటక హబ్‌లు**

**ఢిల్లీలో జరిగిన సదస్సులో మంత్రి దుర్గేష్**

**విజయవాడ. జులై 18,ప్రభాతవార్తప్రతినిధి:** దేశీయ పర్యాటక రంగ అభివృద్ధిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అత్యంత కీలకమైన భూమిక పోషిస్తోందని టూరిజం. సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ పర్యాటక రంగాన్ని ఒక వ్యూహాత్మక ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. శనివారం న్యూఢిల్లీలో అసోసియేషన్ ఆఫ్ డొమెస్టిక్ టూర్ ఆపరేటర్స్ ఆఫ్ ఇండియా నిర్వహించిన "ఆల్ ఇండియా చాప్టర్ ఛైర్మన్ల సమావేశం 2026"కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. "స్వదేశీ పర్యటన్ - సశక్త్ భారత్" అనే ప్రధాన ఇతివృత్తంతో.. ఆంధ్రప్రదేశ్ మరియు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలపై ప్రత్యేక ఫోకస్‌తో జరిగిన సదస్సులో మంత్రి దుర్గేష్ కీలక ప్రసంగం చేస్తూ పర్యాటకరంగ సేవల్లో 30 ఏళ్ల పూర్తి చేసుకున్న ఎడిటిఒఐ సంస్థకు అభినందనలు తెలిపారు. దేశవ్యాప్తంగా 2,400 మందికి పైగా సభ్యులతో విస్తరించిన ఈ జాతీయ నెట్‌వర్క్, భారతీయ పర్యాటక రంగాన్ని ముందుకు నడిపించడంలో కీలక పాత్ర పోషిస్తోందని కొనియాడారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ల దూరదృష్టితో కూడిన నాయకత్వంలో, రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా కల్పించామని, పబ్లిక్‌ప్రైవేట్ పార్టనర్‌షిప్ పద్ధతిలో పెట్టుబడులను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. విశాఖపట్నం, అరకు లోయ, రాజమహేంద్రవరం, అమరావతి, శ్రీశైలం, గండికోట, తిరుపతిలను ఏడు ప్రధాన పర్యాటక హబ్‌లుగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఆధ్యాత్మికం, తీరప్రాంతం (కోస్టల్), పర్యావరణం (ఎకో), బౌద్ధ వారసత్వం, గ్రామీణ సంస్కృతి కలగలిసిన అరుదైన పర్యాటక అనుభూతి ఆంధ్రప్రదేశ్ సొంతమని పేర్కొన్నారు. తిరుపతి, శ్రీశైలం వంటి దివ్యక్షేత్రాల నుండి అరకు లోయ అందాలు, గండికోట గ్రాండ్ కాన్యన్, బెలుం గుహల వరకు ఎన్నో అద్భుతాలు రాష్ట్రంలో ఉన్నాయన్నారు.



శనివారం న్యూఢిల్లీలో కపిల్‌దేవ్‌తో భేటీ అయిన మంత్రి దుర్గేష్

**టూర్ ఆపరేటర్లే అసలైన సారథులు:**

"ప్రభుత్వాలు మౌలిక వసతులను కల్పిస్తాయి కానీ టూర్ ఆపరేటర్లు మాత్రమే పర్యాటక ప్రదేశాలను సందర్శకులకు చేరువ చేసి అద్భుతమైన ప్రయాణ అనుభూతులుగా మారుస్తారు" అని మంత్రి దుర్గేష్ స్పష్టం చేశారు. ఈ ఏడాది ఫిబ్రవరి 13, 14 తేదీల్లో జరిగిన ఆంధ్రప్రదేశ్ ఎడిటిఒఐ, నేషనల్ ట్రావెల్ మార్ట్ విజయవంతం కావడాన్ని గుర్తు చేస్తూ, ఇప్పుడు ఆ భాగస్వామ్యాన్ని వాస్తవబుకింగ్‌లు, నూతన ప్యాకేజీలుగా మార్చాల్సిన సమయం ఆసన్నమైందని పిలుపునిచ్చారు. పర్యాటక వృద్ధి కేవలం పర్యాటకుల సంఖ్య పెంచడానికే పరిమితం కాకూడదని, స్థానిక గైడ్‌లు, రవాణాదారులు, >>2

# గుంటూరులో మహిళపై దాడి

**● 9 మంది అరెస్టు, 14 రోజుల రిమాండ్ ● నిందితుడు రాము పార్టీనుంచి తొలగింపు ● మహిళల గౌరవానికి భంగం కలిగిస్తే కఠిన చర్యలు: 'ఎక్స్'లో సిఎం చంద్రబాబు ● సిఐపై చర్యలు: మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్**

**గుంటూరు, జులై 18, ప్రభాతవార్త ప్రతినిధి:** గుంటూరు నగరంలోని కృష్ణబాబు కాలనీలో మహిళపై జరిగిన దాడి ఘటన రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించింది. ఘటనపై ప్రభుత్వం, తీవ్రంగా స్పందించింది. మహిళా దాడి ఘటనలో బాధ్యులైన 9 మందిపై కేసు నమోదు చేయడంతో పాటు అరెస్టు చేసి జైలుకు తరలించారు.. ఈ ఘటంలో నిందితుడుగా పేర్కొన్న రాములు తెలుగుదేశం పార్టీ నుంచి తొలగించారు. మహిళా దాడి ఘటన పట్ల పోలీసు యంత్రాంగం, మహిళా కమిషన్ తీవ్రంగా స్పందించి చర్యలు చేపట్టారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. పోలీసులు వేగంగా దర్యాప్తు జరిపి మొత్తం తొమ్మిది మంది నిందితులను అరెస్టు చేసి. కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించారు. ఈ ఘటన తనను తీవ్రంగా కలచివేసిందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. మహిళల గౌరవానికి భంగం కలిగించే, వారిపై దౌర్జన్యాలకు పాల్పడే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. చట్టం ముందు అందరూ సమానమేనని, రాజకీయ పార్టీల పేరు చెప్పుకుని తప్పించుకునే అవకాశం ఎవరికీ ఉండదని తేల్చిచెప్పారు.

ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు పోలీసులు వెంటనే క్రిమినల్ కేసు నమోదు చేసి నిందితులను అరెస్టుచేశారు. ఈ ఘటనపై గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్లా మాధవికూడా వెంటనే స్పందించారు. బాధిత కుటుంబం తనను కలిసి జరిగిన విషయాన్ని వివరించిన వెంటనే నగరంపాలెం పోలీసులను సంప్రదించి కేసు నమోదు చేయించి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు తెలిపారు. మహిళల గౌరవం విషయంలో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేస్తూ, ఆరోపణలు ఎదుర్కొంటున్న మల్లెల మూర్తిని తెలుగుదేశం పార్టీ ప్రాథమిక సభ్యత్వం నుంచి తక్షణమే సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు.

మరోవైపు, ఈ ఘటనపై ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రాయపాటి శైలజ కూడా స్పందించి, నిందితులపై అత్యంత కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. బాధిత మహిళకు పూర్తి న్యాయంజరిగేలా చట్టపరమైన చర్యలు >>2

# 5 రోజులు వర్షసూచన

**కోనసీమ, పోలవరంలో భారీ వర్షాలు**

**విజయవాడ,జులై 18,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో వివిధ ప్రాంతాల్లో ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. శనివారం సాయంత్రం 5 గంటల నాటికి కోనసీమ జిల్లా ముమ్మిడివరంలో 36.2 మిమీ, పోలవరం జిల్లా ఎర్రంపేటలో 35.7మిమీ, కోనసీమ జిల్లా గంగవరంలో 29.7మిమీ, పోలవరం జిల్లా బుట్టాయిగూడెంలో 27.2మిమీ, కాకినాడ జిల్లా రాయభూపాల పట్నంలో 27.2మిమీ చొప్పున వర్షపాతం నమోదైందని వాతావరణ శాఖ వెల్లడించింది. రాష్ట్రంలో రానున్న ఐదు రోజులు మేఘావృతమైన వాతావరణంతో పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ వెల్లడించారు. దక్షిణ ఒడిశా,దాని పరిసర ప్రాంతాలపై ఉపరితల ఆవర్తనం విస్తరించి ఉందని తెలిపారు. దాని ప్రభావంతో కోస్తాంధ్రలో గంటకు 4050 కిమీ వేగంతో ఈదురుగాలులు వీస్తాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రానున్న రెండు రోజులు వాతావరణం క్రిందవిధంగాఉండే అవకాశం ఉన్నట్లు ప్రఖర్ జైన్ వివరించారు..ఆదివారం శ్రీకాకుళం, విజయనగరం, పోలవరం,కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల,ప్రకాశం, నెల్లూరు, నంద్యాల, కడప జిల్లాల్లో అక్కడక్కడ ..పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు.. కురిసే అవకాశం ఉందన్నారు, మిగతా జిల్లాల్లో కొన్నిచోట్ల తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. సోమవారం విజయనగరం, మన్యం, పోలవరం, విశాఖ, తూర్పుగోదావరి, ఏలూరు జిల్లాల్లో అక్కడక్కడ ..పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు,.. మిగతా జిల్లాల్లో కొన్నిచోట్ల తేలికపాటి వర్షాలుకురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు..ఈదురుగాలులు, ఉరుములతో వర్షం పడే సమయంలో ప్రజలు చెట్ల క్రింద, భారీ హోర్డింగ్స్ వద్ద నిలబడొద్దని సూచించారు. వర్షపు గాలుల వల్ల ఎక్కడైనా విద్యుత్ వైర్లు తెగిపడి ఉంటే వాటిని గమనిస్తూ వీలైనంత దూరంగా ఉండాలన్నారు. సముద్రం అలజడిగా ఉండి, అలలు ఉధృతంగా ఉన్నప్పుడు చిన్నబోట్లు ఉపయోగించే మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ప్రపంచ వాతావరణాన్ని శాసించే ఎల్‌నినో వేగంగా బలపడుతోందన్న హెచ్చరికలు మరింత ఆందోళన కలిగిస్తున్నాయి. జులైలో ముసురు పట్టాల్సిన వేళ ఏప్రిల్, మే నెలలను తలపించే ఎండలు దేశాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో సాధారణం కంటే అధికఉష్ణోగ్రతలు నమోదవుతుండగా, వర్షాల కోసం ఎదురు చూస్తున్న రైతులను ఆకాశం నిరాశపరుస్తోంది. ఇదే సమయంలో ఇప్పటికే తగ్గుతున్న వర్షాలు, పెరుగుతున్న వేడిరాబోయే రోజుల్లో దేశం మరో సంక్షోభాన్ని ఎదుర్కోనబోతోంది. 1950 తర్వాత అత్యంత శక్తివంతమైన ఎల్‌నినో ఘటనల్లో ఒకటిగా ఇది నిలిచేఅవకాశం ఉందని అమెరికా జాతీయ సముద్ర, వాతావరణ సంస్థ హెచ్చరించింది. అక్టోబర్‌డిసెంబర్‌మధ్య 81శాతం అవకాశంతో వెరీ స్ట్రాంగ్ ఎల్‌నినోగా మారవచ్చని తాజాబులెటిన్లో వెల్లడించింది. ఈపరిణామం భారత్లో వర్షపాతం, వ్యవసాయం, ఉష్ణోగ్రతలపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఫలితంగా దేశానికి ఆహార సంక్షోభం, ఆర్థిక కష్టాలు వెంటాడే పరిస్థితులు ఎదురు కానున్నాయి. వర్షాలు లేకపోవడంతో ఆ ప్రభావం అన్ని రంగాలపై పడుతోంది. వ్యవసాయ రంగం కుంటుపడితే అనేక వ్యవస్థలు కుప్పకూలిపోయే ప్రమాదం పొంచి ఉంది. నైరుతి రుతుపవనాలు కొంచెం లేటైనా తెలుగు రాష్ట్రాలతోపాటు, దేశమంతా విస్తరించాయి. కానీపరిస్థితులు మాత్రం చాలా భిన్నంగా వున్నాయి. వానల్లేక అల్లాడిపోయిన మహారాష్ట్రలో భారీ వర్షాలు కుమ్మేస్తున్నాయి. మహారాష్ట్రతోపాటు గుజరాత్, కేరళ వంటి రాష్ట్రాల్లో వర్షంబీభత్సం సృష్టిస్తుంటే, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ల్లో మాత్రం వాన చినుకు కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి వచ్చింది. మబ్బులు,గాలులు తప్ప వర్షం పడడంలేదు. అడపాదడపా కొన్ని చినుకులు పడిపోతున్నాయే తప్ప పెద్ద వానల్లేవ్.పరిస్థితి చూస్తుంటే కరవు కాటు తప్పదేమోననిపిస్తోంది.

# ఎల్‌నినో ప్రభావంతో కమ్ముకొస్తున్న కరవు

**సిహెచ్.వి.వి.రఘుబాబు**

సూపర్ ఎల్‌నినో ప్రభావం, నైరుతి రుతుపవనాల బలహీనత కారణంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు, దేశవ్యాప్తంగా ఖరీఫ్ సీజన్‌పై తీవ్ర కరవు ఛాయలు కమ్ముకుని పంటల సాగుపై ప్రతికూల ప్రభావం చూపిస్తోంది. సకాలంలో రుతుపవనాలు రాకపోవడంతో చినుకు లేక రైతులు చిత్తయ్యే పరిస్థితులు ఏర్పడ్డాయి. జూలై మొదటి వారంలో దేశంలోని అత్యధిక ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసినా ఆ తర్వాత మాత్రం రుతుపవనాల్లో హఠాత్తుగా స్తబ్దత ఏర్పడింది. దీని వల్ల దేశవ్యాప్తంగా వర్షపాతం సాధారణ స్థాయి కంటే పడిపోవడమే కాకుండా, ఎండ తీవ్రత పెరిగి ఉష్ణోగ్రతలు ఎగబాకాయి. దేశంలోని సుమారు 197 జిల్లాలపై ఎల్‌నినో ప్రభావం చాలా ఘోరంగా ఉంటుందని కేంద్ర వ్యవసాయ శాఖ ఆందోళన వ్యక్తం చేసింది. ముఖ్యంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఉత్తరప్రదేశ్, బీహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, గుజరాత్, మహారాష్ట్ర వంటి రాష్ట్రాల్లోని పలు జిల్లాల్లో ఈసారి కరవు ఛాయలు నెలకొంటున్నాయి. ప్రధాన పంటల సాగు బాగా ఆలస్యమవుతుండగా, కొన్నిచోట్ల రైతులు పొలాల్లో వేసిన విత్తనాలు మొలకలు రాలేదు. మరికొన్ని చోట్ల మొలిచినా నీళ్లులేక ఎండిపోయే పరిస్థితి కనిపిస్తోంది. మరోవైపు ప్రాణహిత మినహా ఇతర ప్రాజెక్టులకు ఇంకా వరదలే మొదలు కాలేదు. అప్పుడప్పుడు తేలికపాటి వర్షం పడుతుందే తప్ప వారం పాటు భారీవర్షాల ఊసే ఉండదని చెబుతోంది.వానలు పడతాయనే నమ్మకంతో దుక్కులు దున్ని, విత్తనాలు వేసిన రైతులు ఇప్పుడు మొలకలు ఎండిపోతుండటంతో దిక్కుతోచని స్థితిలో పడ్డారు. మరికొన్ని చోట్లనీరు లేక నారుమళ్లు ఎండిపోతుండగా, బావులు, బోర్లలో కూడా నీటిమట్టాలు పడిపోతుండటం ఆందోళన కలిగిస్తోంది.వర్షాలు ఆలస్యం కావడం పంటల సాగులో కొంత వెనుకబాటు కనిపిస్తోంది. దీనిని అధిగమించడానికి తక్కువ నీటితో, స్వల్పకాలంలో చేతికొచ్చే పంటలను ఎంచుకోవాలని ప్రభుత్వం సూచిస్తోంది. మొక్కజొన్న,సజ్జలు, పెసర్లు వంటి పంటల సాగుపై రైతులు దృష్టి పెట్టాలని చెబుతోంది. దేశవ్యాప్తంగా ముందస్తు సన్నాహాలు మొదలుపెట్టిన కేంద్రం, ప్రతి జిల్లాకు ప్రత్యేక యాక్షన్ ప్లాన్ ఇచ్చింది. ఖేత్ బచావో అభియాన్ ద్వారా లక్షలాది మంది రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. ఎక్కడైనా విత్తనాల కొరత రాకుండా 1.75లక్షల క్వింటాళ్ల జాతీయ విత్తన నిల్వలను అందుబాటులో ఉంచారు. రైతులకు పెట్టుబడి కష్టాలు రాకుండా కిసాన్ క్రెడిట్ కార్డ్ దరఖాస్తులను యుద్ధప్రాతిపదికన ఆమోదిస్తున్నారు. పంటనష్టపోతే ఆర్థికంగా ఆదుకునేందుకు ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన రిజిస్ట్రేషన్లను వేగవంతం చేస్తున్నారు.



విత్తనాలు, రుణాలు సకాలంలో అందేలా చూడటం ద్వారా రైతులపై భారం తగ్గించే ప్రయత్నం చేస్తున్నారు. ఎన్‌నినోతో పంటల సాగు తదితర ప్రభావిత రంగాలపై నిరంతర పర్యవేక్షణ, క్షేత్రస్థాయిలో ప్రత్యేక బృందాలు పనిచేస్తున్నాయి.ఎల్‌నినో ప్రభావంపై పూర్తిస్థాయి నిఘాకోసం ప్రత్యేక మానిటరింగ్ సెల్ పనిచేస్తోంది. పంటల వాతావరణ నిఘా విభాగం, రాష్ట్ర స్థాయి కంట్రోల్ రూమ్‌లు 24గంటలు పనిచేస్తూ సాగు ప్రగతిని మానిటర్ చేస్తున్నాయి. ఏ చిన్నసమస్య తలెత్తినా వెంటనే స్పందించేలా క్షేత్రస్థాయిలో బృందాలను సిద్ధంగా ఉంచారు. తెలంగాణలో రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయి. విస్తృతంగా వర్షాలు కురవాల్సిన ఈనెలలో ఇప్పటికే సగం రోజులు గడిచిపోయింది. అయినా వర్షాల జాడేలేకుండా పోయింది. దీంతో తీవ్ర వర్షాభావ పరిస్థితి ఏర్పడి 35 శాతం వర్షపాత లోటును ఎదుర్కొంటోంది. తెలంగాణలోని33 జిల్లాల్లో 27జిల్లాల్లో వర్షపాత లోటు నమోదైంది. దాదాపు88 శాతం జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదు కాలేదు. అంతే కాకుండా, ఈ నెలలో ఇక మిగిలిన రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం లేదని వాతావరణ శాఖ స్పష్టం చేసింది. సాగు సీజన్ జూన్ నెల మొదటి వారం నుంచి ఇప్పటి వరకు వర్షపాతం లోటు 35శాతంగా నమోదైంది. రాష్ట్రంలో సాధారణ వర్షపాతం 243.4 మిల్లీమీటర్లు కాగా, కేవలం 159.1 మిల్లీమీటర్లు మాత్రమే నమోదైంది. ఇది 35 శాతం వర్షపాత లోటు. మల్కాజిగిరి,హన్మకొండ జిల్లాలు వరుసగా 60శాతం, 67 శాతం వర్షపాత లోటును నమోదు చేస్తూ భారీ లోటు కేటగిరీలో ఉన్నాయి. ఓవైపు వర్షాలు లేకపోవడం, మరోవైపు జలాశయాల్లో నీళ్లు అడుగంటిపోతున్నాయి. రాష్ట్రంలోని ఎనిమిది ప్రధాన జలాశయాల్లో నీటినిల్వలు మొత్తం సామర్థ్యంలో కేవలం 1.261 బీసీఎం (బిలియన్ క్యూబిక్ మీటర్ల) నీరు మాత్రమే అందుబాటులో ఉంది. గతేడాది ఇదే సమయానికి రాష్ట్రంలో 30.31 శాతం నిల్వలుండగా, పదేళ్ల సాధారణ సగటు 19.26 శాతంగా నమోదయ్యేది. గతేడాదితో పోలిస్తే ప్రస్తుతం ఏకంగా 33శాతం మేర నీటితగ్గుదల రికార్డయింది. నాగార్జునసాగర్‌లో నీటి నిల్వ 3.62 శాతానికి పడిపోయింది. సింగూర్‌లో 15.56 శాతం, శ్రీరాంసాగర్‌లో 18.80 శాతం, కడెం ప్రాజెక్టులో 21.85 శాతం,లోయర్ మానేర్‌లో 26.02 శాతం, జూరాలలో 33.33శాతం నీరు మాత్రమే నిల్వఉంది. ఇక రాష్ట్రంలో 16 జిల్లాల్లో భూగర్భ జలాలు పడిపోయాయి. గత పోస్ట్‌మాన్‌సూన్ స్థాయిలతో పోల్చితే భూగర్భ జల మట్టాలు గణనీయంగా క్షీణించాయి. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకుని రాష్ట్రంలో దాదాపు 8,831 గ్రామాలపై ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉండబోతోందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. నష్టం నివారణకు ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికపై మంత్రులు, ఉన్నతాధికారులు సమీక్షలు నిర్వహిస్తున్నారు. ఇక ఆంధ్రప్రదేశ్‌లో నైరుతి రుతుపవనాల ప్రారంభంలో అక్కడక్కడా స్వల్ప వర్షాలు కురిసినా, ఆ తర్వాత వర్షాలు దాదాపు పూర్తిగా నిలిచిపోయాయి. గత నెలన్నర కాలంలో రాష్ట్రానికి రావాల్సిన వర్షపాతం కంటే సుమారు 49 శాతం తక్కువ వర్షం మాత్రమే నమోదవడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. సగటున 170.3 మిల్లీమీటర్ల వర్షం పడాల్సి ఉండగా కేవలం 86.3మిల్లీమీటర్ల వర్షపాతం మాత్రమే నమోదైంది. ముఖ్యంగా రాయలసీమ ప్రాంతం తీవ్ర కరవుతో అల్లాడుతోంది. జూలై తొలి పదిహేనురోజుల్లో దాదాపు 94 శాతం వరకు వర్షపాతంలోటు నమోదవడం అక్కడి రైతులను తీవ్ర ఇబ్బందుల్లోకి నెట్టింది.అదే సమయంలో కోస్తా ఆంధ్ర జిల్లాల్లో కూడా పరిస్థితి ఆశాజనకంగా లేదు. అక్కడ కూడా సాధారణ స్థాయితో పోలిస్తే దాదాపు70శాతం తక్కువ వర్షం కురిసింది. రాష్ట్రంలోని 28జిల్లాల్లో ఏఒక్క జిల్లాలోనూ సాధారణ వర్షపాతం నమోదు కాకపోవడం పరిస్థితి ఎంత ఆందోళనకరంగా ఉందో చెప్పకనే చెబుతోంది. రాష్ట్రంలోని 676 మండలాల్లో అధిక శాతం ప్రాంతాలు వర్షాభావాన్ని ఎదుర్కొంటున్నాయి. బోర్లు ఎండిపోవడం,చెరువులు నీరు కోల్పోవడం, రిజర్వాయర్లలో నీటి నిల్వలు డెడ్ స్టోరేజ్ స్థాయికి చేరుకోవడం రైతుల్లో మరింత ఆందోళన పెంచుతోంది. ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసే వరి, వేరుశనగ, పత్తి, పప్పుధాన్యాలు, చిరుధాన్యాల సాగు ఈసారి తీవ్రప్రభావానికి గురయ్యే అవకాశం కనిపిస్తోంది. ●

---

**పశ్చిమ బెంగాల్**

# రెండు రోజుల్లో.. !

**ఎ.వి.వి ప్రసాద్**

రాజకీయ వైకుంఠ పాళిలో ఇవాళ నిచ్చెన ఎక్కిన వారు రేపు పాము నోట పడవచ్చు. మళ్లీ బయటకు రావచ్చు, రాకపోవచ్చు. చెప్పలేం.ప్రస్తుతం మమతా బెనర్జీ పరిస్థితి కూడా అలాగే ఉందనిపిస్తుంది. పాము నోట పడినా, అది పాము కాదు.. గజమాల అనుకుంటారుకొందరు. మూడు సార్లు ముఖ్యమంత్రిగా ఓ వెలుగు వెలిగిన మమతా బెనర్జీ ఎన్నికలు గడిచి రెండునెలలైనా ఓటమి నుంచి గుణపాఠం నేర్చుకొనకపోవడం చూస్తే ఆశ్చర్యం కలుగుతుంది. తన నాయకత్వంలోని తృణమూల్ కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలు రోజురోజుకు ముదురుతున్నా ఆమె మొక్కవోని ధైర్యంతోనే కనిపిస్తున్నారంటే అది కూడా ఆశ్చర్యాన్నే కలిగిస్తుంది. పార్టీ అంతిమ దశకు చేరుతున్నా, అందుకు అంగీకరించకుండా, మేనల్లుడు అభిషేక్ బెనర్జీ ఏదోఒక మంత్రంవేసి కాపాడుతాడులే అనుకోవడం కూడాఆశ్చర్యకరమే. గత పదిహేను సంవత్సరాలుగా ఆమెకు ఎంతో అండగా నిలిచిన పార్టీలోని సీనియర్ నేతలందరు ఒక్కొక్కరుగా ప్రత్యర్థి శిబిరంలోకి జారుకొంటున్నారు. కమర్ హాటి ఎమ్మెల్యే మదన్ మిత్రా గతవారం మమత వర్గం నుంచి బయటకొచ్చిన తర్వాత పార్టీ పరిస్థితి మరింత క్షీణించిట్లేఉంది. మిత్రా తిరుగుబాటు వర్గంలో చేరడం రాజకీయంగా పెద్ద చర్చకు దారి తీసింది. పార్టీ ఆవిర్భావం నుంచి కీలక నేతగా ఎదిగిన మిత్రా హఠాత్తుగా శత్రు శిబిరంలలోకి వెళ్లడం టిఎంసికి గట్టిఎదురు దెబ్బేనని చెప్పాలి. పాఠశాల నియామకాల కేసులో ఆయన కుటుంబ సభ్యులకు ఇడి నోటీసులు జారీ కావడం,వెంటనే పార్టీ నుంచి ఆయననిష్క్రమించడం రాజకీయ వర్గాల్లో ఆసక్తిని పెంచింది. వారం క్రితం అలీపూర్ కోర్టు ఇచ్చిన తీర్పు తిరుగుబాటు వర్గంలో మరింత బలాన్ని పెంచింది. అయితే దానిని కూడా తిరస్కరించడం ఆమెలోని అసహనాన్ని తెలియజేస్తుంది. రెబెల్ నేత రితబ్రత వర్గాన్నే తృణమూల్ కాంగ్రెస్ ఏకైక చట్టబద్ధమైన విభాగంగా కోర్టు తీర్పు చెప్పడం రాజకీయ వర్గాల్లో తీవ్ర సంచలనం కలిగించింది. జూన్ 22న జాతీయ కార్యవర్గ సమావేశంలో ఏర్పాటు చేసిన కమిటీయే చట్టబద్ధమైనదనికూడా కోర్టు పేర్కొనడం ప్రకంపనలు సృష్టించింది.పార్టీ కార్యాలయాలు, నిధులపై ఆ వర్గానికేనియంత్రణ కలిగిస్తున్నట్లుగా కోర్టుతీర్పు చెప్పింది. ఈ తీర్పు మమత గొంతులో పచ్చి వెలక్కాయలా చిక్కుకొంది. కోర్టు తీర్పును రితబ్రత ఇప్పటికే ఎన్నికల కమిషన్‌కు నివేదించి తగిన నిర్ణయం తీసుకోవలసిందిగా కోరారు.మమత కూడా తన కౌంటర్‌ను ఇసికి సమర్పిస్తూ తన నాయకత్వం లోనిదే అసలైన పార్టీగా పేర్కొ న్నారు. దీనిపై ఎన్నికల సంఘం తన నిర్ణయాన్ని ప్రకటించవలసి ఉంది.



మమతా బెనర్జీ

ఈ దశలో మమతకు అత్యంత సన్నిహితురాలైన మరో రాజ్యసభ ఎంపీ నటి కోయల్ మల్లిక్ కూడా గత వారం పార్టీని వదిలి వెళ్లడం టిఎంసికి మరో దెబ్బ. దీనితో రాజ్యసభ లో టిఎంసి బలం 13నుంచి 9కి పడిపోయింది. ఈ పరిస్థితిలో మరో రెండు రోజుల్లో జరిగే ‘ షహీద్ దివస్’ పైనే ఇప్పుడు అందరి దృష్టికేంద్రీ కృతమైఉంది. ఆ రోజున ఏదో అద్భుతం జరగబోతోందంటూ మమత అనుచరులు ప్రచారం చేస్తుండడంతో అందరిలో ఆసక్తి మరింత పెరిగింది. కోలకతాలోని షహీద్ మినార్‌వద్ద భారీ కార్యక్రమం నిర్వహించేందుకు కాంగ్రెస్ కూడాఏర్పాట్లు చేస్తోంది. కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్ వేర్వేరుగా చేసే ఈ రెండు కార్యక్రమాలు ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారాయి. కాంగ్రెస్ మమతను ఆహ్వానించినట్లుగా బెంగాల్ కాంగ్రెస్ అధ్యక్షుడు శుభంకర్ సర్కర్ ప్రకటించడంతో అందరిలో ఆసక్తి మరింత పెరిగింది. అయితే ప్రతి సంవత్సరం మాదిరిగా తాము సొంతంగా షాహిద్ దివస్ జరుపుతామని మమత అంటున్నారు. ఆమె రాజకీయ జీవితాన్ని మలుపు తిప్పిన రోజు అది.1993 జులై 21న ఓటరు గుర్తింపుకార్డులు తప్పనిసరి చేయాలనే డిమాండ్‌తో అప్పటియువజన కాంగ్రెస్ నాయకురాలైన మమత భారీ ఆందోళన నిర్వహించారు. ఆ సందర్భంగా జరిగిన పోలీసు కాల్పుల్లో 13మంది కార్యకర్తలు మరణించిన దుర్ఘటన అప్పట్లో తీవ్రసంచలనంసృష్టించింది. ఆ ఘటన మృతులకు సంస్మరణగా మమతా బెనర్జీ యేటా జులై 21న షహీద్‌దివస్‌గా నిర్వహిస్తున్నారు. ఈసారి కూడా ఆ కార్యక్రమం భారీగా నిర్వహించేందుకు అటు కాంగ్రెస్, ఇటు టిఎంసి కూడా ఏర్పాట్లు చేస్తున్నాయి.ఆమె ఆరోజున కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు ప్రకటిస్తారని ప్రచారమవుతోంది. కాదు,పార్టీని బలోపేతంచేసే ప్రణాళిక ప్రకటిస్తారని కొందరు అంటున్నారు. దీనితో అందరిలో ఉత్కంఠ పెరుగుతోంది. టైమ్ పత్రిక గతంలో, ప్రపంచంలోని 100 మంది అత్యంత ప్రభావశీల నేతల్లో ఒకరుగా మమతను పేర్కొంది. అప్పటి ఆమె రాజకీయ శక్తికి అదొక ఉదాహరణ. కానీ ఇప్పటి మమత పరిస్థితివేరు. ఓటమితర్వాత ఊహించని విధంగా పార్టీ క్షీణించింది. ఎవరినీ ప్రభావితం చేయగలిగే శక్తి ఇప్పుడు ఆమెకు లేదు. పార్టీకి చెందిన 20 మంది ఎంపీలు తమను పార్లమెంటులో ఒక ప్రత్యేక వర్గంగా గుర్తించాలంటూ స్పీకర్‌కు లేఖఇవ్వడాన్ని ఆమె నివారించలేకపోయారు. మెజారిటీ ఎమ్మెల్యేలు ఒక అనామక పార్టీలోకి తరలివెళ్లడాన్ని కూడా అడ్డుకోలేకపోయారు.టిఎంసిపార్టీకి‘మమత బ్రాండ్’ ఒక కీలక శక్తిగా ఉండేది. అది కూడా ఇప్పుడు కరవైంది.టిఎంసి నాయకులను అవినీతి ఆరోపణలపై పెద్దసంఖ్యలో అరెస్టు చేస్తుంటేఆమె గట్టిగా ప్రశ్నించలేకపోతున్నారు కూడా. పార్టీని తిరిగి పటిష్టం చేసేందుకు తన వద్ద గల ప్రణాళిక ఏమిటో చెప్పలేకపోతున్నారు. పార్టీ రోజు రోజుకు అస్తిత్వ సంక్షోభంలోకి జారిపోతున్నా ఏమీ చేయలేకపోతున్నారు. ‘పార్టీకి కొత్త జవసత్వాలు కల్పిస్తాం. అందుకు నాంది జులై 21’ అని రెండురోజుల క్రితం ఆమె చేసిన ఒకప్రకటనే పార్టీ కార్యకర్తల్లో ఇప్పుడు ఆశలు పెంచుతోంది. మరో రెండు రోజుల్లో ఏం జరుగుతుందో! అది కేవలం ప్రకటనో, లేక నిజంగా సంచలన నిర్ణయం తీసుకొంటారో చూడాలి మరి. ●

---

**ఇజ్రాయెల్**

# నెతన్యాహుకు ఎన్నికల పరీక్ష..!

**గన్ని మోహన్**

మూడు ఖండాలకు క్రాస్ రోడ్స్‌గా ఉన్న పశ్చిమాసియా దేశంలో అంతర్గత సంక్షోభం పేరుకుంది. మధ్యప్రాచ్యంలో నిఘా విభాగం ఎంతటి శత్రువునైనా వ్యూహాత్మక విధానంతో మట్టుబెట్టగలిగే దేశంగా ఉన్న ఇజ్రాయెల్‌లో ఇప్పుడు ఎన్నికలు అనివార్యం అయ్యాయి. మధ్యప్రాచ్యంలోని ఈ దేశంలో బెంజమిన్ నెతన్యాహుపై పెరుగుతున్న అసమ్మతితోపాటు ఇరాన్‌తో సుదీర్ఘకాలంగా జరుగుతున్న యుద్ధంలో అమెరికాను తప్పుదారి పట్టించిందన్న భావన కూడా ఇపుడున్నప్రధానిపై వ్యక్తం కావడంతో ఆదేశంలో ప్రతిపక్షాలు ఇదే సాకుగా తీసుకుని నెతన్యాహు ప్రజల్లో తన విశ్వాసాన్ని నిరూపించుకోవాలని పట్టుబడుతున్నాయి. దీనితో అనివార్యంగా ఎన్నికల ప్రకటన వెలువడింది. ఇజ్రాయెల్‌లో నాలుగేళ్ల పదవీకాలాన్ని పూర్తిచేసిన పార్లమెంట్ అత్యంత అరుదుగా కనిపిస్తుంది.1988 తర్వాత ముందస్తు ఎన్నికలు లేకుండా పూర్తికాలం కొనసాగిన పార్లమెంటు ఇదే కావచ్చేమో. 2019 నుంచి 2022 మధ్యకాలంలో ఇజ్రాయెల్‌ప్రజలు ఐదుసార్లు ఎన్నికల్లో పాల్గొనాల్సి వచ్చింది. సగటున ప్రతి 2.4ఏళ్లకు ఒకపర్యాయం ఎన్నికలు నిర్వహించారు.రాజకీయ అస్థిరతకు ఇదే ప్రత్యక్షనిదర్శనంగా ఇజ్రాయెల్‌లోని డెమొక్రసీ ఇన్‌స్టిట్యూట్ వెల్లడించింది. ఇరాన్‌తో కొనసాగుతున్న యుద్ధం, మరో వైపు దక్షిణ లెబనాన్‌వైపు దాడులు, పాలస్తీనా గాజాపై నిరంతర పోరాటం వంటి వాటితో ఇజ్రాయెల్‌ప్రజలు నిరంతరం యుద్ధాలతో విసిగిపోయారు. మూడేళ్లక్రితం జరిగిన హమాస్ దాడితో దేశప్రజలు మళ్లీ యుద్ధం వస్తుందేమోనన్నంతగా భయపడిపోయారు. ఇప్పుడు అమెరికాతో జతకట్టి ఇరాన్‌పై దాడులు చేస్తుండటంతో ఆ భయాలు ఇంకా వారిలో గూడుకట్టుకునే ఉన్నాయి. పార్లమెంటును రద్దుచేసిన వచ్చే అక్టోబరు 27న 120 మంది సభ్యులున్న పార్లమెంట్‌కు ఎన్నికలు నిర్వహించనున్నట్లు స్పీకర్ అమీర్ ఓహానా ప్రకటించడంతో ఇజ్రాయెల్‌లో ఎన్నికల సందడి మొదలైంది. ఎన్నికల ప్రకటన వెలువడటానికి ముందే నెతన్యాహు ఆధ్వర్యంలోని అధికార పార్టీ అనేక అత్యవసర చట్టాలను అమలులోకి తీసుకువచ్చింది. దజనుకుపైగా బిల్లులను అత్యవసరంగా ఆమోదింపచేసుకోడం వెనుక ఎన్నికల్లో మరోసారి తన పట్టు నిరూపించుకునేందుకేనని నిస్సంకోచంగా చెప్పవచ్చు. ప్రధాని నెతన్యాహుకు గట్టిప్రత్యర్థిగా మాజీ ప్రధాని నఫ్తాలీ బెన్నెట్ ముందువరుసలో ఉన్నారు. ఆయనతోపాటే మాజీ సైనికాధికారి నాయకత్వంలోని మధ్యేవాద శక్తులు కూడా కొన్ని దేశంలో బలపడుతూ వస్తున్నాయి. కేవలం 91.41 లక్షల మంది మాత్రమే జనాభా ఉన్న ఈదేశం ప్రపంచ దేశాల నిఘావ్యవస్థల్లో అత్యున్నత వ్యవస్థను కొనసాగిస్తుందన్నది తెలిసిందే. మొస్సాద్ రంగంలోకి దిగిందంటే పని అయిపోయినట్లే అన్న భావన సర్వత్రా వ్యక్తం అవుతుంది. అణ్వాయుధ తయారీకి సంబంధించి ఇరాన్‌ను ముందునుంచీ వ్యతిరేకిస్తున్న ఈ దేశం అమెరికాతో కలిసి పోరాటంచేస్తున్నసంగతి తెలిసిందే. ఒకదశలో యుద్ధవిరమణపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌నుంచి నెతన్యాహు చీవాట్లు కూడా తిన్న సందర్భాలు మీడియా పతాక శీర్షికలకు ఎక్కాయి. ఉత్తరాన లెబనాన్, ఈశాన్యంలో సిరియా, ఆగ్నేయంలో జోర్డాన్, నైరుతిలో ఈజిప్టు పశ్చిమాన మధ్యధరా సముద్రం సరిహద్దులుగా ఉన్న ఈ దేశం జెరూసలెంను తన రాజధానిగా కొనసాగిస్తోంది. ఎన్నికలకు ముందుగా నెతన్యాహు సర్కారు న్యాయవ్యవస్థలోసంస్కరణలు, మీడియా నియంత్రణ, అటార్నిజనరల్ అధికారాలు పరిమితం చేయడం వంటివి ప్రతిపక్షాలకు అస్త్రాలుగా లభించాయి. నెతన్యాహు ఆధ్వర్యంలోని సంకీర్ణ ప్రభుత్వం నిజానికి అనేక వివాదాస్పద బిల్లులు ఆమోదించింది. అనేక ఏళ్లుగా కొనసాగుతున్న యూదు యువకులను సైనిక సేవల్లోకి తప్పనిసరిగాచేర్చే ప్రక్రియను నిలిపివేస్తూ వచ్చిన బిల్లును ఆమోదించడం చూస్తే అతిసాంప్రదాయవాదుల మద్దతును కూడగట్టుకునేందుకు నెతన్యాహు వేసిన ఎత్తుగడల్లో భాగమేనని అర్థం అవుతోంది. నాలుగేళ్ల పదవీకాలంలో తొమ్మిది బడ్జెట్లు వందలాది బిల్లులు ఆమోదించామని, మాపై విశ్వాసం ఉంచినందువల్లనే మళ్లీ ఎన్నికల్లో మేమే గెలుస్తామంటూ నెతన్యాహు పార్టీనేతలు ధీమాతోఉన్నారు. నిజానికి నెతన్యాహుకు సుదీర్ఘకాలం ప్రధానిగా కొనసాగిన రికార్డుఉంది. ప్రధానికి పదవీకాల పరిమితులు లేకపోయినా చరిత్రలో అత్యధిక కాలం కొనసాగారు. నాలుగేళ్ల పదవీకాలం పూర్తిచేసిన సందర్భాలు కూడా ఎక్కువగానే ఉన్నాయి. ప్రభుత్వాలు కుప్పకూలినా మళ్లీ సంకీర్ణ ప్రభుత్వంలో నెతన్యాహు ప్రధాని పీఠంపై కొనసాగి తన పట్టును నిరూపించుకోగలిగారు. ఎన్నికల చరిత్రను పరిశీలిస్తే ఆర్థికసహకారం అభివృద్ధిసంస్థ (ఓఇసిడి) దేశాల జాబితాలో ఎన్నికల మధ్య అత్యల్ప వ్యవధి ఉన్న దేశాల్లో ఇజ్రాయెల్ రెండో స్థానంలో ఉంది. దేశంలోని రాజకీయ అస్థిరతకు ఇదే నిదర్శనమని అక్కడి డెమొక్రసీ సంస్థకూడా విశ్లేషిస్తోంది. ప్రస్తుతం ఆదేశ జిడిపి 719.85 బిలియన్ డాలర్లుగా ఉంది. తలసరి ఆదాయం కూడా 69,804 డాలర్లుగా లెక్కలు వేసారు. చుట్టూ శత్రుమూకలు ఉన్నప్పటికీ సాహసోపేతమైన దాడులకు పూనుకుంటూ తన ఉనికిని కాపాడుకుంటూ వస్తున్న ఇజ్రాయెల్‌లో ఈసారి జరిగే ఎన్నికలు నెతన్యాహుకు ఒక సవాలు వంటిదేనని చెప్పాలి. ఎన్నికల్లో విదేశీ ప్రమేయం కనిపించకపోయినా మిత్రదేశాల సహకారం అంటూ ఇజ్రాయెల్‌కు అందుతూనే ఉంటుంది. ఒపక్క ఆర్థికవృద్ధి, దేశంలో సంక్షేమం, ప్రజాభ్యుదయానికి ప్రాధ్యాం ఇస్తూనే మరోపక్క ఇరాన్, సిరియా,లెబనాన్ వంటి దేశాలనుంచి ఎదురయ్యే దాడుల ముప్పును ఎదుర్కొనడం నెతన్యాహుముందున్న అతి పెద్దసవాల్. యుద్ధంపై విసిగిపోయిన ప్రజలు నెతన్యాహుకే తిరిగిప ట్టం కడతారా లేక కొత్తనేతకు పట్టం కడతారా అన్నది రానున్న ఎన్నికలే నిర్ణయిస్తానడంలో ఎలాంటి సందేహంలేదు. ●




బెంజమిన్ నెతన్యాహు

---

# విద్యారంగం నాణ్యత పెంచే కొత్త సంస్కృతి అవసరం

**రామ కిష్టయ్య సంగన భట్ల**

మానవ మేధస్సుకు పదును పెట్టి, సత్ప్రవర్తనను నేర్పి, సమాజాన్ని ప్రగతి పథంలో నడిపించే ఒక దివ్యమైన సాధనం విద్య. ఒకప్పుడు పాఠశాల విద్య అంటే కేవలం అక్షరాల గుర్తింపు మాత్రమే కాదు, విద్యార్థుల్లో అంతర్గతంగా దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడం, ఆలోచనా శక్తిని విశ్వవ్యాప్తం చేయడం, నిశిత విమర్శనాత్మక జ్ఞానాన్ని పెంపొందించడం, వ్యక్తిత్వ వికాసానికి సుదృఢమైన పునాది వేయడం అనే మహోన్నతమైన, పవిత్రమైన భావన ఉట్టిపడేది. ఉపాధ్యాయుడు కేవలం పాఠాలు చెప్పే బోధకుడు కాదు, విద్యార్థి జీవితాన్ని సమున్నతంగా తీర్చిదిద్దే శిల్పిగా విరాజిల్లాడు. కానీ, నేటి ఆధునిక, ప్రపంచీకరణ యుగంలో మార్కెట్ శక్తుల ప్రవేశంతో విద్యా వ్యవస్థ తన ప్రాథమిక నైతిక అస్తిత్వాన్ని కోల్పోతూ ఆందోళనకరమైన రీతిలో వ్యాపారీకరణ వైపు వేగంగా అడుగులు వేస్తోంది. మార్కుల వేట, ఉత్తీర్ణత శాతం పెంచుకోవాలనే తాపత్రయం, కార్పొరేట్ విద్యాసంస్థల అహంకార పూరితమైన ర్యాంకుల పోటీలమధ్య అసలైన విద్యా ప్రమాణాలు నిలువునా బలైపోతున్నాయి. విద్యార్థుల హృదయాలలో జ్ఞాన తృష్ణను, జిజ్ఞాసను రేకెత్తించాల్సింది పోయి, కేవలం అంకెలు, శాతాల చుట్టూ తిరిగే ఒక కృత్రిమ ఫలితాల సంస్కృతిని రుద్దడం వల్ల, విద్య అనేది నిరంతర ఆనందదాయకమైన ప్రక్రియ కాస్తా, అత్యంత భయంకరమైన మానసిక బంధనంగా మారిపోతోంది.భారతదేశంలో ప్రతి సంవత్సరం దాదాపు ఒక కోటి యాభై లక్షల మంది విద్యార్థులు తత్సమాన బోర్డు పరీక్షల వేదికలపై తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటుండగా, అటు తెలంగాణ, ఇటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో కలిపి ప్రతి ఏడాది దాదాపు పది లక్షలకు పైగా బాల్యప్రాయపు విద్యార్థులు పరీక్షల పీఠం ఎక్కుతున్నారు. అయితే ప్రతి ఏటా ఈ పరీక్షల ఫలితాలు వెలువడినప్పుడు సమాజంలో కనిపించే దృశ్యాలు అత్యంత విచిత్రంగా, దారుణంగా ఉంటున్నాయి. ప్రభుత్వాలు, విద్యా శాఖ ఉన్నతాధికారులు, పాఠశాల యాజమాన్యాలు తాము సాధించిన ఉత్తీర్ణత శాతాలనే ఒక గొప్ప విజయంగా, అట్టహాసంగా చాటుకుంటూ ప్రచార ఆర్భాటాల్లో మునిగిపోతున్నాయి. ఏ జిల్లా ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది, ఏ పాఠశాల వంద శాతం ఉత్తీర్ణత సాధించి రికార్డులకెక్కింది, ఎవరికి పదికి పది జీపీఏ గ్రేడింగ్ వచ్చింది అనే అంశాలే పత్రికల ముఖ్యాంశాలుగా, దృశ్య మాధ్యమాల చర్చలుగా మారుతున్నాయి. దురదృష్టవశాత్తూ, ఈ సంఖ్యాపరమైన ఆరాటంలో అసలైన ప్రాథమిక ప్రశ్నలు పూర్తిగా అణచివేయబడుతున్నాయి. ఆయా పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులు నిజంగా ఆయా సబ్జెక్టులలో ఎంత మేర ప్రాథమిక అవగాహనను, లోతైన పరిజ్ఞానాన్ని పెంపొందించుకున్నారనే శోధన ఎక్కడా జరగడం లేదు. చదివిన అంశాన్ని నిత్య జీవితంలో అన్వయించుకునే సృజనాత్మక నైపుణ్యాలు వారిలో వికసించాయా, రేపటి సమాజంలో ఎదురయ్యే ఆర్థిక, సామాజిక సవాళ్లను ఎదుర్కొనేందుకు సరిపడా వివేకాన్ని వారు సంపాదించగలిగారా అనే మౌలిక ఆశయాలు ఈ శాతాల హోరులో కొట్టుకుపోతున్నాయి. ఈఉత్తీర్ణత శాతం పెంచాలనే అదృశ్య, నిరంకుశ ఒత్తిడి అటు ప్రభుత్వ పాఠశాలలపై, ఇటు ప్రైవేటు పాఠశాలలపై తీవ్రమైన దుష్ప్రభావాన్ని చూపుతోంది. తరగతి గదుల్లో ఉపాధ్యాయులు పాఠ్య ప్రణాళికను విద్యార్థులకు క్షుణ్ణంగా, హృదయాలకు హత్తుకునేలా బోధించి వారిలో జిజ్ఞాసను రేకెత్తించాల్సింది పోయి, కేవలం పరీక్షా సన్నద్ధతకే సింహభాగం సమయాన్ని ధారపోస్తున్నారు. ఫలితంగా సిలబస్‌ను సంపూర్ణంగా బోధించకుండా, కేవలం పరీక్షల్లో మార్కులు తెచ్చిపెట్టే ముఖ్యమైన ప్రశ్నలు, రెడీమేడ్ గెస్ పేపర్లు, ప్రశ్న బ్యాంకులు, నమూనా పత్రాల కంఠస్థీకరణకే పరిమితం చేస్తున్నారు. ఇది విద్యార్థుల్లోని ఆలోచనా శక్తిని చంపేసి, కేవలం తాత్కాలిక జ్ఞాపకశక్తి ఆధారిత క్షుద్ర విద్యను మాత్రమే ప్రోత్సహిస్తోంది. ఈ భయానకమైన పోటీ ప్రపంచంలో కొన్ని కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలు తమ



వ్యాపార సామ్రాజ్యాల విస్తరణకు, కొత్త అడ్మిషన్ల వేటకు విద్యార్థుల మార్కులను అంగడి సరుకులుగా వాడుకుంటున్నాయి. టాప్ ర్యాంకులను సాధించడమే లక్ష్యంగా, పదో తరగతి వయసులో ఉన్న పసివాళ్లపై అమానవీయమైన, అసాధారణమైన మానసిక ఒత్తిడిని నూరిపోస్తున్నాయి. తెల్లవారుజాము ఐదు గంటల నుంచే ప్రత్యేక తరగతులు, రాత్రి పది గంటల వరకు స్టడీ అవర్ల పేరిట విద్యార్థులను ఇనుప గదుల్లో బందీలను చేస్తున్నాయి. బాల్యానికి సహజసిద్ధమైన ఆటపాటలు, శారీరక శ్రమ, మానసిక వికాసానికి కనీస స్థానం కూడా లేకుండా, కేవలం పరీక్షల్లో మార్కులు గుంజడమే ధ్యేయంగా సాగుతున్న ఈ యాంత్రిక విధానం వల్ల విద్యార్థులు తీవ్ర మానసిక వైకల్యానికి, నిరాశకు లోనవుతున్నారు. జాతీయ నేర గణాంకాల సంస్థ (ఎన్‌సీఆర్‌బీ) ఏటా విడుదల చేస్తున్న నివేదికలు ఈ భయంకరమైన వాస్తవాన్ని కళ్లముందు ఉంచుతున్నాయి. పరీక్షల ఒత్తిడిని తట్టుకోలేక, తల్లిదండ్రుల మితిమీరిన అంచనాలను అందుకోలేక, ఆశించిన గ్రేడింగ్ రాదేమోననే తీవ్రమైన భయాందోళనలతో దేశవ్యాప్తంగా ప్రతి ఏటా వేలాది మంది విద్యార్థులు ఆత్మహత్యల వంటి దారుణమైన నిర్ణయాలు తీసుకుని కన్నవారికి కడుపుకోత మిగులుస్తున్నారు. మార్కుల కోసం ఆరాటపడే ఈ క్రూరమైన విద్యా వ్యవస్థ పసివాళ్ల బాల్యాన్ని బలి తీసుకుంటున్న వైనం సమాజ విజ్ఞతకే ఒక పెద్ద సవాలుగా నిలుస్తోంది. ఉత్తీర్ణత శాతం కోసం సాగుతున్న ఈఅడ్డగోలు రేసు మరో ప్రమాదకరమైన, అనైతికమైన ధోరణికి దారితీస్తోంది. అదే పరీక్షల నిర్వహణలో వ్యవస్థాగతంగా జరుగుతున్న అపసవ్యాలు, అవకతవకలు. కొన్నిపాఠశాలలు,విద్యాసంస్థలు, ఆఖరికి కొన్ని ప్రాంతాల్లోని విద్యాశాఖ యంత్రాంగాలు కూడా తమ పరిధిలోని ఫలితాలు మెరుగ్గా చూపించుకోవడానికి పరీక్షల నిర్వహణలో అవాంఛనీయమైన జోక్యానికి, అక్రమాలకు పాల్పడుతున్నాయనే నగ్నసత్యాలు నిరంతరం వెలుగుచూస్తూనే ఉన్నాయి. పరీక్షా కేంద్రాల వద్ద స్థానిక శక్తుల ప్రయోజనాల కోసం సామూహిక కాపీయింగ్‌ను పరోక్షంగా ప్రోత్సహించడం, ఇన్విజిలేషన్ విధుల్లో ఉన్న ఉపాధ్యాయులు నిర్లక్ష్యం వహించడం లేదా చూసీచూడనట్లు వ్యవహరించడం, విద్యార్థులకు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో సమాధానాలు చేరవేయడం వంటి ఘటనలు తరచూ విద్యావ్యవస్థ నైతికతను ప్రశ్నిస్తున్నాయి. ఆధునిక యుగంలో సాంకేతిక పరిజ్ఞానం పెరిగిన తర్వాత, పరీక్షా కేంద్రాల వెలుపల నుండి మొబైల్ ఫోన్లు, సామాజిక మాధ్యమాల ద్వారా ప్రశ్నాపత్రాలు లీక్ కావడం, పరీక్ష ప్రారంభమైన కొద్ది నిమిషాలకే సమాధానాలు లోపలికి చేరవేయడం వంటి సంఘటనలు దేశవ్యాప్తంగా పరీక్షల విశ్వసనీయతను నిలువునా దెబ్బతీస్తున్నాయి.గత రెండు దశాబ్దాల కాలంలో వివిధ రాష్ట్రాల్లో వెలుగుచూసిన సామూహిక కాపీయింగ్ ఉదంతాలు, ముఖ్యంగా పాఠశాల భవనాల కిటికీలు, గోడలు ఎక్కి మరీ బంధువులు విద్యార్థులకు కాపీ చీటీలను అందిస్తున్న అపురూప దృశ్యాలు అంతర్జాతీయ వేదికలపై దేశ ప్రతిష్టను మసకబార్చాయి. ఇటువంటి అక్రమాల ద్వారా, కాపీయింగ్ సాయంతో బోర్డుపరీక్షల గండం గట్టెక్కుతున్న విద్యార్థులు, భవిష్యత్తులో ఉన్నత విద్యా కోర్సులలోనూ, జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షలలోనూ, అత్యంత పోటీతో కూడిన ఉపాధి రంగాలలోనూ తీవ్రమైన అసమర్థతను ప్రదర్శిస్తూ నిలువునా కుప్పకూలిపోతున్నారు. పునాది లోపించిన ఈ విద్యావిధానం దేశ మానవ వనరుల నాణ్యతను ఎంతగా దిగజారుస్తుందో చెప్పడానికి ఇదొక సజీవ సాక్ష్యం.పరీక్షల నిర్వహణను,విద్యార్థుల భవిష్యత్తును పట్టిపీడిస్తున్న మరో ప్రధాన రుగ్మత ‘మార్కుల దాహం’. ప్రస్తుతం అమలులో ఉన్న గ్రేడింగ్ విధానంలో 10 జీపీఏ సాధించడం, లేదా 600మార్కులకుగానూ 600 మార్కులు సాధించాలనే అహేతుకమైన, కృత్రిమమైన లక్ష్యాలను విద్యార్థులపై రుద్దడం వల్ల సమాజంలో ఒక అనారోగ్యకరమైన పోటీ వాతావరణం నెలకొంది. పరీక్షలు అనేవి విద్యార్థి మేధస్సుకు ఒక ఆరోగ్యకరమైన కొలమానం కావాలి తప్ప, విద్యను పరీక్షల గదికే పరిమితం చేసే ఒక నిర్బంధ సాధనంగా మారకూడదు. ఉత్తీర్ణత శాతం కన్నా విద్యా నాణ్యతకు, మానవత్వానికి ప్రాధాన్యమిచ్చే ఒక నూతన సంస్కృతి ఏర్పడినప్పుడే విద్యా రంగం సరైన గాడిలో పడి, దేశ భవిష్యత్తుకు నిజమైన భరోసా లభిస్తుంది. ●

## తిరుమల సమాచారం



# నడకమార్గంలో భద్రతా చర్యలు బలోపేతం

## భక్తుల రక్షణకు అత్యవసర ప్రతిస్పందన బృందాలు

### టిటిడి అదనపు ఇఓ వెంకయ్యచౌదరి

**తిరుమల,జులై 18ప్రభాతవార్తప్రతినిధి:** ప్రతిరోజూ తిరుపతి అలిపిరి కాలినడక మార్గంలో వచ్చే భక్తులకు సున్నితమైన ప్రాంతాల్లో భద్రత రక్షణ చర్యలను మరింత బలోపేతం చేయాలని టిటిడి అదనపు ఇఓ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి ఆదేశించారు. అటవీమార్గంలో వన్యప్రాణుల సంచారాన్ని నిరంతరం పర్యవేక్షించేందుకు టిటిడి అటవీ శాఖ, విజిలెన్స్, ఇంజినీరింగ్, ఆరోగ్య శాఖలతో బాటు సంబంధిత అన్ని విభాగాల మధ్య సమన్వయాన్ని మరింత మెరుగుపరచుకోవాలని చౌదరి సూచించారు. శనివారం తిరుమల పద్మావతి విశ్రాంతి భవనంలోని సుధర్మ సమావేశ మందిరంలో టిటిడి,అటవీ శాఖ అధికారులతో అదనపు ఇఓ చౌదరి సమీక్ష నిర్వహించారు. తిరుమలకు నడకమార్గాల్లో ఒకటైన అలిపిరి నడక మార్గంలో భక్తుల భద్రతకు అత్యున్నత ప్రాధాన్యం ఇచ్చేలా టిటిడి కార్యాచరణ రూపొందించింది. తిరుమల పరిసర ప్రాంతాల్లో వన్యప్రాణుల సంచారప్రాంతాలు, వాటి కదలికల తీరును శాస్త్రీ యంగా అధ్యయనం చేసి, భక్తులకు ప్రమాదం కలిగించే ప్రాంతాలను గుర్తించి తగిన నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. వన్యప్రాణుల సంచారానికి సంబంధించి ఇప్పటికే గుర్తించిన మూడు ప్రధాన ప్రమాద కారకాలను (రిస్క్ పారామీటర్లు) సమగ్రంగా పరిశీలించి, వాటి ప్రభావాన్ని తగ్గించే కార్యాచరణను రూపొందించాలని స్పష్టం చేశారు. అలిపిరి నడక మార్గంలోని దుకాణాల నిర్వహణ వల్ల వన్యప్రాణుల సంచారంపై, భక్తుల భద్రతపై ఎలాంటి ప్రభావం పడుతుందో సమగ్రంగా అధ్యయనం చేసి, అవసరమైతే తగిన నియంత్రణ చర్యలు చేపట్టాలని అధికారులను సూచించారు. అంతకుముందు టిటిడి డిఎఫ్ఓ ఫణికుమార్ నాయుడు గత రెండేళ్లలో చిరుతలు ఎక్కువగా సంచరించిన ప్రాం తాలు, ట్రాప్ కెమెరాలు, సోలార్ కెమెరాల పనితీరు, వన్యప్రాణుల సంచార ధోరణులు తదితర అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరిం చారు. ఈ సమావేశంలో సిసిఎఫ్ శ్రీనివాసరెడ్డి, డిఎఫ్ఓ సాయిబాబా, టిటిడి సిఇ సత్యనారాయణ, ఆరోగ్యవిభాగం డిప్యూటీ ఇఓ సోమన్నారాయణ, విఎస్ఓ సురేంద్ర, సిపిఆర్ఓ డాక్టర్ తలారి రవి,పిఆర్ఓ నీలిమ తదితరులు పాల్గొన్నారు.



# తిరుమల కొండ కిటకిట

## గదుల కోసం భక్తుల పాట్లు

**తిరుమల,జులై 18ప్రభాతవార్తప్రతినిధి:** వారాంతం వరుససెలవులతో తిరుమలలో కిలోమీటర్ల మేర క్యూలైన్లు నిండిపోయాయి. శనివారం ఉదయమే శిలాతోరణం వరకు వెలుపల భక్తుల లైన్లు బారులుతీరాయి. వైకుంఠంలోని కంపార్ట్మెంట్లు అన్నీ భక్తులతో కిటకిటలాడుతున్నాయి. భక్తుల రద్దీ భారీగా కొనసాగుతోంది. ఎలాంటి దర్శన టోకెన్లు,టిక్కెట్లు లేని భక్తుల శ్రీవారి సర్వదర్శనం కోసం 30గంటల సమయం నిరీక్షణ తప్పడం లేదు. విపరీత రద్దీ కారణంగా ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు ఉన్న భక్తులకు కూడా దర్శనానికి అధికగంటల సమయం పడుతోంది.టైమ్‌స్లాట్ దర్శన భక్తులకు 8గంటల సమయం నిరీక్షిస్తున్నారు. శుక్రవారంరాత్రి వరకు 74,096 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.శ్రీవారి హుండీఆదాయం 3.66కోట్లుగా నమోదైంది. భక్తులకు 4 లక్షల లడ్డూలను విక్రయించగా, 2.98లక్షల మందికి అన్నప్రసాదం స్వీకరించారు. భారీగా భక్తుల రద్దీ దృష్ట్యా టిటిడి విస్తృత ఏర్పాట్లు చేసింది. క్యూలైన్ల లో గంటల తరబడి వేచి ఉన్న భక్తులకు పాలు, తాగునీరు, అన్నప్రసాదాలను నిరంతరాయంగా పంపిణీచేస్తోంది. భక్తుల పట్ల ఓపికతో వ్యవహరించి, సిబ్బందికి సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు.



# తిరుపతిలో గుంటూరు పోలీస్ పేరుతో హల్‌చల్

## పట్టుకున్న అసలు పోలీసులు

**తిరుమల,జులై 18ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతి యాత్రాస్థలంలో ఏకంగా ఖాకీ యూనిఫారమ్ ధరించి గుంటూరు పోలీస్‌నంటూ ఓ వ్యక్తి అలిపిరి సమీపంలో గదిని అద్దెకు తీసుకున్నాడు. అతనితోపాటు మరో యువతి కూడా రావడంతో లాడ్జి యాజమాన్యం అనుమానంతో అలిపిరి పోలీసులకు ఫిర్యాదు చేశారు.దీంతో నకిలీ పోలీస్ గుట్టురట్టయ్యింది. తాను పోలీస్‌శాఖలో ఆర్ఎస్ఐ అంటూ గుంటూరు జిల్లా బోడపాలెం కు చెందిన దాసరి కార్తిక్ అలిపిరిలోని విహా హోమ్ స్టే మేనేజర్‌ను సంప్రదించాడు. తాము తిరుమలకు వచ్చామని, ఫ్రెష్ కావడానికి తనకు గదిని అద్దెకు ఇవ్వాలని తీసుకున్నాడు. శనివారం వేకువజామున గదికి వచ్చిన అతను మరో యువతితో ఉదయం 7గంటల వరకు గదిలోనే ఉండిపోయారు. లాడ్జి సిబ్బంది తలుపు తట్టినా గది తలుపులు తీయకపోవడంతో అనుమానం కలిగి హోమ్ స్టే యజమానికి, పోలీసులకు మేనేజర్ హేమంత్ సమాచారమిచ్చాడు. హోమ్ స్టే వద్దకు చేరుకున్న అలిపిరి పోలీసులు నకిలీ పోలీస్‌ను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి ఎస్ఐ రామాంజనేయులు విచారణ చేస్తున్నారు.

# రూ.17లక్షలు విరాళమిచ్చిన

## డి.సిఎం పవన్ సతీమణి అన్నాలెజినోవా



**తిరుమల,జులై 18ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ సంపూర్ణ ఆరోగ్యంగా కోలుకోవాలని శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులు కోరినట్లు ఆయన సతీమణి అన్నా లెజినోవా తెలిపారు. ఇటీవల పవన్‌కళ్యాణ్ తన చేతికి శస్త్రచికిత్స చేయించుకున్న విషయం తెలిసిందే. అది విజయవంతంగా నిర్వహించడం, ఆ తరువాత ఆయన ఆరోగ్యంగా ఉండాలని ,శ్రీవారి శక్తిని ప్రసాదించాలని వేడుకున్నారు.రాష్ట్రం అన్నివిధాలా అభివృద్ధి చెందాలని, ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ఆమె ఆకాంక్షించారు. శనివారం వేకువజామున తిరుమల ఆలయం వద్దకు విచ్చేసిన పవన్ సతీమణి లెజినోవాకు ఆలయ అధికారులు స్వాగతం పలికారు. వేకువ జామున సుప్రభాతసేవలో శ్రీవారిని దర్శించి కానుకలు సమర్పించారు. ఆమె తన కుమారుడు మార్క్ శంకర్ పేరుతో వెంకటేశ్వర అన్నప్రసాదం ట్రస్ట్‌కు 17లక్షలు రూపాయలు విరాళం అందించి, స్వయంగా భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. భక్తులతో కలిసి అన్నప్రసాదం స్వీకరించారు. అంతకుముందు ఆమె శుక్రవారం రాత్రిఅలిపిరి నడక మార్గం ద్వారా కాలినడకన తిరుమల కొండకు చేరుకున్నారు.

# రైతుల సమక్షంలోనే రీసర్వే

## రాష్ట్ర సర్వే, సెటిల్మెంట్ అండ్ ల్యాండ్ రికార్డ్స్ డైరెక్టర్ రోణంకి కూర్మనాథ్



శనివారం రీసర్వే పనులను జిల్లా రెవెన్యూ, సర్వేఅధికారులతో కలిసి తనిఖీ చేస్తున్న రోణంకి కూర్మనాథ్

**విజయవాడ.జులై 18.ప్రభాతవార్తప్రతినిధి:** భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం కల్పించడమే లక్ష్యంగా రైతుల సమక్షంలో రీసర్వే నిర్వహించాలని రాష్ట్ర సర్వే, సెటిల్మెంట్ అండ్ ల్యాండ్ రికార్డ్స్ డైరెక్టర్ రోణంకి కూర్మనాథ్ అధికారులను ఆదేశించారు. శనివారం ఎన్టీఆర్ జిల్లా కంచికచెర్ల, నందిగామ మండలం సోమవరం గ్రామాల్లో జరుగుతున్న రీసర్వే పనులను జిల్లా రెవెన్యూ, సర్వే అధికారులతో కలిసి ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతుల సమక్షంలో సర్వే జరుగుతుండటంపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రోణంకి కూర్మనాథ్ మాట్లాడుతూ, గతంలో నిర్వహించిన రీసర్వేలో చోటుచేసుకున్న లోపాలు, భూ సరిహద్దుల నిర్ణయంలో జరిగిన పొరపాట్లు, జాయింట్ ఎల్పీ నంబర్ల వంటి సమస్యలు పునరావృతం కాకుండా రీసర్వే-2.0ను అమలు చేస్తున్నామని తెలిపారు. సర్వే ప్రారంభానికి ముందే సంబంధిత రైతులకు సమాచారం అందించి, వారి లేదా కుటుంబ సభ్యుల సమక్షంలోనే సర్వే నిర్వహించాలని, ఈకేవైసీ తప్పనిసరిగా పూర్తి చేయాలని సూచించారు. సర్వే అనంతరం డాక్యుమెంట్ల పరిశీలన ద్వారా భూ హద్దులను రైతు సమక్షంలోనే నిర్ధారించి, సరైన కొలతలతో కూడిన పట్టాదారు పాసు పుస్తకం అందే వరకు ప్రతి దశలో రైతులకు సమాచారం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా రీసర్వే కార్య క్రమం వేగంగా కొనసాగుతోందని, ఫేజ్-1లో 628, ఫేజ్-2లో 748, ఫేజ్-3లో 729, ఫేజ్-4లో 1,645 గ్రామాల్లో సర్వే పూర్తవుతుండగా, ప్రస్తుతం ఫేజ్-5లో 1,343 గ్రామాల్లో సుమారు 2,800 బృందాలు ఆత్యాధునిక రోవర్ పరికరాలతో రీసర్వే నిర్వహిస్తున్నాయని తెలి పారు. 2027 మార్చి నాటికి ఆంధ్రప్రదేశ్‌ను భూ వివాదాలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రభుత్వం, సర్వే శాఖ సమన్వయంతో కృషి చేస్తున్నట్లు డైరెక్టర్ రోణంకి కూర్మనాథ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సర్వేయర్ వై.మోహనరావు, నందిగామ డివిజన్ సర్వే ఇన్స్పెక్టర్లు జె. బసవరావు, సాంబశివరావు, మండల సర్వేయర్ నరేంద్ర, రెవెన్యూ, సర్వేశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# ముంబయి నటి కాదంబరి జెత్వానీ కేసులో ఛార్జ్ షీట్ వెనక్కి

**విజయవాడ.జులై 18.ప్రభాతవార్తప్రతినిధి:** ముంబయి నటి కాదంబరి జెత్వానీ కేసులో తాజాగా కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో సీఐడీ దాఖలు చేసిన ఛార్జ్ షీట్ రిటర్న్ అయింది. ఈ కేసులో సీఐడీ అధికారులు తాజాగా విజయవాడ నాలుగో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. అయితే, ఈ ఛార్జ్ షీటును కోర్టు రిటర్న్ చేసింది. ఈ కేసు కూటమి ప్రభుత్వం ఏర్పడిన తొలి నాళ్లల్లో సంచలనంగా మారింది. వైసీపీ హయాంలో అప్పట్లో కొందరు పోలీసు అధికారులు తనతో పాటుగా తన కుటుంబ సభ్యులను అన్యాయంగా అరెస్ట్ చేసి చిత్రహింసలు పెట్టారని జెత్వానీ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఆరోపిస్తూ విజయవాడ పోలీసు కమిషనర్‌కు ఫిర్యాదు చేసారు. ఈ మేరకు ఇబ్రహీంపట్నం పోలీసు స్టేషన్‌లో బీఎన్ఎస్ 120బీ, 166, 166ఏ, 167, 342, 354డీ, 420, 467, 469, 471, 34 సెక్షన్ల కింద కేసు క్రైం నంబరు 469/2024) నమోదైంది.ఈ కేసులో వైసీపీ నేతలు సహా పోలీసుల అధికారులను నిందితులుగా చేర్చారు. వైసీపీ నేత కుక్కల విద్యాసాగర్(ఏ1), నిఘా విభాగం మాజీ చీఫ్ పీఎస్ఆర్ ఆంజనేయులు (ఏ2), పోలీసు అధికారులు కాంతిరాణా తాతా (ఏ3), కె.హనుమంతరావు (ఏ4), ముత్యాల సత్యనారాయణ (ఏ5), విశాల్ గున్నీ(ఏ6)తోపాటు ప్రకాశం జిల్లాకు చెందిన న్యాయవాదిని నిందితులుగా చేర్చారు. పీఎస్ఆర్ ఆంజనేయులు, కాంతిరాణా, విశాల్‌గున్నీ, అప్పటి పశ్చిమ మండలం ఏసీపీ కె.హనుమంతరావు, ఇబ్రహీంపట్నం ఇన్స్పెక్టర్ సత్యనారాయణను సస్పెండ్‌చేసారు. కాగా, ఆ తరువాత ప్రభుత్వం దీనిని సీఐడీకి బదలీ చేసింది. సీఐడీ గుంటూరు ప్రాంతీయ విభాగాధికారులు దర్యాప్తు చేశారు.కేసులో ఎవరెవరుఎలాంటి పాత్ర పోషించారో వివరిస్తూ చార్జిషీటు సిద్ధంచేసారు. కాగా కోర్టు దీనిని రిటర్న్ చేయడంతో త్వరలోనే మరో చార్జిషీటు దాఖలు చేసేందుకు సీఐడీ అధికారులు సిద్ధమవుతున్నట్లు సమాచారం.

# యూట్యూబరు రావణ్ కేసులో గమన, ఇంద్రసేనా చౌదరి విచారణ

**విజయవాడ.జులై 18.ప్రభాతవార్తప్రతినిధి:** యూట్యూబరు రావణ్ దర్యాప్తు కేసులో కీలకంగా భావిస్తున్న గమన, ఇంద్రసేనా చౌదరిని శనివారం మూడవ విడత విచారణకు హాజరు పరిచారు. వారి ఆర్థిక స్థితి, వ్యక్తిగత వ్యవహా రాలతో పాటు యూట్యూబ్ ఛానళ్ల నిర్వహణ, నిధుల సమీకరణ, విద్వేషపూరిత కంటెంట్ ప్ర చారం వంటి అంశాలపై విస్తృతంగా ప్రశ్నిం చినట్లు సమాచారం.పెనమలూరు పోలీస్ స్టేషన్‌లో దర్యాప్తు అధికారి ధర్మేంద్ర ఆధ్వ ర్యంలో దాదాపు శుక్రవారంమంతా విచారణ కొనసాగింది. పలువురు అధికారులు విడివిడిగా ప్రశ్నలు సంధించినప్పటికీ, కీలక ప్రశ్నలకు ఇద్దరూ ఎటువంటి బదులు ఇవ్వలేదు.విచారణ మధ్యలో గమన, ఇంద్రసేనా చౌదరిని పోలీసులు మంగళగిరిలోని ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌కు తీసుకెళ్లారు. ఇటీవల స్వాధీనం చేసుకున్న వారి మొబైల్ ఫోన్లను సాంకేతిక విశ్లేషణ కోసం ఇప్పటికే ఫోరెన్సిక్ పరీక్షలకు పంపించారు. ఫోన్లను అన్‌లాక్ చేయించి అందులోని సమా చారాన్ని పరిశీలించే ప్రక్రియ చేపట్టారు. ఒకవేళ ఫోన్లలోని డేటాను తొలగించి ఉంటే, దానిని సాంకేతికంగా తిరిగి రాబట్టే ప్రయత్నాలు కూడా జరుగుతున్నట్లు సమాచారం. అనంతరం గమనను తిరిగి పెనమలూరు పోలీస్‌స్టేషన్‌కు, ఇంద్రసేనా చౌదరిని గన్నవరం తరలించి అక్కడ ప్రత్యేకంగా ప్రశ్నించినట్లు తెలిసింది.ఫోరెన్సిక్ నివేదికలు, బ్యాంకు లావా దేవీల విశ్లేషణ ఆధారంగా దర్యాప్తు మరింత ముందుకు సాగే అవకాశం ఉందని పోలీసు వర్గాలు చెబుతున్నాయి. ఇక గమన,ఇంద్రసేనా చౌదరి విచారణలో రావణ్‌తో పరిచయం ఎప్పటి నుంచి ఉందని ప్రశ్నించగా రెండేళ్లుగా పరిచయం ఉందని చెప్పినట్లు సమాచారం. యూట్యూబ్ ఛానళ్ల నిర్వహణకు ఇప్పటివరకు ఎంత మొత్తం ఖర్చు చేశారు, ఆదాయ వనరులు ఏమిటి, నగదు బదిలీలు ఎలా జరిగాయి వంటి ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు ఇవ్వలేదని తెలుస్తోంది. ఇప్పటివరకు ఎన్ని వీడియోలు అప్‌లోడ్ చేశారన్న ప్రశ్నకు కూడా ఖచ్చితమైన వివరాలు చెప్పలేదని సమాచారం. రావణ్ రూపొందించిన వీడియోల సంఖ్యపై కూడా స్పష్టత ఇవ్వలేదని తెలిసింది.

# తిరుమలేశుని ఆరాధన విధానానికి వైఖానస భగవత్ శాస్త్రం మూలం

## రాఘవ దీక్షితులు



**తిరుమల,జులై 18ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామి నిత్యారాధనలు, ఉత్సవాలు వైఖానస మహర్షి రచించిన వైఖానస భగవత్ శాస్త్రం ప్రకారమే వేలాది సంవత్సరాలుగా కొనసాగుతున్నాయని తిరుమల వైఖానస దివ్య సిద్ధాంత వివర్ధిని సభ అధ్యక్షుడు దీవి రాఘవ దీక్షి తులు తెలిపారు. తిరుమల ఆస్థాన మండపంలో శనివారం వైఖానస దివ్యసిద్ధాంత వివర్ధిని సభ, టిటిడి ఆళ్వార్ దివ్యప్రబంధ ప్రాజెక్టు సంయుక్త ఆధ్వర్యంలో మరీచి మహర్షి తిరు నక్షత్రోత్సవం నిర్వహించారు. వైఖానస భగవత్ శాస్త్రం వేదాధారితమైనదని, వేదమంత్రాలతో నిర్వహించే వైఖానస ఆరాధన తిరుమల శ్రీవారికి అత్యంత ప్రీతిపాత్రమని చెప్పారు. మరీచి మహర్షి రచించిన విమానార్చనాకల్పం, ఆనంద సంహిత గ్రంథాల్లో ఆరాధన విధానాలను సమగ్రంగా వివరించారని తెలిపారు. ఇప్పటికీ తిరుమలలో నిర్వహిస్తున్న అష్టదళ పాదపద్మారాధన (స్వర్ణ పుష్పార్చన) కూడా మరీచి మహర్షి నిర్దేశించిన శాస్త్ర విధానంలో భాగమేనని పేర్కొన్నారు. **దేవాలయ సంస్కృతికి మరీచి మహర్షి విశిష్ట సేవలందించారు.** విఖనస ట్రస్ట్ కార్యదర్శి గంజాం ప్రభాకర ఆచార్యులు మాట్లాడుతూ దేవాలయ నిర్మాణం, మండపాల నిర్మాణం, నిత్యారాధనలు, ఉత్సవాల నిర్వహణకు సంబంధించిన శాస్త్ర విధానాలను మరీచి మహర్షి సమగ్రంగా అందించారని తెలిపారు. దేవాలయాలు ధర్మపరమైన, సంస్కారవంతమైన సమాజ నిర్మాణానికి కేంద్రబిందువులని చెప్పారు.

వేదిక్ విశ్వవిద్యాలయం అధ్యాపకుడు యశ్వంత్ దీక్షితులు మాట్లాడుతూ తిరుమల బ్రహ్మో త్సవాల వైభవం వైఖానస భగవత్ శాస్త్రంలో పేర్కొనబడిందని, ఈ ఉత్సవాలను దర్శించడం అశ్వమేధ యాగ ఫలాన్ని ప్రసాదిస్తుందని తెలిపారు. ధర్మగిరి వేద విజ్ఞాన పీఠం వైఖానస పండితుడు శేషసాయి వైఖానస కల్పసూత్రం మానవ జీవితాన్ని సంస్కారవంతంగా తీర్చిదిద్దే మహోన్నత శాస్త్రమని చెప్పారు. శాస్త్రోక్తంగా నిర్వహించే దేవాలయ పూజలు లోకక్షేమానికి, దేశ సుభిక్షానికి దోహదపడతాయని పేర్కొన్నారు. పంచబేరాల ఆరాధనకు విమానార్చనాకల్పమే ఆధారమన్నారు.

గంజాం కావ్యశ్రీ, శ్రీలక్ష్మి ఆద్యులు ఆలపించిన వైఖానస వైభవ గీతాలు సభికులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో విఖనస ట్రస్ట్ సంయుక్త కార్యదర్శి శ్రావణ్ కుమార్, ఎన్.వి.వి.ఎన్. దీక్షితులు,ధర్మగిరి వేద విజ్ఞాన పీఠం అధ్యాపకులు, వైఖానస పండితులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# సొంత జిల్లాల్లో పరిస్థితులపై సిఎం చంద్రబాబు దృష్టి

**తిరుపతి,జులై 18ప్రభాతవార్తప్రతినిధి:** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తన సొంత జిల్లాలు తిరుపతి,చిత్తూరులపై స్పెషల్ ఫోకస్ పెట్టినట్టు తెలిసింది. ఉమ్మడి చిత్తూరు జిల్లా లో ఉన్న 14 అసెంబ్లీ నియోజక వర్గాలు చిత్తూరు, తిరుపతి అన్నమయ్య జిల్లాలలో కలిశాయి. మూడు జిల్లాల్లోనూ బలమైన నాయకత్వం లేక పోవడంతో పార్టీ ప్రతిష్ఠ దిగజారే సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. పలువురు ఎమ్మెల్యేలు అవినీతి, అక్రమాలు, భూ కబ్జాలు ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. పార్టీని నడిపించాల్సిన పార్లమెంటు కమిటీలు బలహీనంగా ఉన్నాయి. దీంతో అంతర్గత గొడవలు, వర్గపోరు ఎక్కువ అయ్యింది. ఇటీవల పుంగనూరు, తంబళ్లపల్లె ఇన్‌ఛార్జిల మార్పు కోసం తిరుపతిలో ఓహోటల్‌లో ఏర్పాటు చేసిన సమావేశం రసాభాస అయ్యింది. మంత్రులులు బి సి జనార్ధన్ రెడ్డి, రాంప్రసాద్ రెడ్డి, ప్రాంతీయ పర్యవేక్షకుడు దామచర్ల సత్య, పరిశీలకుడు శాప్ చైర్మన్ రవి నాయుడు సమక్షంలో పుంగనూరు కార్యకర్తలు బాహాబాహీకి పాల్పడ్డారు.

ఒక వర్గం వారు మరో వర్గం వారిపై హత్యా ప్రయత్నం కేసు పెట్టారు. అయితే న్యాయమూర్తి అక్షింతలు వేసి బెయిలు మంజూరు చేశారు. ఈ సంఘటన వల్ల పార్టీ ప్రతిష్ఠ బాగా దెబ్బతిందని గుప్పుమంటోంది. శ్రీకాళహస్తి, సత్యవేడు, నగరి, జిడి నెల్లూరు, చంద్రగిరి నియోజకవర్గాలలో ఇసుక, గ్రావెల్ అక్రమ రవాణాలు, భూ కబ్జాలు జరుగుతున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. తిరుపతిలో పార్టీ రెండు వర్గాలుగా చీలి పోయింది. కొన్ని నియోజక వర్గాలలో ఎమ్మెల్యేలు అందుబాటులో లేరన్న ఆవేదన వ్యక్తం అవుతున్నది. పరిస్థితులు ఇలాగే కొనసాగితే స్థానిక సంస్థల ఎన్నికల్లో దెబ్బతినే అవకాశాలు ఉన్నాయని ఇంటెలిజెన్స్ వర్గాల నివేదికలు సూచిస్తున్నాయి. ఈ నేపథ్యంలో చంద్రబాబు పార్టీ నాయకత్వ ప్రక్షాళనపై ప్రత్యేక దృష్టి పెట్టినట్టు తెలిపారు సింది. పుంగనూరు, తంబళ్లపల్లె నియోజక వర్గాలకు కొత్త ఇన్‌చార్జీలను నియమించనున్నారు. మూడు జిల్లాలకు చెందిన ఒకరికి గవర్నర్ కోటలో ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలని యోచిస్తున్నారని తెలిసింది. త్వరలో ఒకరిద్దరు సీనియర్ నేతలకు రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ చైర్మన్ పదవులు దక్కే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇప్పుడు పదవులలో ఉంటూ చెడ్డ పేరు తెచ్చుకున్న వారికి కొందరికి తిరిగి పదవులు దక్కవని అంటున్నారు.

## ఆంధ్రసారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో 'బాల గేయాల' పోటీల రచనలకు ఆహ్వానం: గజల్ శ్రీనివాస్

**విజయవాడ,జులై 18, ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్ర సారస్వత పరిషత్తు ఎంతో ప్రతిష్ఠాత్మకంగా బాలల కోసం డిసెంబర్ 5,6 తేదీల్లో నెక్స్ట్ జన్ ఇంటర్నేషనల్ స్కూల్, ఒంగోలు ప్రాంగణంలో నిర్వహిస్తున్న నాలుగవ ప్రపంచ తెలుగు మహా సభలు బాలలు పురస్కరించుకుని బాల సాహిత్యాన్ని పెంపొందించే దిశగా "బాల గేయాల రచన" పోటీలు నిర్వహిస్తున్నట్లు డా.గజల్ శ్రీనివాస్ తెలిపారు. ఈ పోటీలో ఏ వయసు వారైనా పాల్గొనవచ్చుని, గేయం 15 పంక్తులు (లైన్లు) మించకుండావుండాలని కోరారు. గేయ రచన తెలుగు భాష , సంస్కృతి, జీవన విధానం, భారతీయత లపై ఆశక్తి, అనురాగం కలిగించే విధంగా వుండాలని తెలియజేశారు. పోటీలకు పంపే గేయాలు రాత ప్రతిని పిడిఎఫ్ మాధ్యమంలో 10 ఆగస్టు నాటికికోరుప్రోలు మాధవరావు 9866995085 .నెంబర్ కు వాట్సాప్ ద్వారా పంపాలి..ప్రథమ బహుమతిగా రూ.మూడువేలు ద్వితీయ బహుమతి రూ.రెండువేలు తృతీయ బహుమతిగా రూ.వేయి పది ప్రోత్సాహక బహుమతులు ఒక్కొకటి రూ.ఐదువందలు అలాగే ప్రశంసా పత్రము, పతకము మహాసభల సమయంలో విజేతలకు ప్రదానం చేయడం జరుగుతుందని కార్యదర్శి ధవేజీ , ముఖ్య సమన్వయ కర్తలు డా. మురలీధర్ రెడ్డి, శ్రీకాంత్ లు తెలిపారు. ఎన్నిక కాబడిన గేయాలను ధ్వని ముద్రణ చేసి, ఏఐ ద్వారా వీడియో లుగా రూపొందించి ప్రచారం చేస్తామని కార్యక్రమ అంతర్జాతీయ, జాతీయ సమన్వయ కర్తలు కొల్లి రమావతి, రాధికా మంగిపూడి తెలిపారు.

# ముగిసిన లిక్కర్ స్కామ్ కేసు నిందితుల విచారణ

**విజయవాడ,జులై18,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ లిక్కర్ రవాణా స్కామ్ కేసు నిందితుల ఈడీ కస్టడీ విచారణ ముగిసింది. వాసుదేవరెడ్డి, రాజ్ కెసిరెడ్డి, సునీల్‌ను ఈడీఅధికారులు మూడు రోజులు ప్రశ్నించారు. కస్టడీ ముగియడంతో ముగ్గురికీ వైద్యపరీక్షలు నిర్వహించారు. ముగ్గురు నిందితులను నాంపల్లి కోర్టులో హాజరుపరిచారు. సోదాల్లో సేకరించిన వివరాల ఆధారంగా అధికారులు దర్యాప్తు చేశారు. ఈడీ కస్టడీ విచారణలో నిందితులు పలు కీలక ఆరోపణాంశాలకు సంబంధించి మౌనంగా ఉన్నట్లు సమాచారం.

# ఐదుగురు మృతిపై సిఎం చంద్రబాబు విచారం

**విజయవాడ జులై 18,ప్రభాతవార్తప్రతినిధి:** పోలవరం జిల్లా ఎటపాక మండలం గొల్లగూడెం వద్ద గోదావరి నదిలో ఐదుగురు మృతి చెందిన ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రవిచారం వ్యక్తంచేశారు. గోదావరి నదిలో చేపల వేటకు వెళ్లి ఐదుగురు గల్లంతయ్యారన్న విషయంపై ముఖ్యమంత్రి అధికా రులను అడిగివివరాలు తెలుసుకున్నారు.గొమ్ముకొత్తగూడెంనకు చెందిన తుర్రం భారతి, ఊకే సుశీల, ఊకే లక్ష్మి, బాసిబోయిన బాలరాజు, ఊకే రమేష్ అనే ఐదుగురు వేటకువెళ్లి మృత్యువాత పడినట్లు అధికారులు సీఎంకు వివరించారు. సంఘటనపై విచారం వ్యక్తంచేసిన సీఎం మృతుల కుటుంబాలకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని అధికారులను ఆదేశించారు.

### డి.సిఎం పవన్ విచారం

ఐదుగురు మృతి చెందిన ఘటనపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్ విచారం వ్యక్తం చేశారు. దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. పోలవరం జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను తెలుసుకున్నారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం తరఫున అవసరమైన సహాయ సహకారాలు అందించాలని అధికారులను ఆదేశించారు.

### హోం మంత్రి అనిత విచారం

ఈ ప్రమాదంపై రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత కూడా తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.జిల్లా కలెక్టర్, ఎస్పీలతో ఆమె ఫోన్‌లో మాట్లాడి సహాయక చర్యలను పర్యవేక్షించారు. సాధారణంగా చేపల వేటకు వెళ్లే ప్రాంతంలో ఈ ప్రమాదం ఎలా జరిగిందనే కోణంలో సమగ్ర దర్యాప్తు జరపాలని పోలీసు అధికారులను ఆదేశించారు.బాధిత కుటుంబాలకు తక్షణ ప్రభుత్వ సాయం అందేలా చూడాలని జిల్లా యంత్రాంగానికి స్పష్టం చేస్తూ మృతుల కుటుంబ సభ్యులకు ఈ కష్ట సమయంలో భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆమె ఆకాంక్షించారు.

### బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ దిగ్భ్రాంతి

చేపల వేటకు వెళ్లిన ఐదుగురు మృతి చెందిన ఘటన అత్యంత విషాదకరమని బీజేపీ రాష్ట్రఅధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం,స్థానిక అధికారులు మృతులకుటుంబాలకు తక్షణ సహాయం అందించి, వారికి అన్ని విధాలుగా అండగా నిలవాలని పీవీఎన్ మాధవ్ కోరారు.

# చిన్నారులకు తొలిసారిగా సుగర్, బిపి స్క్రీనింగ్ పరీక్షలు: మంత్రి సత్యకుమార్

**విజయవాడ,జులై 18, ప్రభాతవార్తప్రతినిధి:** చిన్న వయస్సులోనే మధుమేహం, అధిక రక్తపోటు వంటి జీవనశైలి వ్యాధులను గుర్తించేందుకు రాష్ట్రప్రభుత్వం తొలిసారిగా ప్రత్యేక స్క్రీనింగ్‌కు శ్రీకారం చుట్టింది. జాతీయ బాల స్వాస్థ్య కార్యక్రమాన్ని మరింత విస్తరించి ఆర్‌బీఎస్‌కే-2.0గా అమలు చేయనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 62.65 లక్షల మంది చిన్నారులకు 38 రకాల సమగ్ర ఆరోగ్య పరీక్షలు నిర్వహించనున్నట్లు వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించి, అవసరమైన వారికి పూర్తిగా ఉచిత చికిత్స అందించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. త్వరలోనే స్క్రీనింగ్ ప్రారంభిస్తామని తెలిపారు. 2026-27 ఆర్థిక సంవత్సరంలో అంగన్‌వాడీ కేంద్రాల్లోని 20.95 లక్షల మంది, ప్రభుత్వ, ప్రభుత్వ అనుబంధ పాఠశాలల్లో చదువుతున్న 41.7 లక్షల మంది విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించనున్నట్లు మంత్రి వెల్లడించారు. పిల్లల్లో పుట్టుకతో వచ్చే లోపాలు, పోషకాహార సమస్యలు, వివిధ వ్యాధులు, ఎదుగుదలలో జాప్యం, వైకల్యాలను సకాలంలో గుర్తించి చికిత్స అందించడం ద్వారా ఆరోగ్యవంతమైన భవిష్యత్తుకు బాటలు వేయడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని మంత్రి సత్యకుమార్ తెలిపారు.

# జెఇఇ అడ్వాన్స్‌డ్‌లో మాగల్లు విద్యార్థి ప్రతిభ

**విజయవాడ,జులై 18,ప్రభాతవార్తప్రతినిధి:** ఎన్టీఆర్ జిల్లా మాగల్లు గ్రామానికి చెందిన కస్తాల జయదీప్ (17) 2026 జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ఉత్తీర్ణత సాధించి, పశ్చిమ బెంగాల్‌లోని ప్రతిష్ఠాత్మక ఐఐటీ ఖరగ్‌పూర్‌లో మైనింగ్ బ్రాంచ్‌లో సీటు సాధించాడు. ఈ సందర్భంగా నందిగామ బార్ అసోసియేషన్ హాల్‌లో జయదీప్‌ను 16వ అదనపు జిల్లా జడ్జి పి. శ్రీనివాసరావు, నందిగామ ఆర్డీవో అనిల్ , డీవైఈవో ఉప్పలూరి గురునాథం, న్యాయవాదుల సంఘం అధ్యక్షులు షేక్ కరీముల్లా, ప్రభుత్వ న్యాయవాది మట్టా ప్రసాద్. సీనియర్, జూనియర్ న్యాయవాదులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జడ్జి పి.శ్రీనివాసరావు మాట్లాడుతూ జయదీప్ మాగల్లు జడ్పీ పాఠశాలలో పదో తరగతి చదివి 570మార్కులు సాధించి నందిగామ మండలంలో ప్రతిభ కనబరిచాడని, నందిగామ పట్టణంలోని కళాశాలలో ఇంటర్మీడియట్‌లో 970 మార్కులు సాధించి, జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ఉత్తీర్ణత సాధించి ఐఐటీ ఖరగ్‌పూర్‌లో సీటు సంపాదించడం అభినందనీయమన్నారు. గ్రామీణ ప్రాంతానికి చెందిన విద్యార్థి ప్రభుత్వ పాఠశాలలో చదివి ప్రతిష్ఠాత్మక ఐఐటీలో సీటుసాధించడం ఇతర విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని అన్నారు. నందిగామ ఆర్డీవో మాట్లాడుతూ జయదీప్ భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదిగి, దేశానికి సేవచేసే అత్యున్నత సివిల్ సర్వీసెస్‌లో ఉద్యోగం సాధించాలని ఆకాంక్షించారు.

# కూటమి పాలనలో సభ్య సమాజం తలదించుకునే పరిస్థితులు వచ్చాయి: ఎమ్మెల్సీ వరుదు కల్యాణి


**విజయవాడ, జూలై 18,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో కూటమి పాలనలో సభ్య సమాజం తలదించుకునే పరిస్థితులు వచ్చాయని, వైసీపీ ఎమ్మెల్సీ వరుదు కల్యాణి ఆరోపించారు.అధికార పార్టీ నాయకులు కాలకేయుల్లా ప్రవర్తిస్తున్నారని ఆక్షేపించారు.రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరవైందని, వారు స్వేచ్ఛగా బతికే వాతావరణం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారుఒక సాధారణ నీటి కుళాయి కనెక్షన్ కోసం మల్లెల మూర్తి అనే వ్యక్తి సదరు మహిళను రూ. 10వేల లంచం అడిగాడని వరుదు కల్యాణి ఆరోపించారు. ఆ సమయంలో తలెత్తిన ఘర్షణ కారణంగానే ఆ మహిళను వివస్త్రను చేసి అమానుషంగా దాడికి తెగబడ్డారని పేర్కొన్నారు. ఈ దారుణంపై బాధితురాలు పోలీసులను ఆశ్రయించినా తొలుత వారు పట్టించుకోలేదని, ఈ వైఫల్యానికి కూటమి ప్రభుత్వం సిగ్గుతో తలదించుకోవాలని డిమాండ్ చేశారు.ఈ అనాగరిక చర్యకు బాధ్యత వహిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్ర ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్‌చేశారు. నిందితుడు మల్లెల మూర్తి అధికార పార్టీకి చెందిన వ్యక్తి కాబట్టే తప్పు కప్పిపుచ్చుకోవడానికి కేవలం సస్పెన్షన్ వేటు వేసిచేతులు దులుపుకున్నారని విమర్శించారు. అధికార దుర్వినియోగానికి గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి పేటెంట్ అని ఎద్దేవా చేశారు.

# ప్రతి గ్రామం పరిశుభ్రంగా ఉండాలి

## ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల

**కొడవలూరు (నెల్లూరు), జులై 18, ప్రభాతవార్త :** కొడవలూరు మండలం వెంకన్నపురం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో నిర్వహించిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, నెల్లూరు జిల్లా జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ గూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులకు పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ, వ్యర్థాల నిర్వహణపై అవగాహన కల్పించారు. అనంతరం పాఠశాల ఆవరణలో పరిశుభ్రత కార్యక్రమంలో స్వయంగా పాల్గొని, సమీప గృహాల్లో ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కేవలం ప్రభుత్వ కార్యక్రమం మాత్రమే కాదని, ప్రజలందరూ భాగస్వాములై నిర్వహించాల్సిన ఉద్యమమని అన్నారు. పరిశుభ్రమైన, ఆరోగ్యవంతమైన ఆంధ్రప్రదేశ్ నిర్మాణమే కార్యక్రమం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. వెంకన్నపురాన్ని ఆదర్శ పరిశుభ్ర గ్రామంగా తీర్చిదిద్దుదామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాపా వెంకటేశ్వర్లు నాయుడు, తహశీల్దార్ కె. స్ఫూర్తి రెడ్డి, ఎంపీడీవో వెంకట సుబ్బారావు, అజయ్ బాబు,కూటమి నాయకులు, అధికారులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# సప్పరంలో సవ్యసాచి దర్శనం



**శ్రీకాళహస్తి,జులై 18 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తీశ్వ రాలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న ధర్మరాజుల స్వామి ఆలయంలో తిరునాళ్ళు సందర్భంగా శనివారం సవ్యసాచి సప్పరంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆలయం వద్ద పాండవ విద్యాభ్యాసనం మహోత్సవం భారత పఠనంలో నిర్వహించారు. రంగస్థల కళాకారులచే నిర్వహించారు. వేదపండితుల వేద మంత్రోచ్చార ణతో ప్రత్యేక పూజలు అర్చనలు నిర్వహించారు. శనివారం కావటంతో పట్టణానికి చెందిన భక్తులే కాకుండా చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు తరలి వచ్చారు. ఈ సందర్భంగా ఉదయం శ్రీకృష్ణార్జునులు ఆసీనులై సప్పరంలో భక్తులకు దర్శన మిచ్చారు. ఊరేగింపు ఆలయం నుంచి ప్రారంభమై సుమారు పట్టణంలో 5కిలోమీటర్లు సాగింది. ఉత్స వంతో పాటు ఆలయ ఇన్స్పెక్టర్ ఆర్.సుబ్రమణ్యం, సహాయకుడు దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రాసిక్యూషన్ డైరెక్టర్ బైరా రామకోటేశ్వరరావు

# సమగ్ర దర్యాప్తుతో బాధితులకు న్యాయం

## ప్రాసిక్యూషన్ రాష్ట్ర డైరెక్టర్ బైరా రామకోటేశ్వరరావు

**విజయవాడ కార్పొరేషన్,జులై 18,ప్రభాతవార్త:** ఎస్సీ,ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కేసుల్లో సమగ్ర దర్యాప్తుతో పాటు విచారణ జరిగితేనే భాధితులకు పూర్తి న్యాయం చేయగలిగిన వారమవుతామని రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ బైరా రామకోటేశ్వరరావు పేర్కొన్నారు. శనివారం విజయవాడ లోని ఆయన కార్యాలయంలో రాష్ట్ర స్థాయి ఎస్సీ,ఎస్టీ స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, డిప్యూటీ డైరెక్టర్లు, జాయింట్ డైరెక్టర్లతో ఈ సంవత్సరం జనవరి నుండి జూన్ మాసం వరకు స్పెషల్ పిపీల కేసుల విచారణలో ఉన్న కేసుల పురోగతిని ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దర్యాప్తులో ఎలాంటి లోపాలకు తావు లేకుండా పోలీసు అధికారులు కేసుల్లో ముందుకు సాగాలన్నారు. న్యాయస్థానంలో విచారణ సమ యంలో స్పెషల్ పీపీలు చేస్తున్న లోపాలను వారికి ఆయన వివరించారు. లోపాలకు తావు లేకుండా చేస్తేనే న్యాయస్థానం నిందితులకు కఠిన శిక్షలు విధించే అవకాశం ఉంటుందన్నారు. భాధితులకు నిజమైన న్యాయం జరుగుతుం దన్నారు. అత్యాచార భాధితులకు ప్రభుత్వం ఇచ్చే పరిహారాన్ని వేగంగా అందించేటట్లు చూ డాలని ఆయన ఆదేశించారు. పోలీసు అధికారులు, స్పెషల్ పిపిలు సమన్వయంతో పనిచేస్తేనే న్యాయం భాధితులకు అందుతుందన్నారు. ఈ సమావేశంలో జాయింట్ డైరెక్టర్ మద్దాల విజయ,డిప్యూటీ డైరెక్టర్లు బర్కత్ ఆలీఖాన్, ఎంకె విజయలక్ష్మి, ఆనంద జ్యోతి,రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లోని ఎస్‌పిలు, డిఎస్‌పిలు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న సామాజికవేత్త లక్ష్మీనారాయణ. చిత్రంలో సిపిఐ ముఖ్య నేతలు

# హంద్రీ నీవా కాలవ సామర్థ్యాన్ని పెంచాలి: పి.లక్ష్మీనారాయణ

## కామ్రేడ్ వీకే ఆదినారాయణ రెడ్డి జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలి: డి.జగదీష్

**అనంతపురం, జులై 18,ప్రభాతవార్త బ్యూరో :** హంద్రీ నీవా సుజల స్రవంతి పథకం కింద మాల్యాలనుంచి జీడిపల్లి వరకు ఉన్న ప్రధాన కాలువ సామర్థ్యాన్ని గణనీయంగా పెంచాలని, ఇప్పుడున్న 3,000 క్యూసెక్కుల నుంచి 6 నుంచి 8 వేల క్యూసెక్కుల వరకు కాలువ వెడల్పు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపాలని ప్రముఖ సామాజికవేత్త, రాజకీయ విశ్లేషకులు పి. లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. హంద్రీ నీవా, తుంగభద్ర రిజర్వాయర్ నుంచి వచ్చే నీటిని సక్రమంగా వినియోగించుకుని అనంతపురం జిల్లా సాగునీటి సౌకర్యాలను గణనీయంగా పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సాగునీటి ప్రాజెక్టుల అభివృద్ధి పనుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వీడి ,త్వరితగతిన కాలువల ఆధునికీకరణ పనులు చేపట్టాలని ఆయన విజ్ఞప్తి చేశారు. హంద్రీనీవా కాలువకు కామ్రేడ్ వి.కె. ఆదినారాయణరెడ్డి పేరు పెట్టాలని డిమాండ్ చేశారు. శనివారం అనం తపురం నగరంలోని వికె భవన్‌లో స్వాతంత్ర సమరయోధుడు, దివంగత సిపిఐ అగ్రనేత వి.కె.ఆదినారాయణరెడ్డి 29వ వర్ధంతి సభ జరిగింది. ఈ సందర్భంగా అనంతపురం జిల్లా కరువు పరిస్థితులు, సాగునీటి ప్రాజెక్టుల ఆశ్యకత అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన లక్ష్మీనారా యణ, ఇతర నాయకులు ముందుగా ఆదినారా యణరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి నారా యణస్వామి అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో లక్ష్మీనారాయణ మాట్లాడుతూ నీళ్ల లేకుంటే జీవమే లేదన్నారు. కరువు జిల్లా అయిన అనం తలో సాగునీటి ప్రాజెక్టుల అభివృద్ధితో పాటు కాలువల ఆధునీకరణ ఎంతో ప్రాముఖ్యత సంత రించుకుందని అన్నారు. జిల్లాలో 3.50 లక్షల ఎకరాకు సాగునీరు అందించవచ్చునని అన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా 1.50లక్షల ఎకరాలకు కూడా సాగునీరు అందడం లేదన్నారు. నేటి కమ్యూనిస్టు నాయకులు, కార్యకర్తలు అందరూ కామ్రేడ్ వి.కె.ఆదినారాయణరెడ్డి జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని సిపిఐ రాష్ట్రకార్యదర్శి వర్గ సభ్యులు జగదీష్ అన్నారు.ఈ కార్యక్ర మంలో వి.కె. మెమోరియల్ ట్రస్టు ఛైర్మన్ వి.కె. రంగారెడ్డి, సీనియర్ న్యాయవాది ఐదుకల్లు రవీంద్రనాథ్, మానవతా రక్తదాతల సంస్థ కన్వీనరు అమర్‌నాథ్‌రెడ్డి, ఎస్టీయు రాష్ట్ర సీనియర్ నాయకులు అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కోనలో వైభవంగా నృసింహుని కల్యాణోత్సవం

## హుండీ రాబడి రూ.4,31,424

**రాపూరు (నెల్లూరు), జులై 18, ప్రభాతవార్త :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో పెద్ద ఎత్తున శ్రీ పెనుశిల లక్ష్మీనృసింహ స్వామి వారి దర్శనానికి వచ్చిన భక్తులతో శనివారం ఆల య ప్రాంగణం నిండిపోయింది. పెద్ద ఎత్తున భక్తులు కోనకు చేరుకొని తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకొని స్వామి వారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా తెల్లవారుజామున స్వామి వారి మూల మూర్తికి ప్రత్యేకంగా అభిషేకం,గోపూజ, పూలాంగి సేవ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 9.30కి స్వామి వారికి ఆదిలక్ష్మీ, చెంచులక్ష్మీ అమ్మవార్లతో వైభవంగా స్వామి వారి కళ్యాణాన్ని ఆలయఅర్చక స్వాములు, వేదపండితులు వేదమంత్రోచ్ఛరణలతో శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం స్వామి వారికి తిరుచ్చి ఉత్సవం, స్వామి వారికి భక్తులు సమర్పించిన 100 గోడుగులతో, గిరిజన వాయిద్యాల నడుమ వేడుకగా నిర్వహించారు. అనంతరం స్వామి వారికి సహస్ర దీపాలంకరణ సేవ నిర్వహించారు. పెద్ద ఎత్తున వచ్చిన భక్తులకు కావలసిన భోజన, వసతి సౌకర్యాలతో పాటు, క్యూలైన్లలో భక్తులకు మంచినీరు,మజ్జిగ పంపిణీ వంటి ఏర్పాట్లను ఆలయ ఉప కమీషనర్ కోవూరు జనార్ధన్ రెడ్డి ప్రత్యక్ష పర్యవేక్షణ నిర్వహించారు. శనివారం స్వామి వారికి భక్తుల ద్వారా రూ.11,25,910 రాబడి వచ్చినట్లు ఆలయ ఉప కమీషనర్ కోవూరు జనార్ధన్ రెడ్డి తెలిపారు. స్వామి వారి నిత్య అన్నదానానికి విరాళల రూపేణా రూ.67,764లు, శ్రీవారి అభిషేకం టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.26,250 లు, నిత్య కళ్యాణం ద్వారా రూ.19,500లు ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా రూ.46,900లు దేవస్థానం వసతి ద్వారా రూ.20,300 లు, తలనీలలు 1321 మంది సమర్పించగా తద్వారా రూ.52,840లు, లడ్డు ప్రసాదాల విక్రయం ద్వారా రూ.1,64,655లు, పులిహోరా విక్రయం ద్వారా రూ.21,280 లు, వడ ప్రసాదం విక్రయం ద్వారా రూ.10,385లు,వాహనాల పూజల ద్వారా రూ.1,550లు చొప్పున మొత్తం రూ.4,31,424 రాబడి వచ్చినట్లు జనార్ధన్ రెడ్డితెలిపారు.స్వామి వారి అన్న ప్రసాదాన్ని 1988 మంది స్వీకరించారని, సాయంత్రం 6.30 నిమిషాల వరకు మొత్తం 5,581 మంది భక్తులు స్వామి,అమ్మవార్లను దర్శించుకున్నట్లు ఆయన తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఆలయ సూపరిడెంట్ పాలవల్లి లక్ష్మీ నారాయణ, ప్రధానార్చకులు గుండ్లూరు రామయ్య స్వామి, పెంచల పెంచలయ్య స్వామి, ముఖ్య అర్చక స్వామి గుండ్లూరు శశి స్వామి, అర్చక స్వాములు మధు స్వామి, వర్ధన్ స్వామి, వెంకట బాలాజీ స్వామి,వినోద్ స్వామి, నాగరాజు స్వామి, సాయి స్వామి, దేవస్థానం సిబ్బంది, పెద్ద ఎత్తున భక్తులు తదితరులున్నారు.

# నెల్లూరులో ఘనంగా స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర

### వర్చువల్‌గా 101 ఎలక్ట్రిక్ చెత్త సేకరణ వాహనాలను ప్రారంభించిన: సిఎం చంద్రబాబు

### కాలుష్య రహిత, స్వచ్ఛమైన నెల్లూరు లక్ష్యంగా మరో ముందడుగు



**నెల్లూరు, జులై 18 ప్రభాతవార్త:** నగరంలోని గాంధీ బొమ్మ సెంటర్ వద్ద సోమవారం స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కృష్ణా జిల్లా గుడివాడ నుంచి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వర్చువల్ విధానంలో నెల్లూరు నగరానికి మంజూరైన 101 ఎలక్ట్రిక్ డోర్‌టుడోర్ చెత్త సేకరణ వాహనాలను ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, నగర మేయర్ సుజాత, నూడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ నందన్, డిప్యూటీ మేయర్లు రూప్ కుమార్ యాదవ్, తహసీన్, మున్సిపల్ కార్పొరేటర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. రాష్ట్ర వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ స్వచ్ఛ భారత్-స్వచ్ఛాంధ్ర మిషన్‌లో భాగంగా ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అగ్రస్థానంలో నిలిపేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టితో పనిచేస్తున్నారని కొనియాడారు. నెల్లూరు నగరానికి ప్రభుత్వం మొత్తం 200 ఎలక్ట్రిక్ ఆటోలను మంజూరు చేయగా, తొలి విడతలో 101 వాహనాలను ప్రారంభించడం సంతోషకరమన్నారు. నెల్లూరు రూరల్ సమీపంలోని దొంతాలి వద్ద ఏర్పాటుచేసిన వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ ను కూడా సీఎం ప్రారంభించారని అజీజ్ చెప్పారు. ఈఆటోల వినియోగంతో నెలకు సుమారు 25 వేల లీటర్ల డీజిల్ ఆదా కావడంతో పాటు వాయు కాలుష్యం తగ్గి నగరపాలక సంస్థ నిర్వహణ వ్యయాలు కూడా గణనీయంగా తగ్గనున్నాయని తెలిపారు. అదేవిధంగా ప్రతి వాహనానికి జియో ఫెన్సింగ్ (జీపీఎస్) వ్యవస్థను అనుసం ధానించడం ద్వారా 100 శాతం డోర్‌టు డోర్ చెత్త సేకరణను పకడ్బం దీగా పర్యవేక్షించవచ్చని తెలిపారు. నగరంలోని ప్రతి వీధి, ప్రతి ఇంటి నుంచి ప్రతిరోజూ చెత్తను సేకరించి 100% శాతం డోర్‌టుడోర్ కలెక్షన్ లక్ష్యాన్ని సాధించేందుకు ఇవి దోహదపడతా యన్నారు. నగర మేయర్ దేవరకొండ సుజాత మాట్లాడుతూ స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర లక్ష్యసాధనలో ప్రభుత్వం చేపడుతున్న కార్యక్ర మాలను ప్రజలు విజయవంతం చేయాలని, నగర పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించి సహ కరించాలని పిలుపునిచ్చారు నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోనే మొట్టమొదటి సారిగా నెల్లూరు కార్పొరేషన్‌లోనే ఇంత పెద్ద మొత్తంలో ఎలక్ట్రిక్ ఆటోలను అందుబాటులోకి తీసుకురావడం జరిగిందని హర్షం వ్యక్తం చేశారు నెల్లూరు నగరానికి మొత్తం 200 ఈఆటోలు మంజూరు కాగా, మొదటి దశలో లభించిన ఈ 101 ఆటోల ద్వారా నగరంలోని 54 డివిజన్లలో 100 డోర్‌టుడోర్ చెత్త సేకరణ జరిగేలా పకడ్బందీ ప్రణాళికలు రూపొందించినట్లు వెల్లడించారు. స్థానిక మహిళా నేత కప్పిర రేవతి సీఎంతో ఈ కార్యక్రమం గురించి ముఖాముఖిగా మాట్లాడారు. గత ప్రభుత్వం కుప్పలు కుప్పలుగా చెత్తను మిగిల్చి వెళ్లిందని, తమ ప్రభుత్వం ఆ చెత్తను సంపదగా మార్చేందుకు బృహత్తర కార్యక్రమాలు చేపడుతుందని ఈ సందర్భంగా సీఎంకి, మంత్రి పొంగూరు నారాయణకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ఈ కార్యక్రమాలతో నెల్లూరు నగరం స్వచ్ఛ నగరంగా మారుతుందని ఆమె సీఎంతో తమ అభిప్రాయాన్ని పంచు కున్నారు.ఈ కార్యక్రమంలో నెల్లూరు నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# జగద్గురు చెన్నబసవ రాజేంద్రస్వామి శివైక్యం

### పార్థివదేహం ఉరవకొండ గవిమఠ సంస్థానానికి చేర్చి శాస్త్రోక్తంగా పూజల నిర్వహణ

### 1996 నుంచి గవిమఠం పీఠాధిపతిగా 30 సంవత్సరాలపాటు విశిష్ట సేవలు

### నేటి మధ్యాహ్నం గవిమఠంలో వీరశైవ ఆచారం ప్రకారం స్వామీజీ అంత్యక్రియలు



చెన్నబసవరాజేంద్ర మహాస్వామి (ఫైల్)

**ఉరవకొండ, జులై 18 ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్నాటక రాష్ట్రాల్లోనే ప్రసిద్ధి చెందిన ఉరవకొండ గవిమఠ సంస్థానం 8వ పీఠాధిపతి పరమపూజ్య జగద్గురు చెన్నబసవరాజేంద్ర మహాస్వామి (98) శివైక్యం పొందారు. గత కొంత కాలంగా స్వామీజీ వృద్ధాప్యం కారణంగా వచ్చే అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. ఇటీవల తనకు తలలో నాలుకలా వ్యవహరించే ఏజెంటు రాజన్నగౌడ్ అకాల మరణం ఆయన్ను బాగా కుంగదీసినట్లు తెలుస్తోంది. నాటి నుండి కర్ణాటక రాష్ట్రంలోని బళ్లారిలోగల మరి రాచోటిస్వామి మఠంలో కళ్యాణిస్వామివద్ద ఉంటున్న స్వామీజీ శుక్రవారం రాత్రి స్వల్ప అస్వస్థతకు గురికాగా వైద్యులు మఠానికే వచ్చి స్వామీజీను పరీక్షించి ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చెప్పి వెళ్లినట్లు సమాచారం. ఈ క్రమంలోనే శనివారం ఉదయం 5.30 గంటల సమయంలో నిద్రలోనే స్వామీజీ తుదిశ్వాస విడిచారు. పీఠాధిపతి శివైక్యం పొందారన్న వార్త తెలియగానే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్నాటక రాష్ట్రాల్లోని భక్తులు శోకసంద్రంలో మునిగిపోయారు. విషయం తెలియగానే ఉత్తరాధికారి జగద్గురు డాక్టర్ కరిబసవరాజేంద్రస్వామి, సహాయ కమీషనర్ గంజి మల్లికార్జున ప్రసాద్ మరి రాచోటిస్వామి మఠానికి చేరుకొని పీఠాధిపతి పార్థీవదేహాన్ని సందర్శించుకొని ఆచార పద్ధతుల ప్రకారం కళ్యాణిస్వామితో కలిసి అక్కడ పూజలు నిర్వహించారు. అనంతరం పీఠాధిపతికు చెందిన ఇన్నోవా వాహనంలోనే స్వామీజీ పార్థీవదేహాన్ని రోడ్డు మార్గాన ఉరవకొండ గవిమఠంకు చేరి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి భక్తుల సందర్శనార్థం ఫ్రీజర్ బాక్సులో ఉంచారు. జగద్గురు చెన్నబసవరాజేంద్రస్వామి 1996 నుంచి గవిమఠ సంస్థానికి 8వ పీఠాధిపతిగా నియమితులై 30 సంవత్సరాలపాటు విశిష్ట సేవలందించారు. కర్నాటక రాష్ట్రం బెల్గామ్ జిల్లా బైలవంగల్ తాలుకా మార్గన్ కొప్పం గ్రామానికి చెందిన శంకరప్ప, పారమ్మ పుణ్య దంపతుల ఏకైక మగ సంతానమైన (ఇద్దరు సోదరీమణులు ఉన్నారు) చెన్నబసవయ్య 1929లో జన్మించారు. ఆదివారం మధ్యాన్నం 12 గంటల తరువాత గవిమఠంలోని పూర్వ పీఠాధిపతులు సమాధులు ఉన్న సముదాయం ఆవరణంలోనే పీఠాధిపతి జగద్గురు చెన్నబసవరాజేంద్ర మహాస్వామి అంతిమ సంస్కారాలు నిర్వహించి సమాధిని నిర్మించడం జరుగుతుందని ఉత్తరాధికారి జగద్గురు డాక్టర్ కరిబసవరాజేంద్ర మహాస్వామి, సహాయ కమీషనర్ గంజి మల్లికార్జున ప్రసాద్ తెలిపారు.

# నీటిగుంటలో పడి ఇద్దరు మహిళలు మృతి

**నంద్యాల, జులై 18 ప్రభాతవార్త ప్రతినిధి :** ఉయ్యాలవాడ మండల పరిధిలోని బోడెమ్మనూరు గ్రామ సమీపంలో గల కుందూనది నీటి గుంటలో పడి ఇద్దరు మహిళలు శనివారం మృతి చెందారు. పక్కీర రసూల్ బి (38) పక్కీర బీబీ (50)లు ఇద్దరూ గొర్రెలు తోలుకొని కుందూ నది ఒడ్డున గల ఇంజేడు పొలాలలో గడ్డి మేపుటకు వెళ్ళి నీటి లోతు తెలియక గుంటలో మునిగిపోయారు.మొదట పక్కీర రసూల్ బి నీళ్లలో దిగి మునిగిపోతూ ఉండగా వెంటనే ఆమెను కాపాడటానికి ఆమెతో పాటు పక్కీర బీబీ కూడా నీటిలో దిగింది. ఈత రాకపోవడంతో ఊపిరాడక ఇద్దరూ నీటిలో మునిగి చనిపోయారు. విషయం తెలుసుకున్న ఆళ్లగడ్డ డి ఎస్ పి శ్రీనివాస రావు, రూరల్ సీఐ బీవీ రమణ ఉయ్యాలవాడ ఎస్సై లు ఘటనా స్థలాన్ని సందర్శించారు. అనంతరం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# రహదారి ప్రారంభం

**కొడవలూరు (నెల్లూరు), జులై 18, ప్రభాతవార్త :** కొడవలూరు మండలం వెంకన్నపురం గ్రామంలో అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, మహిళా సాధికారత, వ్యవసాయాభివృద్ధికి సంబంధించిన పలు కార్యక్రమాలను శనివారం నిర్వహించారు. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల పాల్గొని రూ.కోటి వ్యయంతో నిర్మించిన మూడు కిలోమీటర్ల తారు రహదారిని ప్రారంభించారు. అనంతరం కోరమాండల్ ఇంటర్నేషనల్ సంస్థ, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ కృష్ణయ్య సహకారంతో రూ.35 లక్షల వ్యయంతో రహదారికి ఇరువైపులా 600 మొక్కలు నాటే కార్యక్ర మాన్ని ప్రారంభించారు. మహిళల కోసం ఏర్పాటు చేసిన కుట్టుమిషన్ల శిక్షణ, ఉపాధి కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం కోరమాండల్ సంస్థ ఏర్పాటు చేసిన గ్రో మోర్ న్యూట్రి క్లినిక్ను ఎమ్మెల్యే, కలెక్టర్ ప్రారంభించారు.

# తాగి వచ్చాడు ప్రాణం తీశాడు

**జగ్గయ్యపేట, జులై 18, ప్రభాతవార్త :** ఇన్స్టాగ్రామ్ లో పరిచయం అయ్యింది. అది ప్రేమకు దారి తీసింది. పెళ్ళి కూడా చేసుకున్నాడు. తాగి వచ్చాడు ప్రాణం తీశాడు. ఇది ఒక విషాద సంఘటన. ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం అనుమంచిపల్లి గ్రామ ఎస్‌సి కాలనీలో ఈ దుర్ఘటన జరిగింది. సేకరించిన సమాచారం ప్రకారం వినుకొండ గ్రామానికి చెందిన ఒర్సు మేరి (30)తీవ్రగాయాలతో విగత జీవిగా మారింది. సహజీవనం చేసుకుని ఇంటి వద్దే తాళి కట్టిపెళ్ళి చేసుకున్న నిందితుడు ఎద్దు గోపి ఈ ఘాతుకానికి పాల్పడినట్లు గ్రామస్తులు ఆరోపించారు. పోలీసులు ప్రాథమికంగా అనుమానాస్పద మృతి కింద కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. మృతురాలు మేరీకి సంవత్సరం క్రితం ఎద్దు గోపి ఇన్స్టాగ్రామ్ ద్వారా పరిచయం అయ్యాడు. ఈ పరిచయం ప్రేమగా మారిపోయింది. దీంతో సంవత్సర కాలంగా మేరి, గోపి అనుమంచిపల్లి గ్రామంలో సహజీవనం చేస్తున్నారు. ఆమె కోరికపై ఇంటి వద్దే తాళికట్టి పెళ్ళి చేసుకున్నట్లు స్థానికుతు చెబుతున్నారు. శుక్రవారం రాత్రి వీరిరువురి మధ్య గొడవ జరిగింది. బాగా మద్యం తాగి వచ్చిన గోపిని మేరి ప్రశ్నించటంతో ఘర్షణకు దిగిన గోపి తీ వ్రంగా కొట్టటంతో ఆమె స్పృహ కోల్పోయింది. స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్ళే సరికే ఆమె మృతి చెందివున్నట్లు వైద్యాధికారులు గుర్తించారు. నిందితుడు గోపిపై ఇప్పటికే పలు కేసులు ఉన్నాయని నివాసితప్రాంత వాసులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. స్థానిక సిఐ వెంకటేశ్వర్లు, చిల్లకల్లు ఎస్ఐ సూర్యశ్రీనివాస్ కేసు దర్యాప్తు చేపట్టారు. నిందితుడు పోలీసుల అదుపులోవున్నట్లు సమాచారం తెలిసింది.

**జగ్గయ్యపేటలో భారీ చోరీ**

ఎన్టిఆర్ జిల్లా జగ్గయ్యపేట పట్టణంలోని సీతారామపురంలో తాళంవేసివున్న ఒక ఇంటిలో భారీ చోరీ జరిగింది. ఇంటి యజమాని న్యాయవాది ఎం శ్రీధర్ ఈనెల 10వ తేదీన ఇంటికి తాళం వేసి హైదరాబాద్ వెళ్ళారు. అయితే 15వ తేదీన పనిమనిషి ఇంటి తలుపులు తెరిచివున్నట్లు గమనించి సమాచారం ఇవ్వటంతో శ్రీధర్ తిరిగివచ్చి చోరీ జరిగినట్లు గుర్తించారు. ఇంటిలో రూ.4.42 లక్షల నగదుతోపాటు బంగారు ఉంగరాలు, చెవి దిద్దులు, మాటీల జత, వెండి వస్తువులు చోరీకి గురైనట్లు శ్రీధర్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదుచేశారు.

# గుంటూరు ఘటన మానవత్వానికే మచ్చ: మాజీ సిఎం జగన్



**విజయవాడ,జులై 18,ప్రభాతవార్తప్రతినిధి:** గుంటూరులో ఒక మహిళను వివస్త్రను చేసి, టీడీపీ నాయకుడు దాడికి పాల్పడిన ఘటన మానవత్వానికే మచ్చ అని, రాష్ట్రంలో శాంతిభద్రతల నిర్వహణ ఎంత ఘోరంగా విఫలమైందో చెప్పడానికి ఇది నిలువెత్తు నిదర్శనమని వైసీపీ అధినేత జగన్ మండిపడ్డారు. ఈ దారుణానికి చంద్రబాబు ప్రభుత్వం సిగ్గుతో తలదించుకోవాలని ఆయన విమర్శించారు.ఈ ఘటన బుధవారమే జరిగినా, మూడు రోజులపాటు దానిని కప్పిపుచ్చే ప్రయత్నం చేశారని, చివరకు ఆ వీడియోలు సోషల్ మీడియాలో బయటకు వచ్చి రాష్ట్ర ప్రజలంతా ఈ పరిపాలనను అసహ్యించుకున్న తర్వాతే ప్రభుత్వం స్పందించిందని ఆయన ధ్వజమెత్తారు. ఇప్పుడు తానేదో గొప్పగా చర్యలు తీసుకుంటున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు హడావుడి చేయడం మరింత సిగ్గుచేటని అన్నారు. ఆ వీడియోలను కప్పిపుచ్చడంపై చూపిన శ్రద్ధను నిందితులను పట్టుకోవడంపై చూపలేదని జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం తనపై తొలిసారి దాడి జరిగిన వెంటనే బాధితురాలు పోలీసులను ఆశ్రయించినప్పుడు వారు స్పందించి ఉంటే, ఆ తర్వాత ఇంతటి ఘోరం జరిగేది కాదు కదా అని ప్రశ్నించారు. ఆమె ఫిర్యాదుపై వెంటనే కేసు నమోదు చేసి, నిందితులను అదుపులోకి తీసుకుని ఉంటే ఈ దారుణం జరిగేదా? అని నిలదీశారు. ఫిర్యాదు చేసిన మహిళకు రక్షణ కల్పించకుండా మౌనం వహించడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. "అసలు పోలీస్ స్టేషన్లు ఉన్నది ఎందుకు? బాధితుల ఫిర్యాదులను స్వీకరించడానికా? లేక అధికార పార్టీ నాయకులు ఏం చెబితే అది చేయడానికా? బాధితురాలికి అండగా నిలవకపోగా, పంచాయితీలు చేయడానికి ప్రయత్నిస్తారా? వీడియోలు బయటకు వస్తేనే చట్టం మేల్కొంటుందా? బాధితురాలి ఫిర్యాదుకు విలువ లేదా? నేరం జరుగుతున్నప్పుడు స్పందించకుండా, ప్రజల్లో ఆగ్రహం పెల్లుబికిన తర్వాత చర్యల పేరుతో నాటకాలు ఆడటం ఏ రకమైన పోలీసింగ్? రెడ్‌బుక్ రాజ్యాంగం పేరుతో ప్రతిపక్ష నాయకులు, కార్యకర్తలు, సోషల్ మీడియా యాక్టివిస్టులపై ఈ చంద్రబాబు ప్రభుత్వం కావాలనే దాడులను ప్రోత్సహించింది. ఆ అరాచకాలను కప్పిపుచ్చడానికి పోలీసు వ్యవస్థను ఒక రాజకీయ ఆయుధంగా మార్చుకుంది. చట్టాన్ని అధికార పార్టీకి చుట్టంగా, ప్రతిపక్షాలపై వేధింపులకు, అక్రమ కేసులకు ఒక సాధనంగా మార్చి రాష్ట్రాన్ని జంగిల్‌రాజ్‌గా దిగజార్చింది" అని ఆయన తీవ్రంగా విమర్శించారు.

# 22న దుర్గమ్మ హుండీ లెక్కింపు




**ఇంద్రకీలాద్రి, జులై 18, ప్రభాతవార్త :** దుర్గమ్మవారికి భక్తులు హుండీల ద్వారా సమర్పించిన కానుకలను ఈనెల 22న మహామండపం 6వ అంతస్తులో లెక్కిస్తామని ఇఒ వికె శీనా నాయక్ తెలిపారు.

**దుర్గమ్మవారి ఆలయంలో వైభవంగా శ్రీ సుబ్రహ్మణ్య కళ్యాణం:** దుర్గమ్మవారి ఆలయంలో శనివారం ఉదయం 9గంటలకు శ్రీ వల్లీ దేవసేనా సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివార్ల కళ్యాణోత్సవం వైభవోపేతంగా నిర్వహిస్తామని ఇఓ వికె శీనా నాయక్ తెలిపారు.

**దళారుల మోసాలకు గురికావద్దు:** దుర్గమ్మవారి ఆలయంలో ఉద్యోగాలిప్పిస్తామని, సేవ చేయడానికి అవకాశం కల్పిస్తామని, తదితర మాయ మాటలు చెప్పే దళారుల మాటలను నమ్మవద్దని, మోసపోవద్దని ఇఓ వికె శీనా నాయక్ భక్తులకు తెలిపారు. దళారులు శ్రీ అమ్మవారి పేరిట ఉత్సవాలు, ఊరేగింపులు, శ్రీదుర్గామల్లేశ్వర స్వామివార్ల దర్శనం, తదితరాలపై మోసపుచ్చుతూ ఇచ్చే ప్రకటనలను నమ్మవద్దని, భక్తులకు తెలిపారు. భక్తులందరు డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు. కనకదుర్గమ్మ.ఓఆర్‌జి దేవస్థానం వెబ్‌సైట్ ద్వారా లేదా టోల్‌ఫ్రీ ఫోన్ 18004259099 ల ద్వారా కాని మాత్రమే సంప్రదించి దేవస్థానం ద్వారా వివరాలు తెలుసుకోవాలన్నారు.

**దుర్గమ్మవారి సేవలో విఐపిలు:** దుర్గమ్మవారిని శనివారం ఏపి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్ జయసూర్య దర్శించుకున్నారు. కలకత్తా డెబిట్స్ రికవరి అప్పిలేట్ ట్రిబ్యునల్ చైర్మన్ జస్టిస్ అనిల్ కుమార్ శ్రీవాత్సవ దర్శించుకున్నారు. వారికి దుర్గమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, మెమంటోలు అందించిన తరువాత వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

**దుర్గమ్మవారికి భక్తబృందాల ఆషాఢం సారె:** శనివారం సాయంత్రం 5 గంటల వరకు 21 భక్త బృందాలకు చెందిన 11,613మంది భక్తులు దుర్గమ్మవారికి ఆషాఢం సారె సమర్పించారు. వారికి ఉచితంగా రు.100 దర్శనం కల్పించారు.

# చాట్లవాసు మృతి పట్ల ఎమ్మెల్యే దగుమాటి విచారం

**కావలి (నెల్లూరు), జులై 18, ప్రభాతవార్త :** కావలి రూరల్ మండలం సర్వాయపాలెం పంచాయితీ తాగేటివారి పాలెంకు చెందిన టిడిపి కార్యకర్త చాట్ల వాసుపై ఇటీవల వైసిపి నాయకులు చేసిన దాడిలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ శనివారం నెల్లూరు ఆసుపత్రిలో మృతి చెందాడు. సమాచారం అందుకొన్న ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి విచారం వ్యక్తం చేశారు. ఇటీవల పథకం ప్రకారం వాసుపై వైసిపి నాయకులు విచ క్షణారహితంగా దాడికి పాల్పడిన విషయంపై ఎమ్మెల్యే విచారం వ్యక్తం చేశారు. వైసిపి నేతలు టిడిపి నాయకులు, కార్యకర్తలపై దాడులు హెచ్చుమీరుతున్నాయని ఇది సహించరానివన్నారు.

రూరల్ మండలం చెన్నయపాలెం గ్రామానికి చెందిన టిడిపి నాయకులు, మాజీ సర్పంచ్ అరగల క్రిష్ణయ్యపై గతనెల 8న అతి దారుణంగా మరాణాయు దాలతో వైసిపి మాజీ ఎమ్మెల్యే అనుచరులు దాడికి పాల్పడిన విషయం గుర్తుచేశారు. ప్రధాన నిందితుడు మదు, మరో ఇద్దరు నిందితులతో రవిచంద్ర అనే నిందితున్ని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. తప్పు చేసిన వారిని పోలీసులు కఠిన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించనట్లు తెలిపారు. మృతుడు చాట్ల వాసు భార్య, చంట పిల్లలు ఉన్నారని వారు ధైర్యంగా ఉండాలని వారికి టిడిపి అండగా ఉంటుందని తెలిపారు.

# అనారోగ్యం కారణంగానే విరాళమిచ్చారా?

## గోశాలలో మగ గుర్రం మృతి



**తిరుమల,జులై 18ప్రభాతవార్తప్రతినిధి:** ఐదురోజులు క్రిందట విరాళం రూపంలో తిరుపతి ఎస్వీగోశాలకు చేరిన మగగుర్రం అనారోగ్యంతో శనివారం సాయంత్రం ప్రాణాలు విడిచింది.

దాత విరాళంగా ఇచ్చిన రోజుకే అది ఆనారోగ్యంతో బాధపడుతున్నట్లు తెలిసే ఇలా చేశారా అనే విమర్శనలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికే గోశాలలో సమస్యలు గాడిన పడుతున్న సమయంలో విరాళంగా వచ్చిన మగగుర్రం మృతితో సంచలనంగా మారింది.

ఈనెల 13న గోశాలకు చేరిన వెంటనే గుర్రాన్ని క్వారంటైన్‌లో ఉంచి రక్తం, పేడ నమూనాలను తిరుపతిలోని రాష్ట్ర స్థాయి పశు వ్యాధి నిర్ధారణ ప్రయోగశాలకు పంపించారు. ప్రాథమిక పరీక్షల్లో గుర్రం దీర్ఘకాలిక కాలేయం, మూత్రపిండాల సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నట్లు వెల్లడైందని ఎస్వీ గోశాల డైరెక్టర్ డాక్టర్ ఏ.వి.ఎన్. శివకుమార్ తెలిపారు. గుర్రం గోశాలకు వచ్చినప్పటి నుండి మేత, నీరు సరిగా తీసుకోకపోవడం, మాటిమాటికి కూర్చోవడం, పడుకోవడం, దొర్లడం, తిరిగి లేవడం వంటి అస్వస్థత లక్షణాలను గమనించిన వెంటనే గోశాల పశువైద్యుల పర్యవేక్షణలో నిపుణుల సూచనల మేరకు అవసరమైన వైద్య చికిత్సలు, ప్రత్యేక సంరక్షణ చర్యలు చేపట్టినట్లు వివరించారు. అన్ని విధాలుగా వైద్య చికిత్సలు అందించినప్పటికీ ఆరోగ్య పరిస్థితిలో ఎలాంటి మెరుగుదల కనిపించక, చికిత్సకు స్పందించకుండా శనివారంగుర్రం మృతి చెందినట్లు తెలిపారు.

మధురైకి చెందిన దాత షణ్ముగం వెంటనే ఎస్వీ గోశాలకు వచ్చారని, ఆయన సమక్షంలోనే గుర్రం మృతి చెందిందని పేర్కొన్నారు. శవపరీక్ష అనంతరం శాస్త్రీయ పద్ధతిలో ఖననం వేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయానికి చెందిన వైద్య నిపుణుల బృందం సమక్షంలో శవపరీక్ష నిర్వహించారు. ప్రాథమికంగా గుర్రం దీర్ఘకాలిక కాలేయం, హృదయం, మూత్రపిండాల వ్యాధులతో బాధపడినట్లు నిర్ధారణ అయిందని తెలిపారు. తుది శవపరీక్ష నివేదిక అందిన అనంతరం మరణానికి గల ఖచ్చితమైన కారణం వెల్లడికానుందని పేర్కొన్నారు.

శవపరీక్ష అనంతరం గుర్రాన్ని శాస్త్రీయ పద్ధతిలో ఖననం చేసినట్లు ఎస్వీ గోశాల అధికారులు తెలిపారు.

# గన్నవరం విమానాశ్రయంలో ఏటిసి టవర్

## ప్రారంభించిన కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

**గన్నవరం(కృష్ణా), జులై 18, ప్రభాతవార్త :** గన్నవరం విమానాశ్రయంలో నూతనంగా నిర్మించిన ఏటిసి టవర్ కమ్ టెక్నికల్ బ్లాక్‌ను కేంద్రపౌరవిమాన యానశాఖా మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు విజయవాడ యంపి కేశినేని చిన్ని, బందరు యంపి వల్లభనేని బాలశౌరిలతో కలిసి శనివారం ప్రారంభించారు. ఈసందర్భంగా టెర్మినల్ నిర్మాణ పనులను పరిశీలించి పనుల పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. రాబోయే దసరా నాటికి టెర్మినల్ నిర్మాణం పూర్తికావాలని ఆదేశించారు. విమానాశ్రయం ఆవరణలో మొక్కలు నాటారు. యంపి కేశినేని చిన్ని మాట్లాడుతూ అగష్టు 13 వతేదీ గన్నవరం-వారణాసి విమానసర్వీసు ప్రారంభంకానుందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గన్నవరం నుండి ఇతర పట్టణాలకు విమనసర్వీసులు పెంచనట్లు తెలిపారు. ఈనెల 25వతేదీ నుండి ఇంటర్నేషనల్ కనెక్టివిటీ పెరుగుతుందన్నారు. ఈకార్యక్రమంలో విమానాశ్రయ అధికారులు పాల్గొన్నారు.



విమానాశ్రయంలో మొక్కనాటుతున్న కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, యంపిలు చిన్ని, బాలశౌరి తదితరులు

**రహదారి అభివృద్ధిపనుల ప్రారంభం :** విజయవాడ భారతీనగర్ గురునానక్ కాలనీల్లో రూ.3.02కోట్ల వ్యయంతో నిర్మించనున్న ఎండ్‌టుఎండ్ రహదారి అభివృద్ధి పనులను కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు శనివారం ప్రారంభించారు. వాయుకాలుష్యం తగ్గించేందుకు 15వ ఆర్థికసంఘం ఎయిర్ క్వాలిటీ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం నిధులతో ఈపనులు చేపట్టారు. ఈకార్యక్రమంలో విజయవాడ యంపి కేశినేని చిన్ని, తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహనరావు, ఏపిస్టేట్ కుమ్మరి శాలివాహన కార్పోరేషన్ చైర్మన్ ఈశ్వర్, విజయవాడ నగరపాలకసంస్థ చీఫ్ ఇంజనీర్ పి.సత్యకుమారి, తదితరులు పాల్గొన్నారు.

## సిపిగెట్-2026 ప్రాథమిక కీ విడుదల

### 20 వరకు అభ్యంతరాల స్వీకరణ

**హైదరాబాద్, జులై 18, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని 9 యూనివర్సిటీల్లో వివిధ పీజీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన కామన్ పీజీ ఎంట్రన్స్ టెస్ట్(సీపీజీఈటీ)-2026 పరీక్షలకు సంబంధించిన ప్రాథమిక కీని విడుదల చేసినట్లు సీపీగెట్-2026 కన్వీనర్ ప్రొఫెసర్ రాజేందర్ కట్ల శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీపీగెట్‌కి సంబంధించిన ప్రాథమిక (ప్రొవిజనల్) కీని అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. అభ్యర్థులు ప్రాథమిక కీపై అభ్యంతరాలు, సందేహాలను ఈ నెల 20 మధ్యాహ్నం 1.40 గంటలలోపు ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ప్రతి ప్రశ్నకు రూ.200 రుసుము చెల్లించి అభ్యంతరాలను సమర్పించవచ్చని, నిర్ణీత గడువు అనంతరం అందిన అభ్యంతరాలను ఎట్టి పరిస్థితుల్లోనూ పరిగణనలోకి తీసుకోబడవని ఆయన ప్రకటనలో స్పష్టం చేశారు.




## మురళీ మోహన్‌కు ఐఎంఎ కమ్యూనిటీ సర్వీస్ అవార్డు

### ఢిల్లీలో అందజేసిన రక్షణ శాఖ మంత్రి రాజనాథ్ సింగ్

**విశాఖపట్నం, జులై 18 ప్రభాత వార్త:** ఆంధ్రా వైద్య కళాశాల 1986 బ్యాచ్ పూర్వ విద్యార్థి డాక్టర్ ఎంవీవీ మురళీ మోహన్ ను ప్రతిష్టత్మాక ఐఎంఏ సామాజిక వైద్య సేవా అవార్డు వరించింది. భారతీయ వైద్యుల సంఘం (ఐఎంఏ )సామాజిక సేవల విభాగం లో డాక్టర్ మురళి మోహన్ చేసిన వైద్య సేవలకు గుర్తింపుగా రాష్ట్రం నుంచి ఆయనను ఈ అవార్డు కు ఎంపిక చేసింది.న్యూ ఢిల్లీలోని కానిస్టట్యూషన్ క్లబ్ లోశనివారం భారత జాతీయ వైద్యుల సంఘం జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన సమావేశంలోడాక్టర్ మురళీ మోహన్ కు ప్రతిష్టాత్మక కమ్యూనిటీ సర్వీస్ అవార్డు విభాగంలో అవార్డు ను భా రత రక్షణ మంత్రి రాజనాథ్ సింగ్ చేతుల మీదుగా అందజేశారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ మురళీ మోహన్ సామాజిక వైద్య సేవలు అజరామరం అని భారత రక్షణ శాఖ మంత్రి రాజనాథ్ సింగ్ కొనియాడారు. రాజ్యసభ సభ్యులు మయాంక్ భాయ్ జె. నాయక్ హాజరైన ఈ కార్యక్రమానికి ఐఎం ఎ అధ్యక్షులు డాక్టర్ అనిల్ జె. నాయక్ అధ్యక్షత వహించారు, డాక్టర్ దిలీప్ బన్సాలియా డాక్టర్ సరాసరి దత్తా, పియూష్ జైన్ తదితరులు పాల్గొని మాట్లాడారు.అవార్డు గ్రహీత డాక్టర్ మురళీ మోహన్ మాట్లాడుతూ తాను నిర్వహిస్తున్న వైద్య సేవలును గుర్తించిన ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలియజేశారు.

# జమ్మూకాశ్మీర్‌లోని ఎల్ఓసి వద్ద కాల్పులు

## ఉగ్రవాదుల చొరబాటు యత్నాన్ని భగ్నం చేసిన భారత్ సైన్యం

**న్యూఢిల్లీ, జులై 18:** జమ్మూకశ్మీర్‌లోని రాజౌరి సెక్టార్‌లో నియంత్రణ రేఖ వెంబడి శుక్రవారం రాత్రి దాదాపు రెండు గంటల పాటు భారీ సరిహద్దు కాల్పులు చోటుచేసుకున్నాయి. పాకిస్థాన్ వైపు నుంచి ఉగ్రవాదులను భారత్‌లోకి చొరబాటుకు పంపే ప్రయత్నాన్ని భారత సైన్యం అప్రమత్తంగా గుర్తించి విజయ వంతంగా తిప్పి కొట్టిందని అధికార వర్గాలు తెలిపాయి. అధికారుల వివరాల ప్రకారం, పాకిస్థాన్ వైపు నుంచి ఎలాంటి రెచ్చగొట్టింపు లేకుం డానే కాల్పులు ప్రారంభ మయ్యాయి. సరిహద్దులో విధులు నిర్వహిస్తున్న భారత సైనికులు అనుమానాస్పద కదలికలను గుర్తించడంతో వెంటనే ప్రతిదాడికి దిగారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదని అధికారులు వెల్లడించారు.ఘటన అనంతరం శనివారం ఉదయం భద్రతా బలగాలు విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టాయి. ఉగ్రవాదులు భారత భూభాగంలోకి చొరబడే ప్రయత్నం చేశారా అనే కోణంలో దర్యాప్తు కొనసాగుతోంది. సరిహద్దు ప్రాంతమంతా ప్రస్తుతం అత్యంత అప్రమత్త నిఘాలో ఉంచినట్లు అధికారులు తెలిపారు. భద్రతా విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం, పాకిస్థాన్‌లో నెలకొన్న అంతర్గత రాజకీయ, భద్రతా సంక్షోభాల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు ఎల్ఓసీ వెంట కాల్పులకు పాల్పడినట్లు భావిస్తున్నారు. ఆపరేషన్ సిందూర్‌ఖి అనంతరం ఎల్ఓసీ వద్ద చోటుచేసుకున్న తొలి ప్రధాన కాల్పుల విరమణ ఉల్లంఘన ఇదేనని అధికారులు పేర్కొన్నారు. ఇంతకుముందు ఎనిమిది నుంచి పది రౌండ్ల కాల్పులతో కూడిన చిన్నచిన్న ఘటనలు మాత్రమే నమోదయ్యాయి.



## సోషల్ మీడియా విషప్రచారంపై సాయి రూప్ ఆవేదన

### ఎన్టీర్ మా దైవం...ఆయన పేరుతోనే సేవా కార్యక్రమాలు

**తిరుపతిరూరల్,జూలై 18 ప్రభాతవార్త:** సోషల్ మీడియాలో తనపై జరుగుతున్న విషప్రచారంపై 'రా ఎన్‌టిఆర్' వ్యవస్థాపక ప్రతినిధి సాయిరూప్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. గత వారంరోజులుగా జరుగుతున్న ప్రచారం వల్ల మానసికంగా తీవ్ర కలత చెందినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో నందమూరి అభిమానులను వినయపూర్వకంగా క్షమించమని కోరారు. శనివారం తాజ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మేము చేపడుతున్న సేవా కార్యక్రమాలు పూర్తిగా సమాజహిత కోసమే...దాదాపు 10 సంవత్సరాల క్రితం జరిగిన ఒక ఆడియో వేడుకలో అభిమానులకు సేవా కార్యక్రమాలు చేయాలని ఇచ్చిన పిలుపే మాకు ప్రేరణగా మారిందన్నారు. మహానటుడు నందమూరి తారక రామారావు సేవా స్ఫూర్తే మా మార్గదర్శకం అని సాయిరూప్ అన్నారు. రా ఎన్‌టిఆర్ ఆధ్వర్యంలో మూడు ప్రధాన కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు వివరించారు. 'సేవతో యువ జాగృతి-2500' యువతలో సేవాభావాన్ని పెంపొందించడంతో పాటు డ్రగ్స్‌కు వ్యతిరేకంగా అవగాహన కల్పించడమే లక్ష్యంగా కార్యక్రమాలు నిర్వహించను న్నట్లు తెలిపారు. 'మన ఊరు - మన బాధ్యత' గ్రామాల్లో సంవత్సరాలుగా పరిష్కారం కాని సమస్యలను గుర్తించి, పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని, రైతు సదస్సుల ద్వారా వ్యవసాయ రంగానికి దోహదం చేస్తామని చెప్పారు. 'ఊరి మాట - పాలకుల దాకా' ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం సాధించే వేదికగా ఈ కార్యక్రమం పని చేస్తుందని వెల్లడించారు. మొదటి దశలో ఎన్టీర్ జిల్లాలో ఈ సేవా కార్యక్రమాలను ప్రారంభించి, అనంతరం రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించనున్నట్లు తెలిపారు.

**ఎన్‌జిఓగా సేవలు ...సిఎస్ఆర్ లక్ష్యాలు:**

చట్టపరంగా నమోదు చేసిన ఎన్‌జిఓగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్‌బుల్టి నిధులతో దాదాపు రూ.100 కోట్ల విలువైన సేవా కార్యక్రమాలు చేపట్టే లక్ష్యంతో ఉన్నామని తెలిపారు. ప్రతి రుపాయి ఖర్చులో పారదర్శకత పాటిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాజేష్, పవన్‌రెడ్డి, కోర్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.




## క్వాంటం టెక్నాలజీపై ప్రత్యేక వర్క్‌షాప్

### పరిశోధనలకు కేంద్రంగా ఎస్వీయూను తీర్చిదిద్దే దిశగా చర్యలు: విసి ఆచార్య టాటా నరసింగరావు

**తిరుపతి విద్య, జూలై 18 ప్రభాతవార్త:** శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం సెనేట్ హాల్‌లో శనివారం క్వాంటం టెక్నాలజీస్‌పై ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహించారు. రూసా ఫేజ్2 ఆధ్వర్యంలోని యస్వీయూ-క్వాంటం ఆర్టిఫిషి యల్ ఇంటెలిజెన్స్ సెంటర్, ఆంధ్రప్రదేశ్ సైన్స్ సిటీ, అమరావతి క్వాంటం వ్యాలీ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాయి.వైస్ ఛాన్సలర్ ఆచార్య టాటా నరసింగరావు మాట్లాడుతూ, అమరావతి క్వాంటం వ్యాలీ దార్శనికతకు అనుగుణంగా యస్వీ యూను క్వాంటం టెక్నాలజీ పరిశోధనలకు ప్రధాన కేంద్రంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రాచీన భారతీయ జ్ఞానం నుంచి ఆధునిక క్వాంటం బిట్స్ వరకు విజ్ఞాన పరిణామాన్ని వివరిస్తూ విద్యార్థులు అత్యాధునిక సాంకేతికతలను అందిపుచ్చుకోవాలని సూచించారు. ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ ఆచార్య ఎస్. వరదరాజన్ మాట్లాడుతూ, క్వాంటం సైన్సెస్‌లో ప్రాథమిక పరిశోధనల కోసం ప్రత్యేక మౌలిక సదుపాయాలు అవసరమని పేర్కొన్నారు.

తిరుపతి విద్యా కేంద్రంలోని వేలాది మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూరేలా ఆంధ్రప్రదేశ్ సైన్స్ సిటీ, అమరావతి క్వాంటం వ్యాలీ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్ సైన్స్ సిటీ సీఈఓ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు స్పేస్ టెక్నాలజీ, రాకెట్రీ, ఎస్‌టీఈఎం విద్య, కృత్రిమ మేధస్సు, రోబోటిక్స్ వంటి ఆధునిక సాంకేతిక రంగాలను పరిచయం చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు ఇంటర్న్‌షిప్‌లకు దరఖాస్తు చేసుకోవడంతో పాటు భారతదేశపు ఫోర్‌క్విబిట్ క్వాంటం వ్యవస్థను ప్రత్యక్షంగా వీక్షించేందుకు అమరావతి క్వాంటం వ్యాలీని సందర్శించాలని సూచించారు. అమరావతి క్వాంటం వ్యాలీ సలహాదారు డాక్టర్ వెంకటస్వామి కీలకోపన్యాసం చేస్తూ, పురాణ గాథల ఉదాహరణలతో సూపర్ పొజిషన్, ఇంటర్‌ఫియరెన్స్, ఎంటాంగిల్‌మెంట్, క్వాంటం టన్నెలింగ్, డబుల్‌స్లిట్ ప్రయోగం వంటి క్లిష్టమైన క్వాంటం భావనలను సరళంగా వివరించారు. జాతీయ క్వాంటం మిషన్ ద్వారా ప్రపంచ క్వాంటం రంగంలో భారత్ అగ్రగామిగా ఎదగాలని లక్ష్యంగా పెట్టుకుందని, అందుకు యువత పరిశోధనలపై దృష్టి సారించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు, రూసా కోఆర్డినేటర్ ఆచార్య కె.వి. సుచరితతో పాటు సైన్స్, ఇంజినీరింగ్, ఎంసీఏ విభాగాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# విద్యుత్ శాఖలో నకిలీల కలకలం

## విచారణ వేగవంతం చేసిన ఎస్పీడిసిఎల్

## ఆంధ్రలో ఇప్పటికే 69 మంది తొలగింపు

**హైదరాబాద్, జులై 18, ప్రభాతవార్త:** విద్యుత్ శాఖలో నకిలీ సర్టిఫికెట్లు కలకలం సృష్టిస్తున్నాయి. నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు పొందిన ఆరోపణలపై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టిజిఎస్పీడీసీఎల్) సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ (ఏపిఎస్పీడీసీఎల్) విచారణను ముమ్మరం చేశాయి. ఏపీలో ఇప్పటికే నకిలీ ఐటీఐ సర్టిఫికెట్లు సమర్పించి విధుల్లో చేరిన 69 మంది షిఫ్ట్ ఆపరేటర్లను గుర్తించి ఇటీవల కాలంలో తొలగించారు. ఈ ఉద్యోగులు అసలు ఐటీఐ చదవకుండానే దొంగ సర్టిఫికెట్లు ఇచ్చి షిఫ్ట్ ఆపరేటర్లుగా చేరినట్లు తేలింది. ఉద్యోగుల పూర్వాపరాలను పరిశీలించేందుకు ఏపి ఎస్‌పీడీసీఎల్ యాజమాన్యం కీలక ఆదేశాలు జారీ చేసింది. సిబ్బంది అంతా మీసేవ ద్వారా పోలీస్ ఎన్ఓసీ సమర్పించాలని, క్రిమినల్ రికార్డులు ఉంటే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించింది. తెలంగాణలోనూ అలాంటి మోసాలు జరిగాయన్న అనుమానాలతో అధికారులు సర్టిఫికెట్ల పరిశీలనకు ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేశారు. తెలంగాణలో సైతం ఫేక్ సర్టిఫికెట్లతో కొందరు ఉద్యోగం పొందారన్న సమాచారంతో దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ అప్రమత్తమైంది. అనుమానిత సర్టిఫికెట్లపై సర్కిల్ స్థాయి పరిశీలన కమిటీలను ఏర్పాటు చేసి లోతుగా దర్యాప్తు చేస్తోంది. ఇందుకుగాను సర్కిల్ స్థాయిలో ఐదు గురు సభ్యులతో కమిటీలు వేసింది. ఈ కమిటీలో డీఈ చైర్మన్‌గా, ఎస్ఏఓ, డీఈ (డీపీఈ), ఏపీటీఎస్పీ, కార్పొరేట్ ఆఫీస్ నుంచి అసిస్టెంట్ సెక్రటరీని సభ్యులుగా ఉండేలా చర్యలు తీసుకున్నారు. ఈ కమిటీ అన్ని విభాగాల్లో అధికారులు, సిబ్బంది అందజేసిన సర్టిఫికెట్లను మరోసారి పరిశీలించనుంది. కొంతమంది సిబ్బంది పదోన్నతులతో పాటు ఎక్కువకాలం సర్వీసులో కొనసాగేందుకు బర్త్ సర్టిఫికెట్లలో మార్పులు చేశారనే విమర్శలున్నాయి. శివారు సర్కిళ్లలో కొంతమంది నకిలీ ఐటీఐ సర్టిఫికెట్లతో జేఎల్ఎం లుగా, ఓ అండ్ ఎం సిబ్బంది డిప్లమా సర్టిఫికెట్లతో సబ్‌ఇంజినీర్లుగా, కొంతమంది సబ్ ఇంజనీర్లు ఏఈలుగా పదోన్నతులు పొందేందుకు నకిలీ సర్టిఫికెట్లు పెట్టారనే ఆరోపణలున్నాయి.

## కెసిఆర్ పాలనలో నిరుద్యోగులకు పాతర

### తెలంగాణ సిఎం రేవంత్‌రెడ్డి పాలనలో కొలువుల జాతర

### ప్రభుత్వ విప్ బల్మూర్ వెంకట్

**హైదరాబాద్, జులై 18, ప్రభాతవార్త:** నిరుద్యోగుల గురించి మాట్లాడే హక్కు బిఆర్ ఎస్ నేతలకు లేదనీ గత పదేళ్ల రాక్షస పాలనలో, నిరుద్యోగుల ఉసురుపోసుకున్నది మీరేననీ ప్రభుత్వ విప్ బల్మూరి వెంకట్ అన్నారు. గాంధీభవన్‌లో విలేఖరులతో మాట్లాడుతూ మీ హయంలో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమీషన్ నిర్వహించిన 16 పరీక్షా పేపర్లు లీక్ అయ్యాయనీ ఆరోపించారు. ఆత్మహత్యలు చేసుకున్న నిరు ద్యోగుల కుటుంబాలను మీరు ఏనాడు పరామర్శించ లేదు, పట్టించు కోలేదనీ ఆవేదన చెందారు. రాజకీయ స్వార్థం కోసం, ఇవాళ నిరుద్యోగులపై బిఆర్ఎస్ నేతలు కపట ప్రేమ చూపిస్తున్నారనీ ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రజా ప్రభుత్వం నిరుద్యోగుల విషయంలో సానుకూలంగా ఉంది.ఇప్పటికే 80వేల ఉద్యోగాలు భర్తీ చేసింది, మరో 30 వేల ఉద్యో గాల నియామక ప్రక్రియ వివిధ దశల్లో ఉందనీ వివరించారు. నేను ప్రభుత్వానికి, నిరుద్యోగుల మధ్య వారధిగా ఉంటాను.మీ ప్రతీ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా అన్నారు.దయచేసి నిరుద్యోగులు బిఆర్ఎస్ ట్రాప్ లో పడొద్దు అని కోరారు.నేను కూడా మీతో ఉద్యమాలు చేసిన వ్యక్తినే, గతంలో నిరుద్యోగులు, కలుస్తామంటే కూడా అపాయింట్‌మెంట్ ఇవ్వని బిఆర్ఎస్ నేతలు, ఇవాళ అధికారం పోగానే, నిరుద్యోగుల పంచానా చేరారనీ ఎద్దేవా చేశారు.

# అర్ధరాత్రి మహిళ నగ్నంగా వీధుల్లో పరుగులు

## పీర్జాదిగూడలో కలకలం

## చెరువులో మృతదేహం లభ్యం

**హైదరాబాద్ (ఉప్పల్), జులై 18, ప్రభాతవార్త :** నగర శివారులోని బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని పీర్జాదిగూడ శంకర్‌నగర్‌లో ఒక యువతి అనుమానాస్పద మృతి స్థానికంగా తీవ్ర కలకలం సృష్టించింది. అర్ధరాత్రి నగ్నంగా వీధుల్లో పరుగులు తీసిన ఆ యువతి, అనంతరం సమీపం లోని ఆలయం నుంచి విగ్రహాన్ని తీసుకెళ్లి కొద్దిసేపటికే పక్కనే ఉన్న పీర్జాదిగూడ చెరువులో శవంగా బయటపడింది. ఆమె మృతదేహం చెరువులో లభించడం పలు అనుమానాలకు తావిస్తోంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఇలా ఉన్నాయి. విజయనగరం జిల్లా, గజిత్‌నగర్ మండలం, దేవులపల్లి గ్రామానికి చెందిన వక్కలగడ్డ తేజస్విని (27), తన తల్లి అరుణ (52)తో కలిసి పీర్జాదిగూడ శంకర్ నగర్‌లో అద్దె ఇంట్లో నివాసం ఉంటుంది. తేజస్విని తండ్రి వక్కలగడ్డ ఈశ్వరరావు (55) విశాఖ స్టీల్ ప్లాంట్‌లో ఉద్యోగిగా పనిచేస్తున్నారు. తేజస్విని గతంలో బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేసి ప్రస్తుతం తల్లి వద్దే ఉంటున్నది. కాగా తల్లి, కూతుళ్లు కొంతకాలంగా ప్రత్యేక యాప్ ద్వారా అద్దె ఇళ్లలో నివసిస్తున్నట్లు తెలుస్తోంది. మొదట కాప్రా చెరువు సమీపంలో నివసించి, అనంతరం పీర్జాదిగూడ శంకర్‌నగర్‌కు మారినట్లు పోలీసులు తెలిపారు.

కాగా శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత, శనివారం తెల్లవారుజామున సుమారు 2:30 గంటల సమయంలో తేజస్విని తన తల్లిని ఇంట్లో ఉంచి, బయట నుంచి తాళంవేసి నగ్నంగా వీధుల్లో పరుగులు తీసినట్లు పోలీసులు పేర్కొంటున్నారు. అనంతరం సమీపంలోని ఓ ఆలయానికి వెళ్లి అక్కడి అమ్మవారి విగ్రహాన్ని, చీరను తీసుకుని వెళ్లినట్లు తెలిపారు. ఈ దృశ్యాలు సమీపంలోని సీసీటీవీ కెమెరాల్లో రికార్డయ్యాయి. అనంతరం కొద్దిసేపటికే పక్కనే ఉన్న పీర్జాదిగూడ చెరువులో తేజస్విని మృతదేహం తేలియాడుతూ కనిపించడంతో స్థానికులు మేడిపల్లి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. చెరువులో పడేసినట్లు భావిస్తున్న ఆలయ విగ్రహం కోసం డిఆర్ఎఫ్ బృందాల సహాయంతో పోలీసులు ముమ్మర గాలింపు చర్యలు చేపట్టారు. అనంతరం విగ్రహాన్ని స్వాధీనం చేసుకున్నారు.

**రక్తంతో పీడకలలు వస్తున్నాయని..**

ఒక సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అకస్మాత్తుగా మానసిక సమస్యలతో బలవన్మరణం చెందడంతో స్థానికులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. కాగా తేజస్విని మానసిక రోగంతో బాధపడుతున్నదని, తల్లి, తండ్రి విడివిడిగా ఉంటున్నారని, అనారోగ్యంతోనే ఆత్మహత్య చేసుకుందని సిఐ జలంధర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు మేడిపల్లి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ముద్రగడ పద్మనాభం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బలిజ సంఘం నేతలు.

## రాయలసీమ బలిజలకు ఎమ్మెల్సీ ఇవ్వాలి!

రేణిగుంట,జులై 17 ప్రభాతవార్త: రాయలసీమ జిల్లాల్లోని బలిజలకు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలని జాతీయ కాపు సంఘం కమిటీ జాతీయ ప్రచార కార్యదర్శి గోపి రాయల్ డిమాండ్ చేశారు. రేణిగుంట పట్టణంలో శనివారం ఇటీవల మృతి చెందిన కాపు ఉద్యమ నేత మాజీమంత్రి ముద్రగడ పద్మనాభం చిత్రపటానికి పూలమాలలు వేసి బలిజ సంఘం నేతలు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా గోపి రాయల్ మాట్లాడుతూ ముద్రగడ పద్మనాభం బలిజలకు చేసిన సేవలను కొనియాడారు. ముద్రగడ మృతి బలిజ కాపు కులాలకు తీరనిలోటు అని ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలో పదవీకాలం పూర్తవుతున్న గవర్నర్ కోటాలోని రెండు ఎమ్మెల్సీ స్థానాలలో రాయలసీమలోని బలిజలకు ఒక ఒక స్థానానికి నామినేట్ చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. రాయలసీమలో 52 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా బలిజలకు ఒక్క తిరుపతి అసెంబ్లీ స్థానాన్ని కేటాయించారని ఆవేదన వ్యక్తం చేశారు. బలిజలకు న్యాయం జరగాలంటే కనీసం గవర్నర్ కోటలోని ఎమ్మెల్సీ అయినా కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బలిజ సంఘం నాయకులు త్యాగరాజులు, శ్రీనివాసులు, బసవ పున్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

## కీలక పోస్టుల్లో తెలంగాణ కేడర్ అధికారులు

**హైదరాబాద్, జులై 18, ప్రభాతవార్త:** కేంద్ర సిబ్బంది నియామక పథకం కింద కీలక నియామకాలకు కేంద్రం ఆమోదం తెలిపింది. ఇందులో భాగంగా తెలంగాణ కేడర్‌కు చెందిన ఐఎఎస్ అధికారి ప్రశాంత్ జీవన్ పాటిల్, ఐఆర్ఎఎస్ అధికారి ఇషాన్ శర్మలను కేంద్ర మంత్రిత్వ శాఖలకు నియమించినట్లు కేంద్ర సిబ్బంది, శిక్షణ శాఖ (డిపిటి) జారీ చేసిన రెండు వేర్వేరు ఉత్తర్వులలో పేర్కొంది. ఓడరేవులు, నౌకాయా నం, జలమార్గాల మంత్రిత్వ శాఖ పరిధిలోని ముంబైలోని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ షిప్పింగ్‌లో డైరెక్టర్ స్థాయి డిప్యూటీ డైరెక్టర్ జనరల్‌గా పాటిల్ నియామకాన్ని సమర్థ అధికారి ఆమో దించినట్లు సిబ్బంది, శిక్షణ శాఖ ఒక ఉత్తర్వులో తెలిపింది.

# లార్డ్స్‌లో లాస్ట్ ఫైట్.. సిరీస్ ఎవరిది?



## రోహిత్‌పై అందరి దృష్టి *నేడు భారత్, ఇంగ్లాండ్ మూడో వన్డే

**లార్డ్స్, జులై 18:** మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా భారత్, ఇంగ్లాండ్ మధ్య మూడో, నిర్ణయాత్మక వన్డే నేడు క్రికెట్ పుట్టినిల్లు లార్డ్స్‌లో జరగనుంది. ఎడ్జ్‌బాస్టన్ వేదికగా జరిగిన తొలి వన్డేలో గిల్ సేన నెగ్గగా, కార్డిఫ్‌లో జరిగిన రెండో వన్డేలో బ్రూక్స్ సేన గెలుపొందింది. చెరో మ్యాచ్ గెలిసి సమవుజ్జీగా ఉన్నాయి. టీ20 సిరీస్ చేజార్చుకున్న టీమిండియా.. వన్డే సిరీస్‌నైనా చేజిక్కించుకోవాలనే పట్టుదలతో ఉంది. ఈ మ్యాచ్ నేపథ్యంలో అందరి కళ్లూ భారత స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మపైనే. కారణం లార్డ్స్ వన్డే రోహిత్‌కు చివరిదని.. తర్వాత రిటైర్మెంట్ ప్రకటిస్తాడనే ప్రచారం జోరుగా జరగడమే. దీనిని బీసీసీఐ ఖండించినా.. మ్యాచ్ ముగిశాక ఏదైనా సంచలన ప్రకటన రావొచ్చొన్న అంచనాతో లార్డ్స్ వన్డేకు క్రేజ్ మరింత పెరిగింది. గత రెండు మ్యాచ్‌ల్లో 11, 26 స్కోర్లకే వెనుదిరిగి నిరాశపరిచిన హిట్‌మ్యాన్.. బ్యాటింగ్‌కు అనుకూలించే లార్డ్స్ పిచ్‌పై చెలరేగి భారత్‌కు విజయాన్ని అందించాలని ఫ్యాన్స్ కోరుకుంటున్నారు.

టీమిండియా బ్యాటింగ్‌ను మరింత పటిష్టం చేసే దిశగా రాహుల్‌ను తుది జట్టులో ఆడించే అవకాశం ఉంది. ఇక కెప్టెన్ శుభ్‌మన్ గిల్ పరుగుల వేటలో ఉండడం, విరాట్‌కోహ్లీ గత మ్యాచ్‌లో బ్యాటింగ్ గాడిలో పడడం భారత్‌కు అనుకూలించే అంశం. మిడిల్ ఆర్డర్‌లో శ్రేయస్ అయ్యర్ నిలకడగా రాణిస్తున్నాడు. ఇషాన్ కిషన్ బ్యాట్‌కు పనిచెప్పాల్సిన పరిస్థితి నెలకొంది. వాషింగ్టన్ సుందర్ గాయంతో కుల్‌దీప్‌కు తుది జట్టులో చోటు దక్కొచ్చు. ఇక జస్‌ప్రీత్ బుమ్రా నేతృత్వంలోని బౌలింగ్ డిపార్ట్‌మెంట్ చక్కగా ఇంగ్లాండ్‌ను కట్టడి చేస్తూ ఆకట్టుకుంటోంది. బుమ్రా, ప్రసిద్ధ్‌కృష్ణలతో పేస్ అటాక్‌కు అక్షర్ స్పిన్‌తో తోడుగా నిలుస్తున్నాడు.

ఇక ఇంగ్లాండ్ గత మ్యాచ్‌లో గెలిచి జోరు మీద ఉంది. నిలకడగా రాణిస్తున్న జో రూట్ ఆ జట్టుకు ప్రధాన బలంగా మారాడు. ఇక బెన్ డకెట్ ఫామ్ ఆందోళనపరుస్తున్నా.. జాకబ్ బెతెల్, జాస్ బట్లర్, కెప్టెన్ హారీ బ్రూక్‌లతో కూడిన బ్యాటింగ్... సొంతగడ్డపై చెలరేగడానికి చూస్తోంది. జోఫ్రా ఆర్చర్, జోష్ టాంగ్, సామ్ కుర్రాన్ పేస్ త్రయానికి అండగా అదిల్ రషీద్, డాసన్ నిలుస్తున్నారు.

లార్డ్స్ పిచ్ సాధారణంగా బ్యాటింగ్‌కు అనుకూలంగా కనిపించినా, తొలి గంటలో పేసర్లుకు ఇక్కడ చక్కని స్వింగ్ లభిస్తుంది. ఆ తర్వాత బ్యాటింగ్ సులభమవుతుంది. టాస్ కూడా కీలకంగా మారనుంది. టాస్ నెగ్గిన జట్టు ముందుగా బౌలింగ్ ఎంచుకునే అవకాశాలున్నాయి.

# జపాన్ ఓపెన్ టైటిల్ దిశగా సింధు

## గాయంతో చెన్ రిటైర్డ్ * రెండేళ్ల తర్వాత తొలిసారి




**టోక్యో, జులై 18:** రెండుసార్లు ఒలింపిక్ మెడలిస్ట్, భారత స్టార్ షట్లర్ పీవీ సింధూ చరిత్ర సృష్టించింది. జపాన్ ఓపెన్ సూపర్ 750 టోర్నీలో ఫైనల్ చేరిన తొలి భారత మహిళా షట్లర్‌గా రికార్డు నమోదు చేసింది. క్వార్టర్ ఫైనల్లో ప్రత్యర్థి నుంచి వాకోవర్ లభించిన సింధూ.. సెమీఫైనల్లో ప్రపంచ నాలుగో ర్యాంకర్ చెన్ యుఫేయ్(చైనా)తో తలపడింది. సింధూ21-19, 15-10తో ఆధిక్యంలో ఉన్న దశలో చైనా షట్లర్ గాయంతో గేమ్ మధ్యలోనే వైదొలిగింది. దీంతో సింధూ ఫైనల్లో అడుగుపెట్టింది. రెండేళ్ల తర్వాత ఫైనల్ చేరడం సింధూకు ఇదే తొలిసారి. 2024లో సయ్యద్ మోదీ ఇంటర్నేషనల్ టోర్నీలో సింధూ ఫైనల్ చేరి టైటిల్ సాధించింది. ఫైనల్లో జపాన్ ప్లేయర్ అకనె యమగుచితో తలపడనుంది. రెండో సెమీఫైనల్లో యమగుచి... 9-21, 21-16, 21-14తో పుత్రి కుసుమ వర్దానిపై చెమటోడ్చి నెగ్గింది.

31 ఏళ్ల సింధూ.. చైనాకు చెందిన టోక్యో ఒలింపిక్స్ విజేత చెన్ యుఫేపై ఆరంభం నుంచే ఆధిక్యం చాటింది. పదునైన నెట్ ప్లేతో చైనీస్ క్రీడాకారిణిపై ర్యాలీలతో శాసించింది. అద్భుతమైన డ్రాప్ షాట్, ఆ వెంటనే బలమైన స్మాష్‌తో సింధూ 11-7తో ఆధిక్యాన్ని సాధించింది. చెన్ తిరిగి గాడిలో పడి స్మాష్‌లతో విరుచుకుపడి సింధూ ఆధిక్యాన్ని 15-17కు తగ్గించింది. ఈ దశలో చెన్ కొట్టిన కొన్ని స్మాష్‌లు నెట్‌కు తగలగా, మరోవైపు సింధూ రెండు శక్తివంతమైన స్మాష్‌లతో తొలి గేమ్‌ను 21-19తో నెగ్గి శుభారంభం చేసింది.

రెండో గేమ్‌లో పీవీ సింధూ 3-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లగా... చెన్ పుంజుకుని 3-4కు తగ్గించింది. సింధూ క్రాస్ కోర్ట్ స్మాష్‌తో 15-10తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. ఈ దశలో చెన్ తొండకండరాలు పట్టేయడంతో బాగా ఇబ్బంది పడింది. చివరకు గేమ్ మధ్యలోనే చెన్ రిటైర్ కావడంతో సింధూ ఫైనల్లో ప్రవేశించింది. ఆదివారం టైటిల్ పోరు జరగనుంది. ఇందులోనూ గెలిస్తే జపాన్ ఓపెన్‌ను సొంతం చేసుకున్న తొలి భారత మహిళా షట్లర్‌గా పీవీ సింధూ అవతరిస్తుంది.

## ఒక్కో టికెట్ 27 లక్షలు
## ప్రీమియం టికెట్ 1.6 కోట్లు

**న్యూయార్క్, జులై 18:** సాకర్ వరల్డ్ కప్ ఫైనల్‌పై అంచనాలు పెరగడంతో టికెట్లకు భారీ డిమాండ్ నెలకొంది. 39 ఏళ్ల మెస్సీ, 18 ఏళ్ల లామిన్ యామల్ ఆటను ప్రత్యక్షంగా చూసేందుకు ఫుట్‌బాల్ ఫ్యాన్స్ పోటీపడుతుండడంతో టికెట్స్ హైప్ తరువాతి స్థాయికి చేరింది. టికెట్ ధరలు ఆల్‌టైమ్ రికార్డులను బద్దలు కొడుతున్నాయి. మెట్‌లైఫ్ స్టేడియంలో సీటు సంపాదించుకోవడానికి ఎంత ఖర్చైనా సాకర్ లవర్స్ పెట్టేందుకు వెనకాడటం లేదు.

ఫైనల్ మ్యాచ్ ఒక్కో టికెట్ ధర దాదాపు 27 లక్షలు పలుకుతోంది. స్టేడియానికి అత్యంత దగ్గరగా ఉండే వీఐపీ, ప్రీమియం సీట్ల ధరలు ఏకంగా 1.6 కోట్లుగా ఉన్నాయి. 2022 ఖతార్ వరల్డ్ కప్ ఫైనల్లోను టికెట్ల రేట్ల పరంగా ఈ వరల్డ్ కప్ రికార్డులు బద్దలు కొట్టింది. ఫిఫా అధికారికంగా నిర్ణయించిన అసలు ధరలే సీటింగ్ కేటగిరీని బట్టి 2,030 నుంచి 6,730 డాలర్ల వరకు ఉన్నాయి. అర్జెంటీనా స్టార్ ఆటగాడు లియోనెల్ మెస్సీకి ఇది చివరి అంతర్జాతీయ మ్యాచ్ కావడం కూడా టికెట్ల ధరలకు రెక్క లొచ్చాయి. టికెట్లు హాట్ కేకుల్లా అమ్ముడవడంతో ఫైనల్ మ్యాచ్‌కు మెట్‌లైఫ్ స్టేడియం హౌస్‌ఫుల్ కావడం ఖాయం.

# కప్ కోసం దిగ్గజాల పోరు

*ఫీఫా ప్రపంచకప్ తుది సమరానికి చేరుకుంది. కొత్త ఛాంపియన్ ఎవరో కొన్ని గంటల్లోనే తేలిపోనుంది.న్యూయార్క్‌లోని న్యూజెర్సీ వేదికగా డిఫెండింగ్ ఛాంపియన్ అర్జెంటీనా, యూరో పియన్ ఛాంపియన్ స్పెయిన్ తుది పోరుకు సిద్ధమయ్యాయి. గ్రూప్‌లో అగ్రస్థానంతో పాటు రౌండ్ 32లో కాబో వెర్డేను, ప్రికార్వర్స్‌లో ఈజిప్ట్‌ను, క్వార్టర్ ఫైనల్లో స్విట్జర్లాండ్‌ను, సెమీ ఫైనల్లో ఇంగ్లాండ్‌ను ఓడించి అర్జెంటీనా ఫైనల్‌కు వచ్చింది. ఇక స్పెయిన్ గ్రూప్ స్టేజ్‌లో సౌదీ అరేబియా, ఉరుగ్వేలపై, రౌండ్ 32లో ఆస్ట్రియాపై, ప్రి క్వార్టర్స్‌లో పోర్చుగల్‌పై, క్వార్టర్ ఫైనల్లో బెల్జియంపై, సెమీఫైనల్లో ఫ్రాన్స్‌పై నెగ్గి తుది సమరానికి చేరుకుంది. ఫైనల్ మ్యాచ్ మెస్సీ అనుభవమా? యమాల్ యువ తుఫానా? అన్నట్లుగా ఆసక్తి రేపు తోంది. కోట్లాది అభిమానుల దృష్టంతా ఇపుడు ఈ ఒక్క మ్యాచ్‌పైనే నిలిచింది.*




# అర్జెంటీనా, స్పెయిన్ సై

* మెస్సీ మ్యాజికా? యమాల్ యువ జోషా?
* అందరూ స్టార్లే, సమష్టితత్వమే స్పెయిన్ బలం
* నేటి అర్ధరాత్రి 12.30 గంటలకు మ్యాచ్

**న్యూయార్క్, జులై 18:** డిఫెండింగ్ ఛాంపియన్ అర్జెంటీనా, యూరోపియన్ దిగ్గజం స్పెయిన్ ప్రపంచకప్ ఫైనల్లో తలపడనున్నాయి. అనుభవం, ప్రతిభ, వ్యూహాలు, స్టార్ ఆటగాళ్లు... అన్నీ ఒకే వేదికపై ఢీకొట్టనున్న ఈ పోరు ఫుట్‌బాల్ చరిత్రలో మరో చిరస్మరణీయ అధ్యాయంగా నిలిచే అవకాశముంది. పెద్ద మ్యాచ్‌ల అనుభవం అర్జెంటీనా ప్రధాన బలం. కౌంటర్ అటాక్‌లో అత్యంత ప్రమాదకర జట్టు. మిడ్‌ఫీల్డ్‌లో బంతిపై నియంత్రణతో పాటు వేగవంతమైన మార్పులు తీసుకురాగలదు. గోల్‌కీపర్ ఎమిలియానో మార్టినెజ్ పెనాల్టీలు, కీలక సేవ్‌లలో ప్రత్యేక నైపుణ్యం కలవాడు. లియోనెల్ మెస్సీ, జులియస్ ఆల్వారెజ్, అలెక్సిస్ మాక్ అలిస్టర్ అర్జెంటానా గెలుపులో కీలకపాత్ర పోషిస్తున్నారు. అయితే స్పెయిన్ దుర్భేధ్యమైన డిఫెన్స్‌ను అర్జెంటీనా ఎంతవరకు ఛేధిస్తుందనడంపైనే ఆ జట్టు విజయావకాశాలుంటాయి. చివరి నిమిషాల్లో గోల్స్ మ్యాజిక్ చేస్తున్న అర్జెంటీనా తుదిపోరులోనే హాట్ ఫేవరెట్‌గానే బరిలోకి దిగుతోంది. వరుసగా రెండోసారి కప్ అందుకోవడంపై ఫోకస్ పెట్టింది. ఇది సాధిస్తే బ్రెజిల్ సరసన నిలుస్తుంది.

**అభేద్యమైన డిఫెన్స్‌తో స్పెయిన్ సవాల్**

యూరోపియన్ దిగ్గజం స్పెయిన్‌ను తక్కువ అంచనా వేయలేం. మెస్సీ చుట్టూ అర్జెంటీనా, ఎంబాపె చుట్టూ ఫ్రాన్స్, రొనాల్డో చుట్టూ పోర్చుగల్‌లా కాకుండా సమిష్టితత్వమే స్పెయిన్ బలం. ఆ జట్టులో ప్రతి ఒక్కరూ స్టారే. ఎవరు ఏపాత్ర పోషించాలనేది ముందే నిర్ణయమౌతుంది. అందుకు తగ్గట్లుగానే మైదానంలో దూసుకుపోతారు. లామెనె యమాల్ బంతిని పాస్ చేయడంతో పాటు గోల్‌పోస్ట్ వైపు తీసుకెళ్లడంలో నేర్పరి. గావి, మెరినో, ఓల్మో, నికో, మునోజ్ లాంటి ప్రతిభావంతుల బలం స్పెయిన్ సొంతం. స్పెయిన్ ప్రధాన బలం బంతిని ఎక్కువసేపు తమ ఆధీనంలో ఉంచే ఆటతీరు. వేగవంతమైన వింగ్ దాడులు, కచ్చితమైన పాస్‌లు.యువ ఆటగాళ్ల ఉత్సాహం, జట్టు సమన్వయం అద్భుతం. నిరంతర పాస్‌లతో ప్రత్యర్థిని ఉక్కిరిబిక్కిరి చేస్తుంది.

సాకర్ వరల్డ్ కప్ తొలి మ్యాచ్‌ను కాబో వెర్డేతో డ్రా చేసుకున్నా...ఆ వెంటనే లోపాల నుంచి పాఠాలు నేర్చుకుంది. ఆ తర్వాత నుంచి విజయాలతో దూసుకు వచ్చింది. స్పెయిన్ అభేద్యమైన డిఫెన్స్‌ను తట్టుకుని కేవలం ఒక్క గోల్‌ను మాత్రమే ప్రత్యర్థులు చేయగలిగారు. ఫైనల్‌కు వచ్చిన తొలిసారే ఫిఫా కప్ అందుకున్న స్పెయిన్.. రెండోసారి ఫైనల్‌కు వచ్చింది. ఈ సారి కూడా కప్ అందుకోవడంపై ఫోకస్ పెట్టింది.

## కామన్ వెల్త్ క్రీడల ఫ్లాగ్ బేరర్స్‌గా
## మీరాచాను, లవ్లీనా

**న్యూఢిల్లీ, జులై 18:** భారత దిగ్గజ వెయిట్ లిఫ్టర్ మీరాబాయి చాను, మహిళా బాక్సర్ లవ్లీనా బోర్గోహైన్‌కు అరుదైన గౌరవం దక్కింది. గ్లాస్కో కామన్వెల్త్ క్రీడల ప్రారంభోత్సవంలో వీరిద్దరూ భారత ఫ్లాగ్ బేరర్స్‌గా ఎంపికయ్యారు. భారత ఒలింపిక్ సంఘం ఈ విషయాన్ని వెల్లడించింది.

స్కాట్లాండ్లోని గ్లాస్కోలో కామన్వెల్త్ క్రీడలు ఈ నెల 23 నుంచి ప్రారంభమవుతాయి. అగస్టు2 వరకు జరుగుతాయి. భారత్ నుంచి మొత్తం 124 మంది అథ్లెట్లు 13 క్రీడాంశాల్లో బరిలోకి దిగుతున్నారు. ప్రారంభ వేడుకల్లో భారత బృందానికి మీరాబాయి, లవ్లీనా నాయకత్వం వహిస్తారు. జాతీయ జెండా చేత బూని భారత బృందాన్ని నడిపించనున్నారు. మీరాబాను, లవ్లీనా భారత క్రీడ రంగానికి చేసిన అద్భుతమైన సేవలకు గుర్తింపుగా వారిని ఎంపికచేసినట్లు భారత ఒలింపిక్ సంఘం అధ్యక్షురాలు పిటి ఉష చెప్పారు. వారిద్దరూ అంతర్జాతీయ వేదికపై ఎన్నోసార్లు తమను తాము నిరూపించుకున్నారన్నారు. ప్రస్తుతం ఇంగ్లాండ్‌లో కామన్వెల్ క్రీడల కోసం శిక్షణ పొందుతున్నారు.





## రూ.67,515.7 కోట్ల డాలర్లకు పెరిగిన...
# ఆర్బీఐ ఫారెక్స్ ఖజానా

**న్యూఢిల్లీ,జులై 18:** భారత విదేశీ మారక నిల్వలు జులై 10తో ముగిసిన వారంలో 96.4 కోట్ల డాలర్లు పెరిగి 67,515.7 కోట్ల డాలర్లకు చేరినట్లు భారతీయ రిజర్వ్ బ్యాంక్ వెల్లడించింది. అంతకుముందు వారంలో దేశ విదేశీ మారక నిల్వలు 726 కోట్ల డాలర్లు పెరిగి 67,419.3 కోట్ల డాలర్లకు చేరాయి. ఈ ఏడాది ఫిబ్రవరి 27తో ముగిసిన వారంలో దేశ ఫారెక్స్ నిల్వలు 72,849.4 కోట్ల డాలర్లతో చరిత్రాత్మక గరిష్ఠ స్థాయికి చేరుకున్నాయి. అయితే అనంతరం పశ్చిమాసియా ఉద్రిక్తతలు ప్రారంభమవడంతో రూపాయిపై ఒత్తిడి పెరిగింది. రూపాయి మారక విలువను స్థిరంగా ఉంచేందుకు ఆర్‌బీఐ డాలర్లను విక్రయిస్తూ విదేశీ మారక మార్కెట్లో జోక్యం చేసుకోవాల్సి రావడంతో నిల్వలు వరుసగా కొన్ని వారాల పాటు తగ్గాయి.

జులై 10తో ముగిసిన వారంలో విదేశీ మారక నిల్వల్లో ప్రధాన భాగమైన విదేశీ కరెన్సీ ఆస్తులు 93 కోట్ల డాలర్లు పెరిగి 54,650.8 కోట్ల డాలర్లకు చేరాయి. డాలర్ విలువలో లెక్కించే ఈ విదేశీ కరెన్సీ ఆస్తుల్లో యూరో, బ్రిటిష్ పౌండ్, జపాన్ యెన్ వంటి అమెరికా డాలర్‌తర కరెన్సీల విలువల్లో వచ్చిన పెరుగుదల లేదా తగ్గుదల ప్రభావం కూడా ప్రతిబింబిస్తుందని ఆర్‌బీఐ తెలిపింది. దేశ బంగారం నిల్వల విలువ 2.4 కోట్ల డాలర్లు పెరిగి 10,522.3 కోట్ల డాలర్లకు చేరింది. అలాగే ప్రత్యేక డ్రాయింగ్ హక్కులు ఎస్డీఆర్‌లు 30 లక్షల డాలర్లు పెరిగి 1,862.6 కోట్ల డాలర్లకు చేరినట్లు ఆర్‌బీఐ పేర్కొంది. ఇక అంతర్జాతీయ ద్రవ్య నిధి ఐఎంఎఫ్ వద్ద భారత రిజర్వ్ పొజిషన్ కూడా 70 లక్షల డాలర్లు పెరిగి 479.3 కోట్ల డాలర్లకు చేరినట్లు ఆర్‌బీఐ గణాంకాలు వెల్లడించాయి.

# నికరలాభంలో 15.9% వృద్ధి




**ముంబయి,జులై 18:** దేశంలోని అతిపెద్ద ప్రైవేట్ రంగ బ్యాంకుల్లో ఒకటైన ఐసీఐసీఐ బ్యాంక్ బలమైన ఆర్థిక ఫలితాలను నమోదు చేసింది. నికర లాభం 15.9 శాతం పెరిగి రూ.14,804.50 కోట్లకు చేరుకుంది. పన్నులు మినహా ప్రొవిజన్లు మరియు ఇతర అత్యవసర నిధులు గత ఏడాది రూ.1,814.57 కోట్ల నుంచి రూ.1,260.45 కోట్లకు తగ్గాయి. అంటే వార్షిక ప్రాతిపదికన 30.5 శాతం తగ్గుదల నమోదైంది. గత త్రైమాసికంలో ఇవి కేవలం రూ.96.16 కోట్లు మాత్రమే ఉండటంతో, త్రైమాసిక ప్రాతిపదికన పెరిగాయి. నికర వడ్డీ ఆదాయం 12.7పెరుగుదల బ్యాంక్ నికర వడ్డీ ఆదాయం 12.7శాతం పెరిగి 24వేల 384 కోట్లకు చేరుకుంది. మొత్తం వడ్డీ ఆదాయం 8.1 శాతం పెరిగి రూ.45,670.78 కోట్లకు చేరగా, వడ్డీ వ్యయం రూ.21,286.43 కోట్లుగా నమోదైంది.

ఈ సందర్భంగా బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సందీప్ బాత్రా మాట్లాడుతూ, ఈ త్రైమాసికంలో ఆదాయపు పన్ను రిఫండ్‌లు రావడం వల్ల నెట్ ఇంటరెస్ట్ మార్జిన్ పెరిగిందన్నారు. టర్మ్ డిపాజిట్ల రీప్రైసింగ్, అధిక వడ్డీ రిఫండ్‌లు కూడా మార్జిన్‌కు మద్దతు ఇచ్చాయన్నారు. బ్యాంక్ మొత్తం ఆదాయం 5.4 శాతం పెరిగి రూ.54,246.84 కోట్లకు చేరుకుంది. ఇతర ఆదాయం 0.8 శాతం పెరిగి రూ.8,576.06 కోట్లుగా నమోదైంది. ట్రెజరీ కార్యకలాపాల ద్వారా బ్యాంక్ రూ.151 కోట్ల లాభం నమోదు చేసింది. గత త్రైమాసికంలో రూ.106 కోట్ల నష్టం ఉండగా, గత ఏడాది ఇదే కాలంలో రూ.1,241 కోట్ల లాభం వచ్చింది. ప్రొవిజన్లకు ముందు ఆపరేటింగ్ లాభం 8.8 శాతం పెరిగి రూ.20,386.07 కోట్లకు చేరుకుంది. 2026 జూన్ నాటికి బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తులు రూ.23,846.59 కోట్లుగా నమోదయ్యాయి. నికర నిరర్థక ఆస్తులు రూ.5,908.27 కోట్లకు తగ్గాయి.

# ఆర్‌బీఐ పాలిమర్ కరెన్సీ నోట్ల పైలట్‌కు సిద్ధం

## తొలి దశలో రూ.10, రూ.20 నోట్లు

**ముంబయి,జులై 18:** పాలిమర్ కరెన్సీ నోట్ల తొలి పైలట్ ప్రాజెక్ట్‌ను ఆర్బీఐ త్వరలోనే ప్రారంభించే కసరత్తులు చేపట్టింది. మొదటి దశలో రూ.10, రూ.20 విలువ కలిగిన పాలిమర్ నోట్లను ప్రయోగాత్మకంగా చలామణిలోకి తీసుకు రానున్నారు. ఈ పైలట్ విజయవంతమైతే, 2027 నుంచి దేశవ్యాప్తంగా దశలవారీగా పూర్తి స్థాయిలో పాలిమర్ నోట్లను విడుదల చేసే అవకాశముంది.

పాలిమర్ నోట్లు వచ్చిన తర్వాత ప్రస్తుతం వినియోగంలో ఉన్న కాగితపు కరెన్సీ నోట్లను ఉపసంహరించబోరని ఆర్‌బీఐ వర్గాలు స్పష్టం చేశాయి. పాలిమర్ నోట్లు, కాగితపు నోట్లు రెండూ ఒకేసారి చలామణిలో కొనసాగుతాయి. కొత్త నోట్లను దశలవారీగా ప్రవేశపెడుతూనే, ప్రస్తుతం ఉన్న కరెన్సీ కూడా చెల్లుబాటులోనే ఉంటుంది. ఈ ప్రక్రియలో భాగంగా ఆర్‌బీఐకి చెందిన నోట్ల ముద్రణ సంస్థ ఇటీవల పాలిమర్ నోట్ల తయారీలో ఉపయోగించే ప్రత్యేక పాలిమర్ సబ్‌స్ట్రేట్ షీట్ల తయారీ, సరఫరా కోసం అంతర్జాతీయ సంస్థల నుంచి ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంటరెస్ట్ బిడ్లను ఆహ్వానించింది. టెండర్ పత్రాల ప్రకారం, అధునాతన భద్రతా ఫీచర్లతో కూడిన పాలిమర్ సబ్‌స్ట్రేట్‌ను సరఫరా చేయాలని ప్రపంచవ్యాప్తంగా ఉన్న తయారీసంస్థలను ఆహ్వానించారు. దీంతో నకిలీ నోట్ల తయారీని మరింత సమర్థంగా అడ్డుకోవడంతో పాటు, కరెన్సీ నోట్ల భద్రతను పెంచడం లక్ష్యంగా



పెట్టుకున్నారు. టెండర్ల దాఖలుకు ఆగస్టు 18 చివరి తేదీగా నిర్ణయించారు. పాలిమర్ నోట్లు సాధారణ కాగితపు నోట్లతో పోలిస్తే ఎక్కువ కాలం మన్నికగా ఉంటాయి. తేమ, దుమ్ము, మురికి, చిరిగిపోవడం వంటి సమస్యలకు ఇవి అధిక నిరోధకతను కలిగి ఉంటాయి. అలాగే అత్యాధునిక భద్రతా లక్షణాలను వీటిలో అమర్చే అవకాశం ఉండటంతో నకిలీ చేయడం కూడా చాలా కష్టంగా మారుతుంది. ఇప్పటికే ఆస్ట్రేలియా, కెనడా, బ్రిటన్, న్యూజిలాండ్ వంటి అనేకదేశాలు పాలిమర్ కరెన్సీ నోట్లను విజయవంతంగా అమలు చేస్తున్నాయి. చలామణిలో ఉన్న కరెన్సీ నాణ్యతను మెరుగుపరచడం, నోట్ల ఆయుష్షను పెంచడం లక్ష్యంగా పాలిమర్ నోట్లను ప్రవేశపెట్టనున్నట్లు ఆర్‌బీఐ గతంలోనే ప్రకటించింది.


# 5.4శాతం పెరిగిన ఐడిబిఐ నికరలాభం




**ముంబయి,జులై 18:** ఐడీబీఐ బ్యాంక్‌కు తొలి త్రైమాసికంలో నికర లాభం వార్షిక ప్రాతిపదికన 5.4 శాతం పెరిగింది. శనివారం స్టాక్ ఎక్స్ఛేంజ్‌లకు సమర్పించిన ఆర్థిక ఫలితాల ప్రకారం బ్యాంక్ నికర లాభం రూ.2,007 కోట్ల నుంచి రూ.2,115 కోట్లకు చేరింది. బ్యాంక్ నికర వడ్డీ ఆదాయం 10.1 శాతం పెరిగి రూ.3,166 కోట్ల నుంచి రూ.3,486కోట్లకు పెరిగింది. మొత్తం వడ్డీ ఆదాయం 7.4 శాతం వృద్ధితో రూ.7,021 కోట్ల నుంచి రూ.7,541 కోట్లకు చేరింది. ఆస్తుల నాణ్యత పరంగా స్థూల నిరర్థక ఆస్తుల నిష్పత్తి గత త్రైమాసికంలోని 2.32 శాతం నుంచి 2.30 శాతానికి పెరిగాయి. నికర ఎన్‌పీఏ (నెట్ ఎన్‌పీఏ) 0.15 శాతం నుంచి 0.16 శాతానికి ఒక బేసిస్ పాయింట్ మేర పెరిగింది.

ప్రొవిజన్ కవరేజ్ రేషియో గత త్రైమాసికంలోని 99.39 శాతం నుంచి 99.31 శాతానికి స్వల్పంగా తగ్గింది. మరోవైపు నిర్వహణ లాభం 7.9శాతం క్షీణించి రూ.2,354 కోట్ల నుంచి రూ.2,168 కోట్లకు పడిపోయింది. నికరవడ్డీ మార్జిన్ 3.61 శాతానికి తగ్గింది. గత ఏడాది ఇదే కాలంలో ఇది 3.68 శాతంగా నమోదైంది. అలాగే కరెంట్ అకౌంట్‌సేవింగ్స్ అకౌంట్ నిష్పత్తి 44.59 శాతం నుంచి 43.64 శాతానికి తగ్గింది. ఇదిలా ఉండగా, ఎన్‌ఎస్‌ఈలో ఐడీబీఐ బ్యాంక్ షేరు 1.73 శాతం లాభంతో రూ.87.02 వద్ద ముగిసింది. అదే రోజు నిఫ్టీ సూచీ 1.09 శాతం మాత్రమే పెరిగింది. అయితే ఈ ఏడాది ప్రారంభం నుంచి ఇప్పటివరకు బ్యాంక్ షేరు ధర 15.51 శాతం తగ్గగా, గత 12 నెలల్లో 12.69 శాతం క్షీణించింది.

# హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ నికరలాభం 19వేల కోట్లు




**ముంబయి,జులై 18:** దేశంలోనే అతిపెద్ద ప్రైవేట్ రంగ బ్యాంక్ అయిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ నికర లాభం 5 శాతం పెరిగి రూ.19,059 కోట్లకు చేరింది. బ్యాంక్ నికరవడ్డీ ఆదాయం 6.7 శాతం పెరిగి రూ.33,534 కోట్లకు చేరింది. గత ఏడాది బ్యాంక్‌కు సంబంధించిన ప్రొవిజన్లు వార్షిక ప్రాతిపదికన భారీగా 78.8 శాతం తగ్గి రూ.3,060 కోట్లకు చేరాయి. ఆస్తుల నాణ్యత విషయంలో స్వల్ప ఒత్తిడి కనిపించింది. స్థూల నిరర్థక ఆస్తులు గత త్రైమాసికంలోని 1.15 శాతం నుంచి 1.17 శాతానికి పెరిగితే నికర నిరర్థక ఆస్తులు0.38 శాతం నుంచి 0.41 శాతానికి చేరింది. బ్యాంక్ ఆపరేటింగ్ ప్రాఫిట్ మాత్రం గణనీయంగా తగ్గింది. గత ఏడాది రూ.35,734 కోట్లుగా ఉన్న ఆపరేటింగ్ లాభం ఈసారి 21.2 శాతం తగ్గి రూ.28,168 కోట్లకు పరిమితమైంది. ఇక నెట్ ఇంటరెస్ట్ మార్జిన్ మొత్తం ఆస్తులపై 3.26 శాతంగా నమోదైంది. ఇది మార్కెట్ అంచనా అయిన 3.32 శాతం కంటే కొద్దిగా తక్కువ. వడ్డీ ఆర్జించే ఆస్తులపై 3.40 శాతంగా నమోదైంది. బ్యాంక్ సీఈఓ మాట్లాడుతూ గత నాలుగు నెలలుగా ఎదురైన సవాళ్లను బ్యాంక్ విజయవంతంగా అధిగమించిందన్నారు. క్లిష్ట పరిస్థితుల్లోనూ ఉద్యోగులు బ్యాంక్ వ్యాపారాన్ని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేశారని తెలిపారు. కొత్త ఛైర్మన్ నియామకంతో నాయకత్వ మార్పుపై ఉన్న అనిశ్చితికి తెరపడిందనిపేర్కొన్నారు. స్టాక్ మార్కెట్‌లో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేరు 1.40 శాతం పెరిగి రూ.819.60 వద్ద ముగిసింది. అదే రోజు నిఫ్టీ సూచీ 1.09శాతం లాభపడింది. ఈ ఏడాది ప్రారంభం నుంచి ఇప్పటివరకు హెచ్‌డీఎఫ్‌సీ షేరు 17.31శాతం క్షీణించగా, గత 12 నెలల్లో 58.75శాతం పతనమైంది.




## 26శాతం వృద్ధితో కోటక్ బ్యాంకు
# లాభాలు రూ.4,123 కోట్లు

**ముంబయి,జులై 18:** ప్రైవేట్ రంగానికి చెందిన కొటక్ మహీంద్రా బ్యాంక్ నికర లాభం వార్షిక ప్రాతిపదికన 26 శాతం పెరిగి రూ.4,123 కోట్లకు చేరింది. నికర వడ్డీ ఆదాయం గత ఏడాది రూ.7,260 కోట్ల నుంచి 9.2 శాతం పెరిగి రూ.7,928 కోట్లకు చేరింది. బ్యాంక్ నిర్వహణ లాభం కూడా బలంగా పెరిగింది. గత ఏడాది రూ.5,564 కోట్లుగా ఉన్న నిర్వహణ లాభం 10.2 శాతం వృద్ధితో రూ.6,131 కోట్లకు చేరింది.

ఆస్తుల నాణ్యత పరంగా కూడా బ్యాంక్ మంచి పనితీరును కనబరిచింది. స్థూల నిరర్థక ఆస్తుల నిష్పత్తి గత త్రైమాసికంలోని 1.20 శాతం నుంచి 1.18 శాతానికి తగ్గింది, నికర నిరర్థక ఆస్తుల నిష్పత్తి గత త్రైమాసికంలోని 0.25 శాతం నుంచి 0.27 శాతానికి స్వల్పంగా పెరిగింది. ఈ త్రైమాసికంలో బ్యాంక్ కేటాయింపులు గత త్రైమాసికంలోని రూ.516 కోట్ల నుంచి రూ.668 కోట్లకు పెరిగాయి. అయితే గత ఏడాది ఇదే కాలంలో నమోదైన రూ.1,208 కోట్లతో పోలిస్తే 45 శాతం తగ్గాయి.

గత ఏడాది రూ.3,282 కోట్లుతో పోలిస్తే కోటక్ బ్యాంక్ నికర లాభం రూ.4,123 కోట్లు సాధించింది. నికర వడ్డీ ఆదాయం కూడా 7259 కోట్లనుంచి 9శాతం వృద్ధితో 7928 కోట్లు రాబట్టింది. నిర్వహణ లాభం గత ఏడాది 5564 కోట్లనుంచి 10శాతం వృద్ధితో 6131 కోట్లు రాగా కేటాయింపులు గత ఏడాది 1208 కోట్లనుంచి రూ.668 కోట్లకు గణనీయంగా తగ్గించుకోగలిగింది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

# మహిళల్లో ఆటల ద్వారా ఆత్మవిశ్వాసం : మంత్రి నిమ్మల

## మట్టపర్రులో ఉపాధి హామీ శ్రామికులకు ఆత్మీయ కార్యక్రమం.





**పాలకొల్లు జూలై 18 ప్రభాతవార్త** ఇంటి బాధ్యతలు, ఉపాధి హామీ పనులతో రోజంతా శ్రమించే మహిళల శ్రమను గౌరవించడంతోపాటు కాసేపు ఉల్లాసంగా, ఆనందంగా గడిపేలా ప్రత్యేకంగా ఆటల కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. "పేదల సేవే మా సేవ" కార్యక్రమంలో భాగంగా పోడూరు మండలం మట్టపర్రు గ్రామంలో నిర్వహించిన ఉపాధి హామీ శ్రామికుల ఆత్మీయ భోజనాల కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మహిళలకు మానసిక ఉల్లాసం, శారీరక ఉత్సాహం కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని వివరించారు. ఈ ఆటల ద్వారా మహిళల్లో ఆత్మవిశ్వాసం, ఐక్యత, ఆత్మస్థైర్యం పెంపొందడంతో పాటు ఆరోగ్యంపై అవగాహన కూడా కలుగుతుందన్నారు. ముందుగా మహిళా శ్రామికులకు మ్యూజికల్ చైర్స్, లోపల బయట, లెమన్ స్పూన్ ఆటలు నిర్వహించారు. పోటీలను మంత్రి రామానాయుడు స్వయంగా తిలకించి మహిళలను అభినందించారు.ఈ పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. లక్కీ డిప్ ద్వారా మహిళలకు చీరలు అందజేశారు.కుటుంబ బాధ్యతల మధ్య తమ కోసం కొంత సమయం కేటాయించుకునే అవకాశం కల్పించడం ఆనందదాయకమని మహిళలు వ్యక్తం చేశారు. శ్రామికులంతా ఒకే చోట కూర్చొని భోజనాలు చేయడంతో మంత్రి రామానాయుడు తో పాటు కూటమి నాయకులు స్వయంగా వడ్డించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గొట్టుముక్కల సూర్యనారాయణ రాజు, రమేష్ రాజు, శీలం శ్రీనివాసరావు, ఎల్లమెల్లి వెంకటరావు, దేవరపు దొరబాబు, మేడిశెట్టి వీర వెంకట సత్యనారాయణ, కుక్కల మునీందర్ రావు, దొమ్మేటి శ్రీనివాస్, కేత హరికృష్ణ ఓటమి నాయకులు పాల్గొన్నారు.

# పశ్చిమగోదావరి,ఏలూరు వార్త

## గురుకులాలకు సరుకుల పంపిణీకి

# జెసి ఆధ్వర్యంలో టెండర్లు నిర్వహణ



**భీమవరం టౌన్, జూలై 18 : ప్రభాతవార్త** ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ శాఖ గురుకు లాల విద్యాసంస్థ ద్వారా నిర్వహిం చబడు తున్న పశ్చిమగోదావరి, జిల్లాల్లోని నాలుగు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకులాలకు 2026 - 27 విద్యా సంవత్సరానికి గాను విద్యార్థులకు సరఫరా చేయ వలసిన కూరగాయలు, గ్రుడ్లు, చికెన్, పండ్లు పంపిణీకి శనివారం జిల్లా పర్చేజింగ్ కమిటీ అధ్యక్షులు మరియు జిల్లా జాయింట్ కలెక్టర్ కె.ఆర్ కల్పశ్రీ ఆధ్వర్యంలో టెండర్లు నిర్వ హించారు. ఈ కార్యక్రమానికి డిపిసి సభ్యు లు మరియు గుత్తేదారులు పాల్గొని టెండర్లు పారదర్శకంగా జరిగేందుకు సహకారం అందించారు. నాలుగు గురుకులాల ప్రిన్సి పాల్స్, మరియు జిల్లా సమన్వయ అధి కారిణి ఎస్ తబిత, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## జగన్ 2.0 సూపర్ యాప్

# కార్యకర్తలకు ఆయుధం

## యాప్ పోస్టర్ విడుదల చేసిన వైసీపీ నాయకులు



**తణుకు, జూలై 18: ( ప్రభాత వార్త)** జగన్ 2.0 సూపర్ యాప్ ప్రతి వైఎస్సార్‌సీపీ కార్యకర్తకు ఒక ఆయుధంగా, నాయకత్వం-కార్యకర్తల మధ్య వారధిగా పనిచేస్తుందని వైఎస్సార్‌సీపీ పంచాయతీరాజ్ విభాగ రాష్ట్ర కార్యదర్శి వద్లూరి సీతారాం అన్నారు. తణుకులో మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన జగన్ 2.0 సూపర్ యాప్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, కార్యకర్తల సమస్యలతో పాటు ప్రజల సమస్యలను కూడా నేరుగా పార్టీ దృష్టికి తీసుకెళ్లేందుకు ఈ యాప్ ఉపయోగపడుతుందని చెప్పారు. రోడ్లు, తాగునీరు, డ్రెయినేజీ, పెన్షన్, రేషన్ వంటి సమస్యలను యాప్ ద్వారా నమోదు చేయవచ్చన్నారు. సోషల్ మీడియా కార్యకర్తలపై వేధింపులు, పార్టీ కార్యకర్తలపై దాడుల వంటి అంశాలను కూడా ఇందులో అప్‌డేట్ చేయవచ్చని తెలిపారు. ప్రతి కార్యకర్త, నాయకుడు ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ప్రజా సమస్యలను పార్టీ దృష్టికి తీసుకురావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వెలగల సాయిబాబారెడ్డి, పెనుమత్స సుబ్బరాజు, జల్లూరి జగదీష్‌తో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎంపీ పుట్టా మహేష్ కుమార్‌కు నేతల పరామర్శ





**ఏలూరు, జూలై 18 ( ప్రభాత వార్త )** ఏలూరు పార్లమెంట్ సభ్యులు పుట్టా మహేష్ కుమార్‌ను శనివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో ఏలూరు పార్లమెంట్ పరిధికి చెందిన పలువురు నాయకులు కలిసి పరామర్శించారు. ఎంపీ నాయనమ్మ పుట్టా పోలమ్మ ఈ నెల 10వ తేదీన కన్నుమూసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పోలవరం, చింతలపూడి, నూజివీడు, దెందులూరు నియోజకవర్గాలకు చెందిన నాయకులు ఆయనను కలిసి ప్రగాఢ సంతాపం తెలిపారు. అనంతరం పోలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీ పుట్టా మహేష్ కుమార్‌తో పాటు ఆయన కుటుంబ సభ్యులకు నాయకులు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ఈ విషాదం నుంచి త్వరగా కోలుకుని ధైర్యంగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. తనను పరామర్శించేందుకు వచ్చిన నాయకులు, పార్టీ కార్యకర్తలను ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ఆప్యాయంగా పలకరించి, ఈ క్లిష్ట సమయంలో అండగా నిలిచిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చింతలపూడి మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళి, ఎంపీపీ చింతా విష్ణు, కరాటం సాయి, ముమ్మడి చింతయ్య, కోపేర నాగరాజు, ఇసుకపల్లి తాతారావు, తాళ్లూరు చంద్రశేఖర్, యువరాజ్, కాట్రు బాలకృష్ణ, ముస్తఫా, నున్న లక్ష్మణ్, తలకొండ జవలయ్య, యనమదల సత్యనారాయణ (నాని)తో పాటు వివిధ నియోజకవర్గాలకు చెందిన పలువురు నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# శిధిలావస్థలో వేంపాడు మేజర్ కాలువ

## గండ్లు పడినా పట్టించుకోని అధికారులు



**ప్రభాతవార్త చాట్రాయి** నాగార్జునసాగర్ వేంపాడు మేజర్ కాలువ శిధిలాస్తుకు చేరింది. కాలువకు ఇరువైపులా భారీ గండ్లు పడినప్పటికీ అధికారులు పట్టించుకోవటం లేదని ఆయకట్టు రైతులు వాపోతున్నారు. కాలుకు ఇరువైపులా రోడ్డు ఉండగా రైతులకు తమ పంట పొలాలకు వెళ్లేందుకు అవకాశం ఉండేది. కానీ నేడు గండ్లు పడటంతో పాటు కర్ర తుమ్మ చెట్లు, పిచ్చి మొక్కలు కూడా బాగా పెరిగిపోవడంతో రైతులు పొలాలకు వెళ్లేందుకు కూడా వీలులేని పరిస్థితి ఏర్పడిందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చాట్రాయి మండలం చనుబండ నుండి పిట్టల వారి గూడెం మీదగా చాట్రాయికి రోడ్డు ఉండగా కాలువకు ఎటువంటి మరమ్మతులు చేపట్టకపోవడంతో రైతుల పరిస్థితి అగమ్య గోచారంగా తయారైంది. సంబంధిత ఎన్ఎస్పి అధికారులు కాలువను పరిశీలించినప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలువ మరమ్మతులు చేయించాలని రైతులు కోరుతున్నారు.

# పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలి: ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ



**తణుకు, జూలై 18 ( ప్రభాత వార్త)** : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా కనీసం ఒక మొక్కను నాటి సంరక్షించాలని తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ పిలుపునిచ్చారు. స్వర్ణాంధ్ర--స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం తణుకులో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో ప్రభుత్వం క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాలను ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, పరిశుభ్రత, పచ్చదనంపై ప్రజల్లో అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం లక్ష్యమని చెప్పారు. తణుకు నియోజకవర్గంలో వెయ్యి మొక్కలు నాటే లక్ష్యంతో ప్రణాళికలు రూపొందించామని, ప్రతి ఒక్కరూ తమ తల్లి పేరుతో ఒక మొక్కను నాటి దానిని సంరక్షించాలని కోరారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పేకాట స్థావరంపై పోలీసుల దాడి.. ఐదుగురు అరెస్ట్

**మొగల్తూరు, జూలై 18 (ప్రభాతవార్త):** మొగల్తూరు శివారులో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై శనివారం పోలీసులు ఆకస్మికంగా దాడి చేసి ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. మొగల్తూరు ఎస్ఐ జి. వాసు తెలిపిన వివరాల ప్రకారం, పక్కా సమాచారంతో నిర్వహించిన ఈ దాడిలో పేకాట ఆడుతున్న ఐదుగురిని పట్టుకున్నట్లు చెప్పారు. వారి వద్ద నుంచి రూ.2,400 నగదు, 52 పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ వెల్లడించారు.

## ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ గా తీర్చిదిద్దడమే

# కూటమి ప్రభుత్వ లక్ష్యం



భావితరాలకు ఆరోగ్యకరమైన వాతావరాన్ని అందించవలసిన బాధ్యత మనందరిపై ఉంది రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి

**ఆగిరిపల్లి: జూలై 18: ప్రభాతవార్త.** ఆగిరిపల్లి మండలం అడవినెక్కలంలో జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో ప్రతి మూడవ శనివారం నిర్వహించే స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా "బల్క్ వేస్ట్ జనరేటర్స్ నమోదు, ఘనవ్యర్థాలు నిర్వహణ నియమాలు , పరిశుభ్రత పట్ల అవగాహన" అనే థీమ్ తో కార్యక్రమాన్ని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి చీపుర్లను చేతబట్టి, విద్యార్థిని, విద్యార్థులు గ్రామస్తులతో కలిసి పాఠశాల ప్రాంగణాన్ని తుడిచి శుభ్రం చేశారు. పాఠశాలలో విద్యార్థిని, విద్యార్థులకు పరిసరాలు పరిశుభ్రత, చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవాలని చేతులను దగ్గర ఉండి శుభ్రం చేయించారు. విద్యార్థులతో మంత్రి కాసేపు ముచ్చటించారు. మొక్కలను నాటి, అనంతరం మంత్రి కొలుసు పార్థసారథి స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ స్వర్ణాంధ్ర - 2047 సంకల్పంలో భాగంగా ప్రతి నెల మూడవ శనివారం నిర్వహించే స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో రాష్ట్రస్థాయి అధికారులు, జిల్లా కలెక్టర్లు, ప్రజా ప్రతినిధులు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎన్జీఓలు, కార్పొరేటు సంస్థలు, విద్యార్థులు, యువత, సేవా సంస్థలు, స్వచ్ఛందంగా పాల్గొనాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపు మేరకు అందరూ పాల్గొని, మంచి ఫలితాలు వస్తున్నాయని అన్నారు. స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఏదో జిల్లాలో పాల్గొని, అందరికీ స్ఫూర్తిని నిశీపుతున్నారని అన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా లేకపోతే, వ్యాధులు సోకుతాయని, ప్రజలు ఆర్థికంగా నష్టపోవడమే కాకుండా ఆర్థికంగా బలహీనులు అవుతారని అన్నారు. వ్యాధులు సోకకుండా ముందస్తు జాగ్రత్తలకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అత్యంత ప్రాధాన్యతను ఇస్తున్నారని అన్నారు. "స్వర్ణాంధ్ర -స్వచ్ఛాంధ్ర" కార్యక్రమం కేవలం పరిశుభ్రత కార్యక్రమం మాత్రమే కాదని, ఇది ప్రతి పౌరుడు బాధ్యతగా పాల్గొని రాష్ట్రాన్ని పరిశుభ్రంగా, ఆరోగ్యవంతంగా, అభివృద్ధి దిశగా నడిపించే ప్రజా ఉద్యమం అన్నారు. పరిశుభ్రమైన గ్రామాలు, పట్టణాలు మన ఆరోగ్యానికి, పర్యావరణానికి, భావి తరాలకు అమూల్యమైన సంపద అన్నారు. మన పరిసరాలను శుభ్రంగా ఉంచడం ప్రతి ఒక్కరీ బాధ్యత అని, మనఇల్లు, మనవీధి, కార్యాలయం, పాఠశాల, ఎక్కడైనా పరిశుభ్రతను పాటించడం ద్వారా మన రాష్ట్రాన్ని ఆదర్శంగా తీర్చిదిద్ద గలమని అన్నారు. ప్రజలు సహకారంతో చెత్తను తడి, పొడి వ్యర్థాలుగా వేరు చేయడం, ప్లాస్టిక్, క్యారీ బ్యాగులను వినియోగాన్ని తగ్గించడం, పచ్చదనాన్ని పెంపొందించడం, పరిశుభ్రతపై అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాలను విజయవంతంగా చేస్తే, మంచి ఫలితాలు వస్తాయని అన్నారు. ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాలకు ప్రజలు భాగస్వామ్యం తోడైతేనే ఈ లక్ష్యం సాకారం తప్పక అవుతుందని అన్నారు. మనమంతా కలిసి పనిచేస్తేనే పరిశుభ్రమైన, సుస్థిరమైన, అభివృద్ధి చెందిన ఆంధ్రప్రదేశ్‌ను నిర్మించగలమని అన్నారు. ప్రతి పౌరుడు ఈ ఉద్యమంలో భాగస్వామి కావాలని, పరిశుభ్రతను మన జీవన విధానంగా మార్చుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టరు బొల్లిపల్లి వినూత్న, వివిధ శాఖలు అధికారులు, ఉపాధ్యాయులు, నాన్ టీచింగు సిబ్బంది, ప్రజా ప్రతినిధులు, పట్టణ ప్రముఖులు, కూటమి నాయకులు, స్థానిక ప్రజలు, విద్యార్థిని, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



# ప్లాస్టిక్ రహిత పట్టణంగా తీర్చిదిద్దుదాం..

## జిల్లా జాయింట్ కలెక్టర్ కే.ఆర్ కల్పశ్రీ



**భీమవరం జులై 18 ప్రభాతవార్త** పట్టణంలో భారీ వ్యర్థాల ఉత్పత్తిదారులను గుర్తింపు వేగవంతం చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ కె.ఆర్ కల్ప శ్రీ తెలియజేశారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం "బల్క్ వేస్ట్ జనరేటర్ల గణన " అంశంపై జువ్వలపాలెం రోడ్డు, అయ్యప్ప స్వామి గుడి వద్ద ఏర్పాటుచేసిన కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ కె.ఆర్ కల్పశ్రీ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ కె.ఆర్ కల్ప శ్రీ మాట్లాడుతూ పట్టణాన్ని ప్లాస్టిక్, చెత్త రహిత నగరంగా రూపుదిద్దుటకు ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని పేర్కొన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించి భావితరాలకు ఆరోగ్యకరమైన పర్యావరణాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరు బాధ్యత వహించాలని అన్నారు. భీమవరాన్ని భవ్య భీమవరంగా తీర్చిదిద్దుతామని అన్నారు. పట్టణాన్ని సుందరీకారంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని అన్నారు. పట్టణంలో ని అపార్ట్మెంట్లు, వెల్ఫేర్ అసోసియేషన్లు, హోటళ్లు, షాపింగ్ మాల్స్, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు ఆసుపత్రులు,విద్యాసంస్థలు, కల్యాణ మండపాలు, పబ్లిక్ ఇన్ఫ్రా స్ట్రక్చర్స్ అయినా రైల్వే, బస్ స్టేషన్లు వంటి ప్రాంతాలలో ఉన్న సంస్థలను సర్వేచేసి భారీ వ్యర్థాల ఉత్పత్తిదారుల ను గుర్తించాలని అన్నారు. రోజుకు 100 కిలోలు లేదా అంతకంటే ఎక్కువ ఘన వ్యర్థాలను ఉత్పత్తి చేసే సంస్థలు, 20,000 చదరపు మీటర్లు లేదా అంతకంటే ఎక్కువ బిల్ట్ -అప్ ఏరియా కలిగిన సంస్థలు, రోజుకు 40 వేల లీటర్లు లేదా అంతకంటే ఎక్కువ నీటిని వినియోగించేవారు భారీ వ్యర్థాల ఉత్పత్తిదారులు గా పరిగణిస్తారని అన్నారు. పట్టణంలోని ప్రజలు తమ ఇంటిలోని వ్యర్థాలను తడి, పొడి చెత్తను వేరుచేసి పారిశుద్ధ్య కార్మికులకు అప్పగించవలసిన బాధ్యత ఉందని అన్నారు. క్లీన్ భీమవరం గా తీర్చిదిద్దేందుకు ప్రజలందరూ సహకరించాలని తెలియజేశారు. పాఠశాల, కళాశాల విద్యార్థులు పారిశుద్ధ్య కార్యక్రమాల పట్ల తల్లిదండ్రులకు అవగాహన కలిగే విధంగా తెలియజేయాలని అన్నారు. పారిశుద్ధ్య నిర్వహణ పై హోటళ్లు, ఆసుపత్రులు, విద్యాసంస్థలు, మాల్స్ యజమానులు పూర్తి అవగాహన కలిగి పర్యావరణ పరిరక్షణకు దోహదపడాలని అన్నారు. డ్వాక్రా మహిళలు, సెక్రటరీలు పారిశుద్ధ్య నిర్వహణ కార్యక్రమాల పట్ల ప్రతి వార్డులో విస్తృత ప్రచారం చేయాలని అన్నారు. అనంతరం పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ వాడకం నిషేధం బ్రోచర్ ను జిల్లా జాయింట్ కలెక్టర్ కె.ఆర్ కల్ప శ్రీ, మున్సిపల్ కమిషనర్ కే రామచంద్రారెడ్డి, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ ఏ. రాంబాబు, కంతేటి వెంకటరాజు, ప్రముఖ సాంఘిక సంఘసంస్కర్త చెరుకువాడ రంగసాయి తో కలిసి పోస్టర్ ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కే రామచంద్రారెడ్డి, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ ఏ. రాంబాబు, ప్రముఖ సాంఘిక సంఘసంస్కర్త చెరుకువాడ రంగసాయి, డ్వాక్రా మహిళలు, పాఠశాల కళాశాలల విద్యార్థులు తదితరులు పాల్గొరు.



# ఉదయ్ భాస్కర్ కాలనీ డ్వాక్రా సంఘాల్లో అవకతంకలు!

## -న్యాయం చేయాలంటున్న బాధితులు



**జీలుగుమిల్లి, జూలై-18, (ప్రభాతవార్త)** మండలంలోని ఉదయ భాస్కర్ కాలనీ డ్వాక్రా సంఘాలలో అవకతవకలు జరిగాయని డ్వాక్రా మహిళలు ఆరోపిస్తున్నారు. వివరాలు ఎలా ఉన్నాయి. గ్రామంలో శ్రీరామ గ్రూపుకు సంబంధించి కొల్లి లక్ష్మీ దుర్గ రూ50.00 వేలు స్త్రీ నిధి గత డిసెంబర్ లో తీసుకోగ, నెలకు రూ. 2500 చొప్పున రెండు నెలలు గాను రూ.5.00 వేలు కట్టగా అసలు డబ్బులే కట్టలేదని వెలుగు సిబ్బంది చెప్తున్నారు అని వాపోయారు. అనంతరం తాను కూడా వాయిదాలు కట్టలేకపోతున్నానని తెలిపారు. తేజస్విని గ్రూపుకు సంబంధించి చిటక సీత అనే మహిళ లక్ష రూపాయలు అప్పు తీసుకున్నానని నెల నెల వాయిదాలు కడుతున్న, వడ్డీ పేరుతో ఇంకా లక్ష బాకీ ఉందని చెప్తున్నారని వాపోయారు. పసుపులేటి మౌనిక లక్ష రూపాయల రుణం తీసుకుంటే వరుసగా వాయిదాలు కట్టుతున్న, తాను 30,000 కట్టాల్సి ఉండగా ఇంకా వడ్డీతో సహా లక్ష కట్టాలంటూ అంటున్నారని వాపోయారు. ఇలా మరో 9 మంది మహిళలకు ఇదే పరిస్థితి ఉందని మహిళలు తెలిపారు. ఈ సమస్యపై ఈ మధ్యకాలంలో ఏపీఎం వచ్చి విచారణ తూతు మంత్రంగా చేశారు తప్ప తమకు న్యాయం జరగలేదని బాధిత మహిళలు వాపోయారు. తీర్మాన, ఖాత పుస్తకాలు ఇవ్వడం లేదని మహిళలు పేర్కొంటున్నారు. సమస్యను సంబంధిత అధికారులు పరిష్కరించి న్యాయం చేయాలని మహిళలు కోరుతున్నారు.

# రిజిస్ట్రేషన్ శాఖ ప్రైవేటు కు అప్పగించేందుకు రంగం సిద్ధం

## -దస్తావేజు లేఖరులకు ప్రభుత్వం మొండిచేయి

**నూజివీడు, జులై 18 ప్రభాతవార్త :** ఆంగ్ల పాలకులు దేశాన్ని పరిపాలించిన నాటి నుండి రిజిస్ట్రేషన్ శాఖలో దస్తావేజు లేఖర్లకు ఒక ప్రత్యేక గుర్తింపు ఉంది. ఎంతో పరిణితి చెందిన వారు రిజిస్ట్రేషన్ కు సంబంధించి అన్ని సూచికలు క్షుణ్ణంగా తెలిసి అందుకు అనుగుణంగా దస్తావేజులను సిద్ధం చేస్తుంటారు. దస్తావేజు లేఖరుల కుటుంబ పోషణ చేసుకునేందుకు దస్తావేజులు రాస్తూ జీవనం సాగిస్తారు. ఈ క్రమంలో గత కొంతకాలంగా రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 396ను తీసుకురావడంతో అ జీవో లేఖర్లకు సంకటంగా మారనుంది. ఈ జీవోతో రిజిస్ట్రేషన్ శాఖ సంబంధించిసేవలు అన్ని ప్రైవేటు పరం చేసి దాని ద్వారా ఫ్రంట్ ఆఫీస్ కేంద్రాలు ఏర్పాటు చేసి దస్తావేజు తయారు చేయడం ఇతర సేవలు మొత్తం నిర్వహించేలా చర్యలు చేపట్టింది. దీంతో లేఖర్లు తమ పోషణను కోల్పోవడం, కుటుంబాలు రోడ్డున పడతాయి అంటూ ఆవేదన చెందుతున్నారు. పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్షిప్ విధానంతో, రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలతో తాము నష్టపోతామని వాపోతున్నారు.అంతేకాకుండా రిజిస్ట్రేషన్కు వచ్చే కక్షిదారులు సైతం అవస్థలు ఎదుర్కొనున్నారు. ప్రైవేటుకు అప్పగించేందుకు రంగం సిద్ధం:-రిజిస్ట్రేషన్ శాఖను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించేందుకు ఇప్పటికే ఏ.పీ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అందుకు అనుగుణంగా 396 జీవోను విడుదల చేసింది. అది దస్తావేజు లేఖర్లకు శాపంగా మారింది. ఈ జీవోతో ప్రభుత్వానికి సంబంధించిన అన్ని వ్యవహారాలు ప్రైవేటు వ్యక్తుల చేతికి వెళ్లనున్నాయి. ప్రైవేట్ కేంద్రాలలో రిజిస్ట్రేషన్లు చేయడం దస్తావేజులు రాయడం అన్నీ కూడా ప్రైవేట్ సంస్థ ద్వారా నిర్వహించునున్నారు. దీంతో లేఖరులు తమ జీవన ఆధారాన్ని కోల్పోనున్నారు. వారి కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన చెందుతున్నారు. ఎన్నో ఏళ్లగా రిజిస్ట్రేషన్ చేసే వారికి ఎన్నో సేవలు అందిస్తున్న తమపై ప్రభుత్వం ఇలా వ్యవహరించడం సమంజసం కాదని పే ర్కొంటున్నారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని పునఃసమీక్షించాలని కోరుతున్నారు.ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి:-రిజిస్ట్రేషన్ శాఖలో పీపీపీ విధానంతో ప్రభుత్వ ఆదాయానికి తీవ్ర గండి ఏర్పడే అవకాశం ఉందని అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ప్రైవేటు వ్యక్తులు ఇష్టారాజ్యంగా వ్యవహరించి రిజిస్ట్రేషన్ దారులను దోచుకునే ప్రమాదం ఉందని లేఖర్లు ఆరోపిస్తున్నారు. మరోపక్క రిజిస్ట్రేషన్ శాఖలో పీపీపీ విధానం ప్రవే శపెట్టడం అసాధ్యమని పలువురు పేర్కొంటున్నారు. ప్రజలను తప్పుదోవ పట్టించేందుకే ఇలాంటి వదంతులు వస్తున్నట్లు ఆరో పణలు ఉన్నాయి. కొన్ని లక్షల రూపాయల ఆదాయాన్నిచ్చేరిజి స్ట్రేషన్ శాఖను ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లో ప్రైవేటుపరం చేయవద్దని పలువురు పేర్కొంటున్నారు. ప్రజలను తప్పుదోవ పట్టిం చేందుకు ఇటువంటి ప్రకటనలు చేస్తున్నట్లు ఆరోపిస్తున్నారు.ప్రభుత్వ రంగంలోనే కొనసాగిస్తూసౌకర్యాలు పెంచాలి:-రిజిస్ట్రేషన్ శాఖను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాల ని వినియోగదారులు కోరుతున్నారు. కోట్ల రూపాయల ఆదా యాన్నిచ్చే శాఖను ప్రైవేట్పరం చేయడం సరికాదంటున్నారు. ప్రైవేటు సంస్థల వ్యక్తులకు అప్పచెప్తే కోట్ల రూపాయల ఖర్చవుతుంది. నాయకులు, అధికారుల మెప్పుకోసం కొందరు సబ్ రిజి స్ట్రార్లుతమసొంతనిధులను సైతం వినియోగిస్తున్నారు. ఈ మొత్తాన్ని కక్షిదారుల నుండే సబ్ రిజిస్ట్రార్లు ముక్కు పిండి వసూలు చేస్తుంటారు. ప్రైవేటు వ్యక్తుల చేతికి రిజిస్ట్రేషన్ శాఖ వెళితే నాయకులు అధికారుల చేతివాటంతో అవినీతి పెరిగిపోతుంది. కావున రిజిస్ట్రేషన్ శాఖను ప్రైవేట్ పరం చేయకుండా ప్రభుత్వరం గంలోనే కొనసాగించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. అ లాగే ప్రస్తుతం రిజిస్ట్రేషన్ శాఖలో సరైన వసతులు లేక రిజి స్ట్రేషన్లలో కొంత జాప్యం జరుగుతోందని, దానిని సరిచేస్తేత్వ రితగతిన పూర్తి చేయవచ్చని అనుభవజ్ఞులు సూచిస్తున్నారు.విధ్యుత్ పోయినప్పుడు వినియోగించేందుకు ఇన్వర్టర్లు, జనరేటర్లు ఏర్పాటు చేయడం, మౌలికవసతులు మెరుగుపరిస్తే సరిపోతుంది. ఏసీలు సరిగా పనిచేయకపోవడం, సర్వర్ల సమస్యలను పరిష్కరించాలంటున్నారు. ప్రింటింగు వాడే టోనర్లు నాసిరకంగా ఉండడం, స్టేషనరీ సరిగా సప్లై చేయక పోవడం తదితర సమస్యలను ప్రభుత్వం అధికమించాల్సి ఉంది. పెన్డౌన్ కు సిద్ధమవుతున్న లేఖర్లు:-ఎన్నో ఏళ్లగా దస్తావేజులు రాస్తూ రిజిస్ట్రేషన్ కార్యాల యాల వద్ద ప్రజలకు సేవలు అందిస్తున్న తమ జీవనోపాధి మీద కొడితే చూస్తూ ఊరుకోమని, ఉద్యమాలకు రష్ట వ్యాప్తంగా సిద్ధమవుతామని లేఖర్లు హెచ్చరిస్తున్నారు. ఈ దిశగా జీవో నెంబర్ 396కు వ్యతిరేకంగా జులై 20వ తేదీ నుంచి 30వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా దస్తావేజు లేఖరులు పెన్ డౌన్ చేసే ఉద్యమానికి సిద్ధమవుతున్నారు. తమ న్యాయమైన కోరికలు నెరవేర్చుకునేందుకు ఎంతటి ఉద్యమానికైనా సిద్ధమని హెచ్చరిస్తున్నారు. ఇకనైనా ప్రభుత్వం 396 జీవోను రద్దుచేసి రిజిస్ట్రేషన్ శాఖను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

# షైనింగ్ స్టార్ అవార్డులకు ఏడుగురు ఎంపిక

**అత్తిలి,జులై 18 (ప్రభాతవార్త )** అత్తిలి మండలంలో పదవ తరగతిలో అత్యధిక మార్కులు పొందిన ఏడుగురు విద్యార్థులు షయినింగ్ స్టార్ అవార్డులకు ఎంపికైనట్లు మండల విద్యాధికారి ఎన్ రమేష్, ఎం వి ఎల్ కె ప్రసాద్ తెలిపారు. ఆరవల్లి ఉన్నత పాఠశాలకు చెందిన కర్రీ తన్మయి, బల్లిపాడు ఉన్నత పాఠశాలకు చెందిన గాతాల గ్లోరీ అక్షర, సప్పాల వాక్య శ్రీ, అత్తిలి ఎమ్ ఎమ్ పాఠశాలకు చెందిన వెలగల షణ్ముఖ వల్లి, పోతిరెడ్డి నాగలక్ష్మి దుర్గా వైష్ణవి, కవాడి విల్సన్ పౌల్, చల్లా బత్తుల సంగీత ఎంపికైనట్లు తెలిపారు. వీరిని జిల్లా కేంద్రంలో ప్రశంసా పత్రము, మెడల్, 20వేలు నగదుతో సత్కరిస్తారు.

# వరాల వెంకన్న ను దర్శించుకున్న భక్తులు



**అత్తిలి, జులై 18( ప్రభాత వార్త ):** అత్తిలి మండలం ఈడూరు గ్రామం లో గల వరాల వేంకటేశ్వరస్వామిని శనివారం పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.ఆలయ అర్చకుడు వాడపల్లి శేఖరాచార్యులు ఆధ్వర్యంలో సుప్రభాత సేవ, తోమాల సేవ , విశేష అర్చనలు జరిపారు. భక్తుల సహకారంతో రాగయుక్తంగా గోవింద నామాలను పఠించారు. దేవాలయ కమిటీ సహకారం తో అన్నదానం జరిపారు.అత్తిలి రైల్వే స్టేషన్ రోడ్డులో గల బాలాజీ వేంకటేశ్వరస్వామి వారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు వాడపల్లి సత్యనారాయణాచార్యులు , వల్లి వెంకటేష్ , సూర్య తేజ ఆధ్వర్యంలో అర్చనలు జరిపారు. ఈ సందర్భంగా స్వామి వారిని విశేషంగా అలంకరించారు.

# ఎంపీ పుట్టా మహేష్‌ను పరామర్శించిన గడ్డమణుగు, కరాటం సాయి

**జీలుగుమిల్లి, జూలై-18, (ప్రభాతవార్త)** ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్‌ను జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి కరాటం సాయి, పార్టీ జిల్లా కార్యదర్శి, ద్వారకాతిరుమల దేవస్థానం ట్రస్ట్ బోర్డు స్పెషల్ ఇన్వైటీ గడ్డమణుగు రవికుమార్ శనివారం హైదరాబాద్‌లోని ఆయన స్వగృహంలో పరామర్శించారు.ఇటీవల ఎంపీ పుట్టా మహేష్ కుమార్ నానమ్మ పోలమ్మ మృతి చెందిన నేపథ్యంలో ఆమె చిత్రపటం వద్ద పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఎంపీ మహేష్ కుమార్‌కు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా దివంగత పోలమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని వారు ప్రార్థించారు.



# కూటమి నాయకుల ఆధ్వర్యంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

**వేలేరుపాడు, జూలై 18 (ప్రభాత వార్త):**వేలేరుపాడు మండలంలో కూటమి నాయకుల ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ కార్యక్రమం జనసేన పార్టీ మండల ప్రధాన కార్యదర్శి మేచినేని సంజయ్ నివాసంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బాధితులైన లాడే వెంకటేశ్వర్లు, బొడ్డు శివసాయికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను జనసేన మండల ప్రధాన కార్యదర్శి మేచినేని సంజయ్ టీడీపీ మండల అధ్యక్షులు అమరవరపు అశోక్ బీజేపీ మండల అధ్యక్షులు ఓలేటి అనిల్ (బాలకృష్ణ) సంయుక్తంగా అందజేశారు.లబ్ధిదారులు మాట్లాడుతూ తమకు ఆర్థిక సహాయం అందించిన కూటమి ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా లాడే వెంకటేశ్వర్లు, బొడ్డు శివసాయి టీడీపీ మండల అధ్యక్షులు అమరవరపు అశోక్, జనసేన మండల ప్రధాన కార్యదర్శి మేచినేని సంజయ్‌లకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు బి శివరామ్ ప్రసాద్, ఎస్ వంశీ, కె భాను, టీడీపీ నాయకులు కె ముత్యాలరావు, పి లక్ష్మయ్య, జి అనిల్, బి గంగాధర్ రావు, పి చిన్ని, సత్తిపండు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఆత్మహత్యల నివారణ మహిళా శిశు రక్షణపై అవగాహన కార్యక్రమం

**వేలేరుపాడు, జూలై 18(ప్రభాత వార్త ):** మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ, ఏలూరు జిల్లా ఆధ్వర్యంలో వేలేరుపాడు మండలం వెలుగు కార్యాలయంలో ఆత్మహత్యల నివారణ మానసిక ఆరోగ్య పరిరక్షణ అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.జిల్లా మిషన్ కోఆర్డినేటర్ మరియు నోడల్ అధికారి శ్రీమతి ఈ తులసి మాట్లాడుతూ మానసిక సమస్యలు ఎదురైనప్పుడు 14416 టెలి-మానస్, మహిళల కోసం 181, పిల్లల కోసం 1098, అత్యవసర పరిస్థితుల్లో 112 హెల్ప్‌లైన్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు.బాలికల విద్య, ఆరోగ్యం, స్వీయ రక్షణపై అవగాహన పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు.సీడీపీఓ శ్రీమతి అనంత లక్ష్మి మాట్లాడుతూ వన్ స్టాప్ సెంటర్ ద్వారా హింసకు గురైన మహిళలకు వైద్య పోలీసు, న్యాయ సహాయం, మానసిక పరామర్శ, తాత్కాలిక ఆశ్రయం వంటి సేవలు ఉచితంగా అందుతున్నాయని తెలిపారు.డాక్టర్ జి ప్రవీణ ఆశ యుక్తవయస్సులో గర్భధారణ వల్ల కలిగే ఆరోగ్య సమస్యలపై వివరించగా, ఆశా జ్యోతి బాల్య వివాహాల నివారణ, బాలికల విద్య ప్రాధాన్యతను వివరించారు.జిల్లా బాలల పరిరక్షణ విభాగం సిబ్బంది పి రాజేష్, వై రాజ్‌కుమార్ పోక్సో చట్టం, బాలల హక్కులు, బాల్య వివాహాల నిరోధక కమిటీల బాధ్యతలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మహిళలు, కిశోర బాలికలు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.





# ముద్దాయిలు సత్ప్రవర్తన కలిగి ఉండాలి

**భీమవరం జులై 18 ప్రభాతవార్త** భీమవరం మండల న్యాయ సేవా సంస్థ చైర్మన్, పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి డా. బి . లక్ష్మీనారాయణ శనివారం స్థానిక ప్రత్యేక ఉపకారాగారాన్ని సందర్శించి ముద్దాయిలతో మాట్లాడి కేసు వివరాలను, ముద్దాయిల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ముద్దాయిలు సత్ప్రవర్తన కలిగి నడుచుకోవాలన్నారు. ముద్దాయిలు జైలులో సిబ్బందినిగానీ, తోటి ముద్దాయిలను గానీ ఇబ్బందులు కలిగించినట్లు కోర్టు దృష్టికి వస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అదేవిధంగా జైలు సిబ్బంది కూడా ముద్దాయిలను మంచిగా చూసుకోవాలన్నారు. ఉచిత న్యాయవాది అవసరమైతే సంస్థకు అర్జీ పెట్టమన్నారు. న్యాయమూర్తి జైలు పరిసరాలను పరిశీలించి మొక్కలను నాటమని సిబ్బందిని సూచించారు. జైలులో వున్న న్యాయ సహాయ కేంద్రాన్ని పరిశీలించి ముద్దాయిలకు కేసుపరంగా సలహాలు ఇచ్చి అవసరమైతే అర్జీలు వ్రాయమని ఉచిత న్యాయవాదిని సూచించారు. ముద్దాయిలకు ఇస్తున్న సాయంత్ర భోజనాన్ని రుచి చూసారు. పప్పు దినుసులు చూసి మంచి క్వాలిటీ కందిపప్పును సప్లయ్ చేయమని కాంట్రాక్టర్ కు చెప్పమన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తితో పాటు బార్ అసోసియేషన్ అధ్యక్షులు యేలేటి యోహాన్ (న్యూటన్), జైలు సూపరింటెండెంట్ డి . వెంకటగిరి, ప్యానల్ న్యాయవాదులు అంబేద్కర్, వెంకటరమణ, లోకేశ్వరరావు, జ్యోతి, భాగ్యశ్రీ, సునీత, ఉష, మహిమా జ్యోతి, అమూల్య, హర్షవర్ధన్, పారా లీగల్ వాలంటీర్లు సుధామ, జానకీరామ్, నాగేంద్ర కుమార్, జైలు సిబ్బంది పాల్గొన్నారు.



# గ్రంధాలాయాన్ని సందర్శించిన జె. సి.కల్పశ్రీ



**భీమవరం, జులై 18 ప్రభాతవార్త** భీమవరం పట్టణంలోని వీరమ్మ పార్కు వద్ద ఉన్న డాక్టర్ వైయస్సార్ మెమోరియల్ ప్రథమ శ్రేణి శాఖ గ్రంధాలయాన్ని జాయింట్ కలెక్టర్ కె.ఆర్ కల్ప శ్రీ శనివారం ఉదయం సందర్శించారు. గ్రంథాలయంలో ఉన్న సౌకర్యాలు, పుస్తకాల విభాగాలు, పాఠకులకు అందిస్తున్న సేవలను పరిశీలించారు. గ్రంధాలయంలో ఉన్న సమస్యలను పాఠకులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ఉన్న న్యూస్ పేపర్లు సరిపోవడం లేదని అదనంగా న్యూస్ పేపర్లు కావాలని, శాఖా గ్రంథాలయం సెలవు రోజున కూడా తెరిచి ఉంచాలని పాఠకులు జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. శాఖ గ్రంథాలయానికి ప్రతిరోజు 150 నుండి 200 మంది వరకు పాఠకులు వస్తున్నారని గ్రంథాలయ అధికారి జాయింట్ కలెక్టర్ కు తెలిపారు. ఎమ్మెస్కో స్వచ్ఛంద సేవా సంస్థ గ్రంథాలయానికి అందరికీ ఉపయోగపడే 263 పుస్తకాలు బహుకరించారని, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ జుత్తిగ నాగరాజు గ్రంథాలయానికి సొంత సొమ్ముతో 15 ట్యూబ్ లైట్లు అందించారని జాయింట్ కలెక్టర్ కు వివరించారు.గ్రంథాలయాన్ని ప్రజలకు మరింత చేరువ చేసే విధంగా అవసరమైన చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ అధికారులకు సూచించారు. విద్యార్థులు, యువత, ఉద్యోగార్థులు గ్రంథాలయ సేవలను సద్వినియోగం చేసుకుని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని జాయింట్ కలెక్టర్ కె.ఆర్ కల్పశ్రీ సూచించారు. జాయింట్ కలెక్టర్ వెంట గ్రంథాలయ అధికారి ఎస్. వెంకటేశ్వరరావు, సిబ్బంది పాఠకులు తదితరులు ఉన్నారు.

# పరిశోధనాత్మక ఆలోచనలతో ఎంటర్ప్రెన్యూర్లుగా యువ ఇంజనీర్లు తయారు కావాలి!




**భీమవరం జులై 18 ప్రభాతవార్త** సొసైటీకి అవసరమైన పరిశోధనాత్మక ఆలోచనలతో యువ ఇంజనీర్లు ఎంటర్ప్రెన్యూర్ గా తయారు కావాలని భీమవరం సాగి రామకృష్ణంరాజు ఇంజనీరింగ్ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిషాంత్ వర్మ విద్యార్థులకు సూచించారు. కళాశాల ఇంకు బేషన్స్ సెంటర్, కళాశాల ఎంటర్ప్రెన్యూర్ షిప్ సెల్, ఇన్స్టిట్యూషన్ ఇన్నోవేషన్ కౌన్సిల్ సంయుక్త ఆధ్వర్యంలో సృష్టి-2026 పేరిట కళాశాల స్థాయిలో ఐడియా తాన్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సెక్రటరీ కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిశాంత్ వర్మ మాట్లాడుతూ విద్యార్థుల్లో వినూత్న ఆలోచనలు గుర్తించి వాటిని ఉత్పత్తుల రూపంలో తీసుకువచ్చే విధంగా విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.వి మురళీకృష్ణంరాజు మాట్లాడుతూ ఇప్పటికే తమ విద్యార్థులు భీమవరంలోనే పలు స్టార్టప్ లు ప్రారంభించి లక్షల రూపాయలు నెలకు సంపాదిస్తున్నారని పేర్కొన్నారు. ఉద్యోగాల కన్నా స్టార్టప్లు ఏర్పాటుచేసి స్వయం ఉపాధి ని ప్రారంభించి మరొకరికి ఉపాధి కల్పించే చిన్న చిన్న పరిశ్రమలకు యువ ఇంజనీర్లు తమ ఆలోచనలతో ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు. అందుకు తమ కళాశాలలో అన్ని వనరులు వసతులు సాంకేతిక సలహాలు అందించేందుకు నిపుణులు ఉన్నారని ఆయన విద్యార్థులకు వివరించారు. కళాశాల ఇంక్యుబేషన్ సెంటర్ హెడ్ నంద్యాల శివ కిషన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కళాశాల చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సిహెచ్ దిలీప్ చక్రవర్తి, ఈఈఈ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ జి హరీష్ కుమార్ వర్మ తదితరులు విద్యార్థుల ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా మంచి ఆదాయ వనరులు అర్జించటంతో పాటు మరికొంతమందికి ఉపాధి అవకాశాలు కల్పించి స్టార్టప్లు లు ఏర్పాటుచేసినకళాశాల విద్యార్థులు, పూర్వ విద్యార్థులు కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు.

# అడివి నెక్కలం గ్రామానికి వరాల జల్లు

## -పశువుల డాక్టర్ను వెంటనే నియమించాలి

## మంత్రి కొలుసు పార్థసారధి



**ఆగిరిపల్లి:జూలై18 ప్రభాతవార్త** ఆగిరిపల్లి మండలం అడవినెక్కలంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో శనివారం మంత్రి పార్థసారధి పాల్గొన్నారు. గ్రామస్తులు సమస్యలను విన్నవించుకోగా మంత్రిప్రతి ఒక్కరితో మాట్లాడి తమ సమస్యలు క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించమనిసంబంధిత అధికారులకు ఆదేశించారు. గ్రామంలో పశువుల డాక్టర్ అందుబాటులో ఉండడం లేదని వచ్చిన ఒక గంట వ్యవధిలో వెళ్ళిపోతున్నారని ఫిర్యాదు ఇవ్వగా వెంటనే వేరే డాక్టర్ను నియమించాలని ఉన్నత అధికారులకు ఆదేశించారు. శానిటేషన్ డ్రైనేజీ పనులు త్వరలో పూర్తి చేయాలని,ప్రాథమిక ఆరోగ్య కేంద్రం , వైద్యున్ని నియమించాలని కోరగా త్వరలో నియమిస్తానని హామీ ఇచ్చారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వంటశాల ను పాఠశాలలో క్రీడా ప్రాంగణాన్ని త్వరలో సమకూరుస్తామని మంత్రి అన్నారు. కిడ్నీ పెన్షన్ అందించవలసిందిగా కోరగా క్షుణ్ణంగా పరిశీలించి త్వరలో పింఛన్ వచ్చే ప్రయత్నం చేస్తానని మంత్రి పేర్కొన్నారు. కొత్తగూడెం గ్రామానికి చెందిన సుబ్రహ్మణ్యం తమ గ్రామంలో సుమారు. 40 మంది రైతులకు ఫీజింగ్ ఫైలు కోరిలేషన్ ఫైలు సమస్యలు నివారించకుండా పట్టాదారు పాసుపుస్తకాలు మంజూరు చేయకూడదని కోరగా వెంటనే సబ్ కలెక్టర్ వినూత్నకు ఫోన్ చేసి సమస్యను పూర్తి చేసిన అనంతరం పాస్ పుస్తకాలు అందించాలని మంత్రి ఆమెను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# ముద్రగడ కుమార్తె క్రాంతిని పరామర్శించిన భీమవరం జనసేన పార్టీ నేతలు



**భీమవరం జులై 18 ప్రభాతవార్త** కాపు నాయకులు, మాజీ మంత్రివర్యులు ముద్రగడ పద్మనాభం అనారోగ్యంతో మరణించినందున రాజమహేంద్ర వరంలోని వారి కుమార్తె క్రాంతి ను శనివారం వారి స్వగృహంలో భీమవరం జనసేన పార్టీ నేతలు, భీమవరం కాపు కుటుంబ సభ్యులు కలిసి పరామర్శించారు. తండ్రిని కోల్పోయిన భాధలో ఉన్న ఆమెను తండ్రి ఆఖరి చూపును కూడా దూరం చేసిన వైఎస్సార్ సిపి (గొడ్డలి పార్టీ) నాయకుడు జగన్మోహన్ రెడ్డి అతని అనుచరులు తీరును తీవ్రంగా ఖండించారు. అధికారిక లాంఛనాలతో జరగాల్సిన అంత్యక్రియలను అడ్డుకుని కాపు నాయకుడు మాజీ మంత్రి ముద్రగడను వైసీపీ జగన్ తీవ్రంగా అవమానించారన్నారు. కాపు ఓట్ బ్యాంక్ కోసం ముద్రగడ సాక్షిగా వైఎస్సార్ సిపి చేసిన శవ రాజకీయాన్ని కాపు సామాజికవర్గం తీవ్ర ఆగ్ర ఆవేశాలకు లోనైన విషయాన్ని క్రాంతికి తెలియజేశారు. క్రాంతికి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసి మీ కుటుంబానికి జనసేన పార్టీ, కాపు కుటుంబ సభ్యులు ఎప్పుడూ అండగా ఉంటామని భరోసా అందించారు. భీమవరం కాపు కుటుంబ సభ్యులు యర్రంశెట్టి శివకృష్ణ, కొప్పినీడి భాస్కరరావు, పాపోలు ఆంజనేయులు, పిసిని సంతోష్, బొల్లం శివకృష్ణ, వర్ధినీడి వెంకట లక్ష్మి, నల్లం అన్నపూర్ణ, మాదాసు లలిత, భీమవరం జనసేన నాయకులు కాపు కుటుంబ సభ్యులు పాల్గొని నివాళిలర్పించారు.

# సంప్రదాయ బద్ధంగా వారాహి అమ్మవారి కలశ ఊరేగింపు



**భీమవరం జులై 18 ప్రభాతవార్త** భీమవరం డి మార్ట్ ఎదురుగా శ్రీస్వప్న వారాహి అమ్మవారి గుప్త నవరాత్రుల మహోత్సవంలో భాగంగా శనివారం కలశాలతో ఊరేగింపు నిర్వహించారు. వారాహి అమ్మవారి మాలధారణ చేపట్టిన 21 మంది మాలధారణ భక్తులు, లంకపేట వాసులు అమ్మవారికి మాలధారణ కమిటీ సభ్యులు చిగురుపాటి దేవ దాక్షిణ కుమార్, గంగా నాగ శాంతి, బి శాంతి రాణి, బి మావుళ్ళమ్మ పర్యవేక్షణలో అర్చకులు వేలూరి శివాజీ చే ప్రత్యేక పూజలను నిర్వహించారు. 11 రోజులపాటు అమ్మవారికి రోజుకొక వారాహి అమ్మవారి అలంకరణ జరుగుతుందని, 22న శాకాంబరీ అలంకరణ, 23న సారే సమర్పణ, 26న ముగింపు కార్యక్రమం జరుగుతుందని కమిటీ సభ్యులు తెలిపారు.

# ఆర్ టి సి గ్యారేజ్ లో స్వర్ణంధ్ర -స్వచంద్ర



**భీమవరం జులై 18 ప్రభాతవార్త** స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం లో భాగంగా మూడోశనివారం స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలను పశ్చిమ గోదావరి జిల్లా ప్రజా రవాణా అధికారి శ్రీ ఎస్. గిరిధర్ కుమార్ ఆధ్వర్యంలో గ్యారేజి,ట్రాఫిక్ ఉద్యోగులు,సూపర్వైజర్స్, కలసి శనివారం ఉదయం నుంచి కామన్ ప్రోటోకాల్‌ను పాటిస్తూ భీమవరం గ్యారేజి ఆవరణలో స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించడం జరిగినది అనంతరం ఉద్యోగులు శ్రమదానం చేసి పరిసరాలు పరిశుభ్రం చేయడం జరిగినది స్వచ్ఛతను తెలియజేసే, స్లొగన్స్ తో ఉద్యోగులతో స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయించి స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్ర కార్యక్రమాల ప్రాముఖ్యాన్ని వివరిస్తూ గ్యారేజి ఆవరణలో మొక్కలు నాటి భావితరాల వారి కోసం ఆక్సిజన్ నిల్వలు పెంచడం మనందరి బాధ్యత అని ప్రజా రవాణాధికారి తెలిపారు.

# నూజివీడులో పెద్ది సినిమా తరహా జోరుగా కౌంటింగ్ క్రికెట్ పందాలు పట్టించుకోని అధికారులు



**నూజివీడు, జులై 18 ప్రభాతవార్త:** పట్టణంలో నీ తిరువూరు రోడ్లోని క్రికెట్ గ్రౌండ్ లో జోరుగా కౌంటి క్రికెట్ నిర్వహిస్తున్నారు. నూజివీడు పరిస్థితి ప్రాంతాల నుంచి వందలాదిమంది గత కొన్ని రోజులుగా అక్కడకు చేరి క్రికెట్ పందాలు కొనసాగిస్తున్నారు. ఒక్కొక్క మ్యాచ్ కు రూ. లక్ష రూపాయలు పందెం కౌంటి క్రికెట్ సభ్యులు నిర్వహిస్తున్నారు.రోజుకి ఐదు నుండి ఆర్ మ్యాచులు నిర్వహిస్తున్న కౌంటీ క్రికెట్ నిర్వాహకులు ఒక్కో ఆటగాడిని రూ .10 వేల నుండి రూ. 20 వేల వరకు కౌంటింగ్ క్రికెట్ నిర్వహకులు చెల్లిస్తున్నారు. ఫీల్డింగ్ చేసిన వ్యక్తికి మ్యాచ్కు రూ. 200 చొప్పున పేమెంట్ చేస్తూ జూధాన్ని ప్రోత్సహిస్తున్నారు. పోలీస్ అధికారులు స్పందించి వీటిని నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# చాట్రాయి పంచాయతీలో సమస్యలు కోకొల్లులు

## -పట్టించుకోని స్పెషల్ ఆఫీసర్, పంచాయితీ కార్యదర్శి



**ప్రభాతవార్త చాట్రాయి** మండల కేంద్రమైన చాట్రాయిలో సమస్యలు చెప్పనలివి కాకుండా ఉన్నాయి. ముఖ్యంగా పారిశుధ్యం విషయాన్ని కొస్తే ఎక్కడ మురికి అక్కడే దర్శనమిస్తోంది. వార్షిద కార్మికులు లేక ఎక్కడ చెత్త అక్కడే ఉండటంతో దుర్వాసన వెదజల్లుతోంది. పారిశుద్ధ్య కార్మికులు ఇంటింటికి వచ్చి చెత్త తీసుకు వెళ్లాల్సి ఉండగా మండల కేంద్రమైన చాట్రాయిలో మాత్రం ఊసే లేదు. పంచాయతీ స్పెషల్ ఆఫీసర్ పంచాయతీ కార్యదర్శి పారిశుధ్య కార్మికులను నియమించి గ్రామాన్ని స్వచ్ఛ గ్రామంగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉన్నప్పటికీ పట్టించుకోకపోవడంతో మురికి తాండవం చేస్తోంది. ఐ వి ఆర్ ఎస్ కాల్స్ ద్వారా గ్రామంలో చెత్త సేకరణ పై, పారిశుధ్యం పై కాల్స్ వచ్చినప్పటికీ ప్రజలు చెత్త సేకరణ జరగటం లేదని చెప్పినా పట్టించుకునే నాధుడే కరువయ్యారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి శనివారం మాత్రం పారిశుధ్యం చేస్తున్నట్లు ఫోటోలు దిగి పైకి అప్లోడ్ చేయటం అనువాయితీగా మారింది. గ్రామంలో ఎక్కడ చూసినా చెత్త చెదారంతో నిండి ఉంది. ఇది ఇలా ఉండగా ఇక డ్రైనేజీ విషయానికొస్తే పూడిక పేరుకుపోయి నీరు ప్రవహించక మురికి నీరు రోడ్లపై ప్రవహిస్తోంది. డ్రైనేజీలు నెలకు ఒకసారి అయినా శుభ్రం చేయాల్సి ఉండగా పట్టించుకునే నాధుడే కరువయ్యారని ప్రజలు ధ్వజమెత్తుతున్నారు. మంచినీటి కష్టాలు కూడా ప్రజలకు ఇబ్బందులను కలిగిస్తున్నాయి. మోటార్లు కాలిపోయినా, పైపులైన్లు పగిలినా పట్టించుకునే వాడు లేకపోవడంతో రోజులు తరబడి తాగునీటి కష్టాలను ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రజలు ఎదుర్కొంటున్న కష్టాలను పిజిఆర్ఎస్ లో దరఖాస్తులు చేసినా స్పందన కరువైందని ప్రజలు వాపోతున్నారు. ఉన్నతాధికారులు ఇప్పటికైనా మండల కేంద్రమైన చాట్రాయి పై దృష్టి సారించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# దస్తావేజు లేఖరుల నిరసన

**అత్తిలి,జూలై 18( ప్రభాతవార్త)** అత్తిలి లో దస్తావేజు లేఖర్లు నిరసన కార్యక్రమం నిర్వహించారు. దస్తావేజు లేఖరుల అత్తిలి సంఘం ప్రతినిధులు దండమూరి వెంకటేశ్వరరావు, తమనంపూడి రామారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన 396 జి ఓ వల్ల రాష్ట్రవ్యాప్తంగా లక్షలాదిమంది దస్తవేజ్ లేఖర్లు ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. వారి కుటుంబాలు వీధినపడి ఆర్థికంగా దెబ్బతింటాయని అన్నారు. బ్రిటిష్ ప్రభుత్వ కాలం నుంచి డాక్యుమెంట్ రైటర్ల వ్యవస్థ కొనసాగుతూ వస్తుందన్నారు. గతంలో దస్తవేజు లేఖరులకు ప్రభుత్వమే లైసెన్స్ కూడా ఇచ్చేదన్నారు. గతంలో ప్రభుత్వం ఆ లైసెన్సులను రద్దు చేయడం జరిగిందన్నారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ప్రజలతో ప్రత్యక్ష అనుబంధం లేఖరులకు మాత్రమే ఉంటుందన్నారు. ప్రజలకు అవసరమైన విజ్ఞానాన్ని వారికి తెలియజేసి భూ చట్టాలు గురించి వివరించి వారికి అనుకూలంగా రిజిస్ట్రేషన్ ప్రక్రియలో దస్తావేజు లేఖరులు ఎంతగానో సహాయపడుతున్నారని అన్నారు. కొత్త జి ఓ వల్ల క్రయవిక్రయాలకు సంబంధించిన వివరాలు ప్రైవేట్ వ్యక్తులకు తెలియడం వల్ల కక్షిదారులు ఇబ్బందులు పడే ప్రమాదం ఉందన్నారు. ప్రభుత్వం ప్రైవేటు కేంద్రాలకు ఈ రిజిస్ట్రేషన్ ప్రక్రియ అప్పగించకుండా, దస్తవేజు లేఖరులకి లైసెన్సులు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉత్తర్వులు రద్దు చేయాలని కోరుతూ ఈనెల 20 నుండి 31 వరకు పెన్డౌన్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మేరకు సబ్ రిజిస్టర్ వివివి సత్యనారాయణకు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో వేమన సోమేశ్వరరావు రావూరి సూర్యనారాయణ మూర్తి ఆకుల సుబ్బారావు బలిజేపల్లి నరేష్, బాలం ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.


## నాయకులు కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి స్థానిక ఎన్నికల్లో విజయం సాధించాలి

### -రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి



**ఆగిరిపల్లి,జూలై:18 ప్రభాతవార్త** మండలంలోని ఆడివినెక్కలం లో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తల సమావేశం రాష్ట్ర పౌర సంబంధాల శాఖ మంత్రివర్యులు కొలుసు పార్థసారథి శనివారం నిర్వహించారు. ఈ సమావేశంలోమాట్లాడుతూ రానున్న స్థానిక ఎన్నికల్లో నూటికి నూరు శాతం తెలుగుదేశం పార్టీ కైవసం చేసుకోవాలని నాయకులు కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. నాయకులు కార్యకర్తలు సమిష్టిగా పనిచేసి స్థానిక ఎన్నికల్లో మండలంలోని అన్ని గ్రామాలు తెలుగుదేశం పార్టీ విజయం సాధించాలని సూచించారు. గ్రామాలలో ఎస్, సి, కాలనీలో ఓట్ల శాతం పెంచాలని అన్నారు. మండలంలో ఇప్పటికే అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని కోట్ల విలువ చేసే పనులు చేశామన్నారు. గత ప్రభుత్వం ఆర్థిక విధ్వంసం చేసి రూ.10 లక్షల కోట్లు అప్పు ఇచ్చింది, ఓ పక్క అప్పులు తీరుస్తూ అభివృద్ధి సంక్షేమాన్ని దూర దృష్టి ఉన్న మన రాష్ట్ర ముఖ్యమంత్రిచంద్రబాబునాయుడు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారన్నారు.గత ప్రభుత్వం రోడ్లు మరియు ఇరిగేషన్ ప్రాజెక్టులను గాలికి వదిలారన్నారు.2027 సంవత్సరానికి పోలవరం పూర్తిచేసి జాతికి అంకితం చేస్తామని అన్నారు.నిన్న జరిగిన అధికారుల సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో అత్యంత ప్రాధాన్యత కలిగిన 36 ప్రాజెక్టుల్లో చింతలపూడి ప్రాజెక్టు కు 7వ స్థానం ఇవ్వారని అన్నారు. గత ప్రభుత్వం అభివృద్ధిని వదిలి బటన్ నొక్కడమే అజెండాగా పెట్టుకుందని గంజాయి బ్యాచ్ ను పెంచిపోషిస్తుందని దుయ్యబట్టారు.సంవత్సరానికి నాలుగు లక్షల మంది విద్యార్థులు విద్యను పూర్తిచేసుకుని పట్టా తీసుకుంటారని కానీ వారికి ఉద్యోగ ఉపాధిని కల్పించడానికి పరిశ్రమల అభివృద్ధి మరింత అవసరమని అన్నారు. గ్రామంలో కోట్లు రూపాయలు వెచ్చించి సిసి రోడ్లు, డ్రైనేజీలు, నిర్మాణం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో త్రాగునీరు సిసి రోడ్లు నీటిపారుదల ప్రాజెక్టులు నిర్మించడంతో రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకెళుతుందన్నారు. కూటమి ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమమే కాకుండా వివిధ సామాజిక వర్గాల అభివృద్ధికి అత్యున్నతికి కట్టుబడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఎన్, వేణు,కూటమి నాయకులు కార్యకర్తలు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఇరగవరంలో స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమం



**ఇరగవరం,జూలై 18( ప్రభాతవార్త )** ఇరగవరం మండలం లోని గ్రామ పంచాయతీలలో స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఏ. శ్రీనివాస్ స్వచ్ఛ్ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమం ప్రతి గ్రామంలో ప్రత్యేక దృష్టి సారించి విస్తృతస్థాయిలో నిర్వహించారు. ప్రతి కుటుంబ పాడి చెత్తను వేరుగా సంపుల్లో నిల్వచేసే స్వచ్ఛ రథంకు ఇవ్వాలని అవగాహన కల్పించారు. తడి చెత్తను ప్రతిరోజు గ్రీన్ అంబాసిడర్ ద్వారా సేకరించి ఎస్ డబ్ల్యు పి సి తరలించడం రెండు దశల కంపోస్టింగ్ విధానం ద్వారా ఎరువుల తయారీ చేపట్టడం సాధ్యాలను జరగవలసిన ప్రక్రియ ను తెలిపారు.. ఇరగవరం గ్రామంలో స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమములో మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎ శ్రీనివాసు పాల్గొని గ్రామ ప్రజలందరూ పాల్గొని గ్రామ పరిశుభ్రతకు సహకరించవలసిందిగా తెలియ జెసారు . ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామాలలో రోడ్ల పక్కన ఉన్న చెత్త కుప్పలను పూర్తిగా తొలగించి, చర్యలు వేగంగా కొనసాగుతున్నాయని ప్రజలకు తెలిపారు.. రోడ్డు పక్కన, ఖాళీ ప్రదేశాల్లో, బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా బాధ్యతగా వ్యవహరించాలని ప్రజలను కోరారు.

## పితాని చేతుల మీదుగా రాజముద్రతో కూడిన పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణీ



**పెనుగొండ, జూలై-18,(ప్రభాతవార్త)** పెనుగొండ మండలం నడిపూడి గ్రామంలో శనివారం నిర్వహించిన "మీ భూమి -- మీ హక్కు" కార్యక్రమంలో ఆచంట శాసనసభ్యులు పితాని సత్యనారాయణ 760 మంది రైతులకు రాజముద్రతో కూడిన పట్టాదార్ పాస్ పుస్తకాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ మాట్లాడుతూ, రైతుల భూ హక్కులను మరింత బలోపేతం చేయడం, భూ రికార్డుల్లో పారదర్శకతను తీసుకురావడమే "మీ భూమి -- మీ హక్కు" కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. రాజముద్రతో కూడిన పట్టాదార్ పాస్ పుస్తకాలు రైతులకు భూ యాజమాన్యానికి బట్టబద్ధమైన గుర్తింపును అందించడంతో పాటు భవిష్యత్తులో ప్రభుత్వ సేవలు, బ్యాంకు రుణాలు మరియు ఇతర ప్రయోజనాలు పొందడంలో ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు.నడిపూడి గ్రామంలోని అర్హులైన రైతులందరికీ నూటికి నూరు శాతం పట్టాదార్ పాస్ పుస్తకాలు సిద్ధం చేసినందుకు తహసీల్దార్ అనిత కుమారిని ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన సేవలు అందించేందుకు అధికారులు ఇదే స్ఫూర్తితో పనిచేయాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో రెవెన్యూ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు మరియు రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నాయుడు రామకృష్ణ గౌడ్ ను పరామర్శించిన బడేటి చంటి



**టి.నర్సాపురం జూలై 18 ప్రభాతవార్త** మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నాయుడు రామకృష్ణ గౌడ్ మాతృమూర్తి నాయుడు నాంచారమ్మ కొద్ది రోజుల క్రితం స్వర్గస్తులయ్యారు. దీంతో శనివారం ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి నాయుడు రామకృష్ణ ను వారికుటుంబాన్ని పరామర్శించారు.ఈ సందర్భంగా బడేటి చంటి మాట్లాడుతూ నాయుడు నాంచారమ్మ ఆత్మ శాంతి కలగాలని కోరారు.రామకృష్ణ కు వారి సోదరులు ధర్మరాజు ,గురవయ్య ల కు వారికుటుంబానికి ధైర్యం చెప్పారు.ఈకార్యక్రమంలోజయ్యవరపుశ్రీరామ్మూర్తి,శీలంవెంకటేశ్వరరావు, ఏలూరు టిడిపి నాయకులు పెద్దిరాజు, ప్రశాంత్, జీలుగుమిల్లి తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సాయి, ముత్తారెడ్డి, కొండపల్లి రవి,కాల్నీడి రాంబాబు, పిన్నమ్మనేని మధు,కోరుకొండ భద్రం ,తదితరులు పాల్గొన్నారు

## బాల వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



**మొగల్తూరు, జూలై 18 (ప్రభాతవార్త):**పశ్చిమ గోదావరి జిల్లా మొగల్తూరు మండలం కొత్తట గ్రామంలోని శ్రీ బాల వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆలయ ప్రధాన అర్చకులు వేదమంత్రోచ్చారణల మధ్య స్వామివారికి అభిషేకం, అర్చన, అలంకరణ, నైవేద్య కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నసంతర్పణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, దాతలు, సేవకులు కార్యక్రమం విజయవంతానికి సహకరించారు.ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు మాట్లాడుతూ, స్వామివారి కృపతో గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో ఆలయ కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు.

## స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో విద్యార్థులతో సామూహిక ప్రతిజ్ఞ



**మొగల్తూరు, జూలై 18 (ప్రభాతవార్త):** పశ్చిమ గోదావరి జిల్లా మొగల్తూరు మండలం కొత్తట గ్రామపంచాయతీ పరిధిలోని జిల్లేడుతిప్ప గ్రామ ఎలిమెంటరీ పాఠశాల ఆవరణలో శనివారం స్వర్ణాంధ్ర--స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులతో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవడం, మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించడం, తాగునీటిని వృథా చేయకుండా వినియోగించడం, ఇంటి వద్ద నుంచి వచ్చే వృథా నీటిని మొక్కలకు ఉపయోగించేలా చర్యలు తీసుకోవడం వంటి అంశాలపై సామూహిక ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం విద్యార్థులు గ్రామ ప్రజలకు పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తూ చైతన్య కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కొత్తట గ్రామపంచాయతీ అభివృద్ధి అధికారి అంబటి శ్రీకళ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కందుల గంగరాజు, ఉపాధ్యాయురాలు సవితల శ్రావణి, పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## పార్టీ శ్రేణులతో కలసి జగన్ 2.0 సూపర్ యాప్ పోస్టర్‌ను ఆవిష్కరించిన రఘురాం

### -వైయస్‌ఆర్‌సీపీ నాయకులు, కార్యకర్తల అనుసంధాన వేదికే జగన్ 2.0 సూపర్ యాప్-జగన్ 2.0 సూపర్ యాప్ ను ప్రతి ఒక్కరూ డౌన్లోడ్ చేసుకోవాలి-వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త వడ్డీ రఘురాం నాయుడు



**తాడేపల్లిగూడెం జూలై 18 (ప్రభాతవార్త)** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకత్వానికి, కార్యకర్తలకు మధ్య అనుసంధాన వేదిక జగన్ 2.0 సూపర్ యాప్ అని ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త వడ్డీ రఘురాం నాయుడు తెలిపారు. స్థానిక సవిత్రుపేటలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన, పార్టీశ్రేణులతో కలిసి జగన్ 2.0 సూపర్ యాప్ పోస్టర్ ను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వడ్డి రఘురామ్ నాయుడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలుచేస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా, కార్యకర్తలను ఇబ్బందులకు గురి చేస్తూ అణచివేసే ధోరణిలో వ్యవహరిస్తోందని దుయ్యబట్టారు. కూటమి ప్రభుత్వం కుట్రలను తిప్పికొడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు, నాయకులకు మధ్య అనుసంధానంగా ఉండాలనే సదుద్దేశంతో జగన్ 2.0 సూపర్ యాప్ ను ఏర్పాటు చేయటం హర్షించదగ్గ విషయమని కొనియాడారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న దురాగతాలను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎప్పటికప్పుడు ఎండగడుతూనే ఉందని వివరించారు. ఈ కార్యక్రమంలో టౌన్ అధ్యక్షులు గొర్రెల శ్రీనివాసరావు, రూరల్ మండలం అధ్యక్షులు చిట్టూరి బాపన్న, పెంటపాడు అధ్యక్షుడు కైగల శ్రీనివాసరావు, మాకరాజు సతీష్, రెడ్డి రమేష్ రెడ్డి,మాకిరెడ్డి వెంకటేష్ రెడ్డి, ఇంజమూరి శ్రీనివాసరావు, ద్వారపూడి కిరణ్ రెడ్డి, గోపిశెట్టి దొరబాబు, సుబ్బితి బ్రహ్మయ్య ,రెడ్డి సూరిబాబు, కలిశెట్టి తాతారావు, బుడి ప్రసాద్, తానేటి అజయ్,మార్లపూడి సుబ్బారావు, చామన సూర్యచంద్రరావు, కండెల్లి రాజేష్, బండి నరసింహారావు, కర్రీ శివారెడ్డి ,ములపర్తి అఖిల్, తదితరులు పాల్గొన్నారు.

## ఎర్రకాలువ ముంపు సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు కృషి చేస్తా

### -ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్



**తాడేపల్లిగూడెం ..జులై 18 (ప్రభాతవార్త)** ఎర్ర కాలువ ముంపు సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. తాడేపల్లిగూడెం మండలంలోని మాధవరం గ్రామ పరిధిలో జరుగుతున్న ఎర్రకాలువ పనులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ మండలంలోని మాధవరం, జగన్నాథపురం గ్రామాల్లో ఎర్ర కాలువ ఆధునీకరణ, కాజ్ వే నిర్మాణం త్వరలో పూర్తిచేస్తామని తెలిపారు. ఎర్రకాలువ సమస్యకు శాశ్వత పరిష్కారమే లక్ష్యంగా అవసరమైన చర్యలు చేపడతామన్నారు. రెండు జిల్లాల సరిహద్దులో ఉన్న ఎర్రకాలువ వర్షాకాలంలో పొంగిపొర్లటంతో రైతులు, గ్రామస్తులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అత్యవసర పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని తాత్కాలికంగా సుమారు రూ.20 లక్షల వ్యయంతో తాత్కాలిక మార్గం (కాజ్‌వే) నిర్మించినట్లు తెలిపారు. శాశ్వత పరిష్కారంగా బ్రిడ్జి నిర్మిస్తే నీటి ప్రవాహం సాఫీగా జరిగి ముంపు సమస్య తప్పుతుందని తెలిపారు. ఇందుకు అవసరమైన నిధుల కోసం జిల్లా కలెక్టర్‌ను కోరనున్నట్లు వెల్లడించారు. మాధవరం నుంచి నిడదవోలు వెళ్లేందుకు ఇదే ప్రధాన మార్గమని, అందువల్ల ఈ మార్గాన్ని పరిరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. మిగిలిన పనులను కూడా సంబంధిత శాఖతో త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు. ఎర్రకాలువ ఆధునీకరణకు రూ.2.80 కోట్ల నిధులను మంజూరు చేసిన నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుకు కృతజ్ఞతలు తెలియజేశారు. భవిష్యత్తులో మరో రూ.6 కోట్ల నిధులు కేటాయిస్తే ఎర్రకాలువ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని చెప్పారు. మాధవరం, జగన్నాథపురం గ్రామాలకు ఎర్రకాలువ ముంపు నుంచి త్వరలోనే విముక్తి కలిగిస్తామని అన్నారు. ప్రజల ఆకాంక్షల మేరకు అహర్నిశలు కృషిచేసి సమస్యలను పరిష్కరిస్తామని అన్నారు. ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ లక్ష్యాల మేరకు ప్రతి గ్రామాన్ని సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## రుణాల రికవరీలో శ్రీనివాసపురం సొసైటీ రికార్డు

### -కార్యదర్శి సర్వేశ్వరరావుకు సత్కారం



**జంగారెడ్డిగూడెం రూరల్ జులై 18 ప్రభాత వార్త** జంగారెడ్డిగూడెం మండలం శ్రీనివాసపురం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (సొసైటీ) కార్యదర్శి ఎలికే సర్వేశ్వరరావు రుణాల రికవరీలో రాష్ట్ర స్థాయిలో 9వ స్థానం, ఏలూరు జిల్లాలో మొదటి స్థానం సాధించారు. ఈ ఘనత సాధించినందుకు గాను మాజీ డీసీసీబీ చైర్మన్ కరాటం రాంబాబు ఆయనను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కరాటం రాంబాబు మాట్లాడుతూ.. రుణాల మంజూరుతో పాటు వాటిని సకాలంలో వసూలు చేయడంలో సొసైటీ కార్యదర్శుల పాత్ర కీలకమన్నారు. రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చాటిన సర్వేశ్వరరావు ఇతరులకు ఆదర్శంగా నిలిచారన్నారు. జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ (డీసీసీబీ) ద్వారా రైతులకు అతి తక్కువ వడ్డీకే రుణాలు అందుతున్నాయని, రైతులు గడువులోగా వాటిని చెల్లించి వడ్డీ భారం నుంచి తప్పించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సొసైటీ చైర్పర్సన్ మానికల వెంకటేశ్వరరావు, అల్లూరి రామకృష్ణ, ఎలికే వెంకటేశ్వరరావు, ఎలికే ప్రసాద్, సత్రం లక్ష్మణరావు, బుద్దాల సత్యనారాయణ, సాధనాల కరుణ తదితరులు పాల్గొన్నారు.

## పారిజాతగిరిపై భక్తజన సందోహం

### -25న మహా గిరి ప్రదక్షిణ



**జంగారెడ్డిగూడెం జులై 18 ప్రభాత వార్త** జంగారెడ్డిగూడెం పారిజాతగిరి వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం భక్తుల రద్దీ పెరిగింది. స్వామివారికి సుప్రభాత సేవ, విశేష అలంకరణలు నిర్వహించారు. వేలాదిగా తరలివచ్చిన భక్తులు భూవరాహస్వామిని దర్శించుకుని, కంకణధారణతో ఏడుకొండల గిరి ప్రదక్షిణ చేశారు. భక్తులకు ఆలయం తరఫున అన్నప్రసాద వితరణ చేశారు.తొలి ఏకాదశి పురస్కరించుకుని ఈ నెల 25న ఉదయం 8:44 గంటలకు నిర్వహించబోయే 'మహా గిరి ప్రదక్షిణ' కరపత్రాన్ని ఆలయ ఈవో ఆర్వీ చందన, చైర్మన్ అల్లూరి రామకృష్ణ ఆవిష్కరించారు. 25న భూవరాహస్వామి ఆలయం నుండి ఉత్సవమూర్తులు, కోలాటాలు, వాహన సేవలతో గిరి ప్రదక్షిణ వైభవంగా సాగుతుందని, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు అన్నప్రగడ వీరరాఘవరావు, కొప్పుల నాగ సురేంద్ర, అబ్బిన దత్తాత్రేయ, పెరిచర్ల జగపతిరాజు తదితరులు పాల్గొన్నారు. శనివారం పూజా టికెట్లు, విరాళాల ద్వారా ఆలయానికి రూ. 1,11,990 ఆదాయం వచ్చినట్లు ఈవో ఆర్వీ చందన తెలిపా

## స్వచ్ఛాంధ్రే స్వర్ణాంధ్రకు బాట

### -జి.కొత్తపల్లిలో ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు



**జులై 18 ప్రభాత వార్త** పరిసరాల పరిశుభ్రతతోనే ప్రజల ఆరోగ్యం మెరుగుపడుతుందని ఎమ్మెల్యే పిలుపుఏలూరు జిల్లా, ద్వారకాతిరుమల మండలం, జి.కొత్తపల్లి గ్రామంలో నిర్వహించిన "స్వచ్ఛాంధ్ర--స్వర్ణాంధ్ర" కార్యక్రమంలో గోపాలపురం నియోజకవర్గ శాసనసభ్యులు మద్దిపాటి వెంకటరాజు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులతో కలిసి స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఎమ్మెల్యే స్వయంగా రోడ్డు పక్కన ఉన్న చెత్తను తొలగించి పరిశుభ్రత కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామంలో చెత్త సేకరణ కోసం రిక్షాలను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, "పరిసరాల పరిశుభ్రతతోనే ప్రజలు ఆరోగ్యంగా జీవించగలరు. ప్రతి ఒక్కరూ తమ ఇల్లు, వీధి, గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచే బాధ్యత తీసుకోవాలి. స్వచ్ఛమైన గ్రామాలే స్వర్ణాంధ్ర నిర్మాణానికి పునాది" అని అన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ కూచిపూడి ఉదయభాస్కర్, రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ లంకా సత్యనారాయణ, జి.కొత్తపల్లి సొసైటీ చైర్మన్ రేగంటి రాంబాబు, గోపాలపురం నియోజకవర్గ వాణిజ్య విభాగం అధ్యక్షుడు ఇమ్మడి రత్నాజీ, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు పాతూరి సహృదయ, నియోజకవర్గ ఐటీడీపీ అధ్యక్షుడు కొత్తపల్లి భరత్, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి మట్టపర్తి రూపేష్ కుమార్, మండల ఐటీడీపీ అధ్యక్షుడు ఏపూరి కిషోర్, నల్లజర్ల మండల ఐటీడీపీ అధ్యక్షుడు నాగ రఘు, పార్టీ నాయకులు మొగతడకల ఓం ప్రకాష్, ఘంటా నరసయ్య, రేగంటి వెంకటేశ్వరరావు, ఎంపీడీవో ప్రకాష్, వివిధ గ్రామాల నాయకులు, స్థానిక అధికారులు, మహిళలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## అనారోగ్య బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్

### -చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే నాయకర్



**నరసాపురం రూరల్ జూలై 18 ప్రభాతవార్త** నరసాపురం మండలంలోని సారవ, చిట్టవరం, రుస్తుంబాద, కంసాలిబేతపూడి గ్రామాలకు చెందిన లబ్ధిదారులు అనారోగ్య చికిత్స కోసం చేసిన వైద్య ఖర్చులకు సంబంధించి ముఖ్యమంత్రి సహాయ నిధికు దరఖాస్తు చేసుకోగా మంజూరైన రూ.2,70,500 విలువైన సి.ఎం.ఆర్.ఎఫ్. చెక్కులను ప్రభుత్వ విప్ మరియు నరసాపురం శాసనసభ్యులు బొమ్మిడి నాయకర్ లబ్ధిదారులకు అందజేశారు.ఈ సందర్భంగా బొమ్మిడి నాయకర్ మాట్లాడుతూ, ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో ఉపయోగకరంగా నిలుస్తోందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు.

## తెదేపా జిల్లా అధ్యక్షుడు మంతెన రామరాజును పరామర్శించిన బాబ్జి



**తాడేపల్లిగూడెం జులై 18 (ప్రభాతవార్త)** తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు, ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు ఇటీవల శస్త్రచికిత్స చేయించుకుని ప్రస్తుతం తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో తాడేపల్లిగూడెం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి, భవన మరియు ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు చైర్మన్ వలవల మల్లికార్జునరావు (బాబ్జి) శనివారం ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. రామరాజు ఆరోగ్య పరిస్థితిని బాబ్జి అడిగి తెలుసుకున్నారు. వైద్యుల సూచనలు మేరకు పూర్తి విశ్రాంతి తీసుకోవాలని రామరాజుకు సూచించారు. ఆయన త్వరగా కోలుకుని ప్రజా సేవలో తిరిగి చురుకుగా పాల్గొనాలని బాబ్జి ఆకాంక్షించారు.

## విద్యార్థులకు నోటు పుస్తకాలు, స్టేషనరీ, ఆట సామగ్రి పంపిణీ




**మొగల్తూరు, జూలై 18 (ప్రభాతవార్త):** పశ్చిమ గోదావరి జిల్లా మొగల్తూరు మండలం ముత్యాలపల్లి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఆరోగ్య వర్షిణీ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు నోటు పుస్తకాలు, స్టేషనరీ సామగ్రి, ఆట వస్తువులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ నాగిడి రాంబాబు మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు అవసరమైన విద్యా సామగ్రిని అందించడం ట్రస్ట్ ప్రధాన లక్ష్యమని తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వంలో విద్యలో రాణించాలని ఆకాంక్షించారు.పాఠశాల ఉపాధ్యాయులు ట్రస్ట్ సేవలను అభినందిస్తూ, విద్యార్థులకు అందించిన విద్యా సామగ్రి వారి చదువుకు ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కృష్ణ ప్రసన్న, విజయజ్యోతి, దొంగ శ్రీను, గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## సింహాచలం అప్పన్న స్వామి అలంకరణలో లక్ష్మీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి దర్శనం



**మొగల్తూరు, జూలై 18 (ప్రభాతవార్త):** పశ్చిమ గోదావరి జిల్లా మొగల్తూరు మండలం కేపీ పాలెం గ్రామపంచాయతీ పరిధిలోని యాళ్లవారి మెరకలో వెలసిన శ్రీ లక్ష్మీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం స్వామివారికి విశేష అలంకరణ నిర్వహించారు.ఈ సందర్భంగా స్వామివారిని సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీ నరసింహస్వామి (అప్పన్న స్వామి) వారి అలంకరణలో సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చారణల నడుమ పూజా కార్యక్రమాలు నిర్వహించగా, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.అలంకరించిన స్వామివారి దివ్యమంగళ రూపం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

## ఐకేపీ వీఓఏలకు ఉద్యోగ భద్రత కల్పించాలి: సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు తెలగంశెట్టి సత్యనారాయణ




**మొగల్తూరు, జూలై 18 (ప్రభాతవార్త):** ఐకేపీ వీఓఏలకు ఉద్యోగ భద్రత కల్పించి, వారి పెండింగ్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీఐటీయూ పశ్చిమగోదావరి జిల్లా ఉపాధ్యక్షుడు తెలగంశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు.మొగల్తూరు మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన ఐకేపీ వీఓఏల జనరల్ బాడీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో స్వయం సహాయక సంఘాల అభివృద్ధికి వీఓఏలు ఎన్నో సంవత్సరాలుగా విశేష సేవలు అందిస్తున్నప్పటికీ, వారికి ఉద్యోగ భద్రత, కనీస వేతనాలు, ఇతర సంక్షేమ ప్రయోజనాలు కల్పించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.దీర్ఘకాలంగా విధులు నిర్వహిస్తున్న వీఓఏలను రెగ్యులరైజ్ చేసి, వారి న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. వీఓఏల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోకపోతే ఆందోళనలను మరింత ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ సమావేశంలో వై. పద్మ, బి. దేవి, బి. పార్వతి, డి. పుష్ప, పి. ప్రసన్న, డి. దుర్గ, సి. కమలకుమారి, వి. సీత, టి. లక్ష్మి, టి. రమాదేవి, మల్లేశ్వరి, సీఐటీయూ నాయకులు, ఐకేపీ వీఓఏలు పాల్గొన్నారు.

## రోడ్డు మెటీరియల్ దుర్వినియోగం చేసిన వ్యక్తిపై కేసు

**అత్తిలి,జూలై 18( ప్రభాతవార్త)** అత్తిలి మండలం మంచిలి కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయం వెనుక నిల్వచేసిన రోడ్డు మెటీరియల్ దుర్వినియోగం చేశాడనే ఆరోపణపై అదే గ్రామానికి చెందిన నల్లమిల్లి వెంకట కృష్ణారెడ్డి పై కేసు నమోదు చేసినట్లు అత్తిలి ఎస్ ఐ కేవీన్ విశ్వనాథ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మంచిలి నుండి కోరుకొల్లు రహదారి నిర్మాణం నిమిత్తం రెండు లక్షలు విలువచేసే 35 యూనిట్ల రోడ్డు మెటీరియల్ ను ఆలయ వెనుక కాంట్రాక్టర్ గుమస్తా మేడికొరడ శ్రీ రామకృష్ణ నిల్వ చేసినట్లు తెలిపారు. అయితే మంచిలి గ్రామానికి చెందిన వెంకట కృష్ణారెడ్డి ట్రాక్టర్ డ్రోజర్ తో మెటీరియల్ ను చదును చేసేసాడని తెలిపారు. దీనితో మెటీరియల్ మట్టిలో కలిసిపోయిందని అన్నారు. కాంట్రాక్టర్ సింద్రకొల్లు వీరభద్రరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.